ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 19.05.2026 | సంపుటి : 12 సంచిక : 299 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## అదిగదిగో బుల్లెట్ రైలు..

### ముంబయి- అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ఫస్ట్‌లుక్ విడుదల

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రతిష్టాత్మక ముంబయి-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు ప్రాజెక్ట్‌కు సంబంధించిన తొలి చిత్రం బయటకొచ్చింది. ఈ రెండు నగరాల మధ్య పరుగులు పెట్టనున్న హైస్పీడ్ రైలుకు సంబంధించిన చిత్రాన్ని దిల్లీలోని రైల్వే మంత్రిత్వ శాఖ భవనం గేటు నంబర్ 4 వద్ద ప్రదర్శించారు. ప్రస్తుతం ఈ చిత్రం ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. పక్షి ఆకారం నుంచి ప్రేరణ పొంది ఈ రైలును రూపొందించినట్లు తెలుస్తోంది. గంటకు సుమారు 300 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లేలా ఈ బుల్లెట్

మిగతా 2లో..



## వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణలు చేపట్టండి

### అన్ని రాష్ట్రాల హైకోర్టులకు సీజేఐ సూచనలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అన్ని రాష్ట్రాల హైకోర్టు సీజేలకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచనలు చేశారు. కేసుల విచారణలో సుప్రీంకోర్టు అనుసరిస్తున్న విధానాన్ని పాటించాలని సూచించారు. సోమ, శుక్ర వారాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణలు చేయాలన్నారు. ఇవాళ సుప్రీంకోర్టులోని అన్ని బెంచ్‌లలో వీడియో కాన్ఫరెన్స్

మిగతా 2లో..

వారానికి రెండు రోజులు ఈ పద్ధతిని అనుసరించండి

**ఉమర్ ఖాలిద్‌కు బెయిల్ నిరాకరణపై సుప్రీం కోర్టు అసంతృప్తి**

2లో..

## కేబీఆర్ పార్కు పరిధిలో చెట్లను నరకొద్దు

### సుప్రీం కోర్టు

**హైదరాబాద్(జనంసాక్షి):** నగరంలోని కేబీఆర్ పార్కు వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణంపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో తదుపరి విచారణ వరకు చెట్లను కొట్టేయొద్దని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. పార్కు పరిధిలో పర్యావరణ సున్నిత ప్రాంతంలో 25- 30 మీటర్ల పరిధిలో ఉన్న చెట్లను కొట్టేయొద్దని ఆదేశించింది. ఈ పనుల కోసం పార్కు పరిధిలో సుమారు 1,300 చెట్లు నరికేస్తున్నారని పిటిషనర్ల తరఫు న్యాయవాది వివేక్‌రెడ్డి వాదించారు. ప్రణాళిక

మిగతా 2లో..



## కేరళంలో కొలువుదీరిన యూడీఎఫ్ సర్కారు




### ముఖ్యమంత్రిగా సతీశన్ ప్రమాణం

**ఆయనతోపాటు మరో 19 మంది మంత్రులు కూడా..**

**హాజరైన రాహుల్, ప్రియాంక, ఖర్గే, రేవంత్ రెడ్డి**

**తిరువనంతపురం(జనంసాక్షి):** కేరళ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీడీ సతీశన్ కేరళం రాష్ట్ర కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఉదయం గవర్నర్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. తిరువనంతపురంలోని సెంట్రల్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే.. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. కాగా, మొత్తం 20 మందితో మంత్రివర్గం ఏర్పాటు అయింది. సతీశన్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగా.. 20 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 20 మందిలో 14 మంది తొలిసారిగా బాధ్యతలు చేపట్టినవారే కావడం గమనార్హం. సామాజిక, ప్రాంతీయ, మిత్రపక్షాల సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని కాంగ్రెస్ అధిష్ఠానం మంత్రులను ఎంపిక చేసింది. దీంతో దశాబ్దం తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) తిరిగి అధికారంలోకి వచ్చింది. కేరళ ప్రతిపక్ష

మిగతా 2లో..



## కేరళంలోనూ మహిళలకు ఉచిత బస్సు

**సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక విభాగం**

**ఆశావర్కర్ల గౌరవ వేతనం రూ.3వేలకు పెంపు**

**తొలి క్యాబినెట్ సమావేశంలోనే కీలక సంక్షేమ, పాలనా సంబంధిత నిర్ణయాలను ప్రకటించిన సీఎం వీడి సతీశన్**

**తిరువనంతపురం(జనంసాక్షి):** కేరళలోనూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. కేరళం ముఖ్యమంత్రిగా సోమవారంనాడు ప్రమాణస్వీకారం చేసిన వీడి సతీశన్ తొలి క్యాబినెట్ సమావేశంలోనే కీలక సంక్షేమ, పాలనా సంబంధిత నిర్ణయాలను ప్రకటించారు. జూన్ 15వ తేదీ నుంచి మహిళలకు కేఎస్ఆర్టీసీ బస్సులలో ఉచిత

మిగతా 2లో..

## బండి భగీరథ్‌పై అదనపు సెక్షన్లు

### మరింత పకడ్బందీగా కేసు విచారణ



**హైదరాబాద్(జనంసాక్షి):** పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్‌పై పోలీసులు మరో సెక్షన్ అదనంగా చేర్చారు. బీఎన్ఎస్ 64(2)(ఓ) సెక్షన్‌ను నమోదు చేశారు. బాధితురాలిపై పలుమార్లు అత్యాచారం చేశాడనే ఆరోపణలపై ఈ సెక్షన్ దర్యాప్తు అధికారులు జత చేశారు. దీనిప్రకారం నేరం రుజువైతే పదేళ్లకు మించి జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఒక్కోసారి జీవిత ఖైదు కూడా విధించవచ్చు. నెల 8న బాధితురాలైన మైనర్‌పై లైంగిక వేధింపులు జరిగాయంటూ ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లినప్పుడు.. పోలీసులు హైడ్రామా మధ్య సెక్షన్ 74, 75 అఫ్ బీఎన్ఎస్, సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్

మిగతా 2లో..

## కోట్లు ఖర్చు పెట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారు

- బండి సంజయ్‌ను లక్ష్యంగా చేసుకుని కేటీఆర్ అసత్యప్రచారాలు చేస్తున్నాడు
- ఆయన తప్పు చేయలేదు. ఆయన కుటుంబ సభ్యులు తప్పు చేస్తే..

న్యాయపరంగా చర్యలుంటాయి : రాష్ట్ర భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు

2లో..

## ఇంధనం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారం

- మరింత పటిష్టంగా భారత్-నార్వే బంధం
- ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఏర్పాటు
- ఆ దేశ పర్యటనలో ప్రధాని మోడీ కీలక ప్రకటన




**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్-నార్వే సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లే దిశగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. అలాగే స్వచ్ఛ ఇంధనం, సముద్ర రంగం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారాన్ని మరింత బలోపేతం చేయనున్నట్లు ప్రధాని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్‌కు మద్దతుగా నిలిచినందుకు నార్వే ప్రభుత్వానికి మోదీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, ఆర్థిక అస్థిరత పెరుగుతున్న సమయంలో భారత్-యూరప్ భాగస్వామ్యం మరింత కీలకమైందని మోదీ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ నిబంధనలు, శాంతి భద్రతల పరిరక్షణలో భారత్, యూరప్ కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. భారత్-ఈయూ మధ్య చారిత్రక ఒప్పందంతో భారత్, నార్వేకు అనేక ప్రయోజనాలున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్-నార్వే మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కుదిరిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇస్రో-నార్వే స్పేస్ ఏజెన్సీ మధ్య ఒప్పందం కుదిరిందని, పరిశోధనల కోసం నార్వే సహాయం తీసుకుంటామని పేర్కొన్నారు. నార్వే సంస్థలు భారతదేశంలో గ్రీన్ ఎనర్జీ, షిప్పింగ్, బ్లూ ఎకానమీ,

మిగతా 2లో..

### నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో

## మరో అరెస్టు

**పుణెకు చెందిన ఓ బ్యూటీషియన్‌ను అదుపులోకి తీసుకున్న సీబీఐ అధికారులు**




**న్యూఢిల్లీ(జనంసాక్షి):** నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా ఎన్నో కుటుంబాలను ఆందోళనలో పడేసింది. ఈ లీక్ వెనక ఒక బ్యుటీషియన్ హస్తం ఉందని సీబీఐ ప్రాథమికంగా గుర్తించింది. ఆమే.. 46 ఏళ్ల మనీషా వాఘ్మారే. పుణెకు చెందిన కెమిస్ట్రీ, బోటనీ ప్రొఫెసర్ల అరెస్టుల్లో ఆమె పేరు వినిపించిన సంగతి తెలిసిందే. మనీషా వాఘ్మారే.. మహారాష్ట్రలోని పుణెలో బ్యూటీ పార్లర్ నడుపుతోంది. ఆమెను మే 14న సీబీఐ అరెస్టు చేసింది. ప్రస్తుతం దర్యాప్తు సంస్థ కస్టడీలో ఉంది. ఆమె అరెస్టు అయిన రోజే కెమిస్ట్రీ ప్రొఫెసర్ పీవీ కులకర్ణిని అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత రోజు బోటనీ ప్రొఫెసర్ మనీషా గురునాథ్ మందరే అరెస్టు అయ్యారు. నీట్ ప్రశ్నపత్రం తయారీ ప్యానల్‌లో సభ్యురాలైన మనీషా గురునాథ్ మందరేకు బోటనీ, జువాలజీ పేపర్ల యాక్సెస్ ఉందని కోర్టుకు దర్యాప్తు సంస్థ వెల్లడించింది. వాఘ్మారే,

మిగతా 9లో..

### ప్రమాదాల సమయంలో

## గోల్డెన్ అవర్ కీలకం


**తక్షణం స్పందిస్తే ప్రమాదాల నివారణ సాధ్యం**

**మాక్ డ్రిల్ ప్రారంభించిన మంత్రి పొంగులేటి**




**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడడం, వీలైనంత వరకూ ఆస్తులకు నష్టం కలగకుండా చూడడమే లక్ష్యంగా ప్రభుత్వ పనిచేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ప్రపంచ స్థాయి సాంకేతికతతో విపత్తు రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విపత్తు నిర్వహణ మాక్ ఎక్సర్‌సైజ్‌లలో భాగంగా, హైదరాబాద్ లోని నెక్లెస్ రోడ్డు రోడ్ హెచ్‌ఎండీఏ గ్రౌండ్స్ వద్ద సోమ వారం నిర్వహించిన మాక్ డ్రిల్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభిం చారు. అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో విపత్తు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వివిధ రాష్ట్రాలలో అమలు చేస్తున్న అత్యుత్తమ విధానాలకు అనుగుణంగా తెలంగాణలో విపత్తు నిర్వహణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి విపత్తులు, అగ్నిప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొవడానికి ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, అత్యాధునిక పరికరాలను పరిశీలించి, వాటి వివరాలతో కూడిన సమగ్ర నివేదికను, ప్రతిపాదనలను వెంటనే

మిగతా 2లో..



## హైదరాబాద్‌లో హైటెక్ మాల్‌ప్రాక్టీస్..


### 12 మంది అరెస్టు

**మల్కాజ్‌గిరి(జనంసాక్షి):** నగరంలోని మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో హైటెక్ మాల్‌ప్రాక్టీస్ రాకెట్‌ను నాచారం పోలీసులు ఛేదించారు. సీఎస్ఐఆర్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ మల్టీటాస్కింగ్ స్టాఫ్ ఉద్యోగ నియామక పరీక్షలో ఉల్లంఘనలకు పాల్పడినట్లు గుర్తించారు. అత్యాధునిక రహస్య ఎలక్ట్రానిక్ పరికరాల సహాయంతో పరీక్షలో అక్రమాలకు

మిగతా 2లో..

## రూటు మార్చిన ఇరాన్

**సముద్రగర్భ కేబుల్స్‌కు ఇరాన్ కత్తెర ● అమెరికా టెక్ దిగ్గజాల నుంచి వసూళ్లు..?**



**టెహ్రాన్(జనంసాక్షి):** హార్మూజ్ జలసంధిని మూసేసి ఇటీవల 'చమురు' షాకులిచ్చిన ఇరాన్.. ఇప్పుడు ప్రపంచంపై మరో పిడుగు వేసేందుకు సిద్ధమవుతున్నట్లు కన్పిస్తోంది. ఈ జలసంధి కింద ఉన్న సముద్ర గర్భ ఇంటర్నెట్ కేబుళ్లపై ఫీజులు వసూలుచేయాలని టెహ్రాన్ ప్రణాళికలు వేస్తోంది. ఈ మేరకు ఇరాన్ అధికారిక మీడియా సంచలన కథనం ప్రచురించింది. సముద్ర గర్భ కేబుళ్ల కోసం హార్మూజ్‌ను వినియోగించుకుంటున్నందుకు గానూ గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్ వంటి టెక్ కంపెనీలపై రుసుములు విధించాలని ఇరాన్ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ సంస్థలన్నీ ఇరాన్ చట్టాలకు అనుగుణంగా నడుచుకునేలా, సబ్‌మెరైన్ కేబుల్ ఆపరేటర్లు లైసెన్సు ఫీజులు చెల్లించేలా కొత్త ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ కొత్త విధానాలు అమల్లోకి వస్తే టెక్ సంస్థలు తమ సముద్ర గర్భ కేబుళ్ల నిర్వహణ, మరమ్మతు హక్కులను కూడా ప్రత్యేకంగా ఇరాన్ కంపెనీలకు అప్పగించాల్సి ఉంటుందట. ఈ ఫీజులను ఎలా, ఎంత వసూలు చేస్తారన్న దానిపై స్పష్టత లేనప్పటికీ.. ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ అనుబంధ మీడియాలో ఈ కథనం రావడం సంచలనం సృష్టిస్తోంది. ఈ ఫీజులు చెల్లించేందుకు నిరాకరించే కంపెనీలు డేటా ట్రాఫిక్ అంతరాయాలను చవిచూడాల్సి వస్తుందని కూడా ఆ కథనం హెచ్చరించడం గమనార్హం. కాగా.. 'ఇంటర్నెట్ కేబుళ్లపై ఫీజులు వసూలు చేస్తాం' అని గతవారం ఇరాన్ మిలిటరీ అధికార ప్రతినిధి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అయితే, ప్రస్తుతం టెహ్రాన్‌కు అమెరికా కంపెనీలు ఎలాంటి చెల్లింపులు చేయకుండా ఆర్థిక ఆంక్షలు అమల్లో ఉన్నాయి. మరి.. ఈ కొత్త విధానాలు అమలుచేస్తే టెక్ కంపెనీలు ఎలా స్పందిస్తాయన్న దానిపై స్పష్టత లేదు. అంతర్జాతీయ డిజిటల్ కనెక్టివిటీకి సముద్రగర్భ కేబుళ్లే ప్రధాన ఆధారం. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఇంటర్నెట్, డేటా ట్రాఫిక్ వీటి నుంచే

మిగతా 2లో..




### రెండు నెలలకు సరిపడా ఇంధనం

**దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలకు ఎలాంటి కొరతా లేదు**

**ఇంధన నిల్వలపై అసత్య ప్రచారం నమ్మొద్దు స్పష్టం చేసిన కేంద్రం**

2లో..

**అమెరికా ఆంక్షలున్నా రష్యా నుంచి చమురు**

## కొనుగోళ్లు ఆగవు

**దేశీయ ఇంధన అవసరాలు, ప్రయోజనాలకు అనుగుణంగానే ముడి చమురు దిగుమతులు ఉంటాయి : కేంద్రం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశీయ ఇంధన అవసరాలు, ప్రయోజనాలకు అనుగుణంగానే ముడి చమురు దిగుమతులు ఉంటాయని కేంద్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది. అమెరికా ఆంక్షల సడలింపు ఉన్నా, లేకపోయినా రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కొనసాగుతాయని స్పష్టం చేసింది. రష్యా పెట్రోలియం ఉత్పత్తులపై అమెరికా ఆంక్షల మినహాయింపు గడువు ముగిసిన నేపథ్యంలో కేంద్రం దీనిపై తాజాగా స్పందించింది. "రష్యా చమురుపై అమెరికా ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు కూడా భారత్ అక్కడి నుంచి

మిగతా 2లో..



### తెలంగాణలో పలు జిల్లాలకు

## వర్షసూచన

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ద్రోణి, ఉపరితల చక్రవాత ఆవర్తనం ప్రభావంతో ఇవాళ, రేపు, ఎల్లుండి ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు

మిగతా 2లో..



## రహదారి రక్తసిక్తం

**ముంబై(జనంసాక్షి):** ముంబయి-అహ్మదాబాద్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మహారాష్ట్ర పరిధిలోని ధనివరిలో పశువుల్ని తరలిస్తున్న కంటైనర్‌ను ఓ ట్రక్కు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 12మంది ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు.

మిగతా 2లో..

- ముంబయి-అహ్మదాబాద్ హైవేపై చోటుచేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదం
- కంటైనర్‌ను ఢీకొన్న ట్రక్కు
- 12 మంది దుర్మరణం

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
19.05.2026



## కేబీఆర్ పార్కు పరిధిలో చెట్లను నరకొద్దు

ఏమైనా ఉందా? చెట్లు తొలగించకుండా నిర్మించవచ్చా? అని న్యాయస్థానం ప్రశ్నించింది. అలాంటిదేమీ లేదని న్యాయవాది వివేక్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. వాస్తవానికి ప్రభుత్వమే చెట్లను తొలగిస్తోందని.. రాత్రి, పగలు తేడా లేకుండా చెట్లు నరుకుతున్నారని వివరించారు. పర్యావరణ సున్నిత ప్రాంతంలో చెట్లు నరకొద్దని అభివృద్ధి బోర్డు చెప్పిందన్నారు. వాదనల అనంతరం ప్రతివాదులుగా రాష్ట్రప్రభుత్వం, కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖలకు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జులై 27కి వాయిదా వేసింది.

## వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణలు చేపట్టండి

ద్వారా విచారణ జరిగింది. కేసు విచారణ వర్చువల్‌గా ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగిందని న్యాయవాది ముకుల్ రోహత్గీ అన్నారు. హైకోర్టుల్లోనూ ఇలాగే జరిగేలా చూడాలని సీజేఐకి విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన సీజేఐ.. గత శుక్రవారమే హైకోర్టుల సీజేలకు సూచనలు చేశామన్నారు.

## ఉమర్ ఖాలిద్‌కు బెయిల్ నిరాకరణపై 'సుప్రీం' అసంతృప్తి

2020 నాటి దిల్లీ అల్లర్ల కేసులో జేఎన్‌యూ మాజీ విద్యార్థి నేతలు ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్‌కు బెయిల్ నిరాకరిస్తూ.. ఈ ఏడాది జనవరిలో జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అంజారియా ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం కేసుల విచారణలో తీవ్ర జాప్యం, విచారణకు ముందు సుదీర్ఘ కాలం నిర్బంధంలో ఉంచడం వంటి సమయాల్లో బెయిల్ మంజూరు చేయవచ్చని, 2021లో ఓ కేసులో ముగ్గురు న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ జడ్జిమెంట్‌ను జనవరిలో తీర్పు ఇచ్చిన సమయంలో ధర్మాసనం సరిగా అనుసరించలేదని వ్యాఖ్యానించింది. ఉపా కేసులో ఆరేళ్లకు పైగా కస్టడీలో ఉన్న సయ్యద్ ఇఫ్తికార్ అంద్రాబీకి బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. గతంలో ధర్మాసనం అనుసరించిన విధానాన్ని అంగీకరించడం కష్టమని వ్యాఖ్యానించింది. ఉపా కేసులలో సుదీర్ఘకాలం జైల్లో ఉంచడం, విచారణలో జాప్యం వంటి కారణాలతో బెయిల్ మంజూరు చేయవచ్చని స్పష్టం చేసింది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా 2020 ఫిబ్రవరిలో దిల్లీలో జరిగిన హింసాత్మక నిరసనలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ అల్లర్లలో దాదాపు 53 మంది మృతి చెందగా.. 700 మందికి పైగా గాయపడ్డారు. ఈ అల్లర్లకు సంబంధించి 15 మందిని నిందితులుగా పేర్కొంటూ చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం (ఉపా) కింద ఛార్జిషీట్ నమోదు చేశారు. వీరిలో ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్ సహా ఏడుగురు నిందితులకు బెయిల్ ఇచ్చేందుకు గతేడాది సెప్టెంబరులో దిల్లీ హైకోర్టు నిరాకరించింది. ఆ తీర్పును సవాల్ చేస్తూ వీరు సుప్రీంకోర్టు ను ఆశ్రయించారు. దీనిపై జనవరిలో విచారణ జరిపిన జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అంజారియా ధర్మాసనం ఐదుగురు నిందితులకు బెయిల్ మంజూరు చేసింది. ఖాలిద్, ఇమామ్‌కు మాత్రం బెయిల్ ఇవ్వడానికి నిరాకరించింది. ఈ కేసులో మిగతా నిందితులతో పోలిస్తే వీరిద్దరిపై అభియోగాలు బలంగా ఉన్నాయని పేర్కొంది.

## అదిగదిగో బుల్లెట్ రైలు..

రైలును డిజైన్ చేశారు. ఇది అందుబాటులోకి వస్తే రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య ప్రయాణానికి 7 గంటలకు పైగా పడుతుండగా.. బుల్లెట్ రైలులో కేవలం 2 గంటల్లోనే గమ్యస్థానానికి చేరుకోవచ్చు. వచ్చే ఏడాది ఆగస్టు 15న ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# కేరళంలో కొలువుదీరిన యూడీఎఫ్ సర్కారు





నాయకుడిగా బాధ్యత లు చేపట్టిన మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, సిద్ధరామయ్య, సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తదితరులు హాజరయ్యారు. పార్టీ వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం.. సీఎం సతీశన్ ఆర్థిక, ఓడరేవుల శాఖలతో సహా పలు కీలక పోర్ట్‌ఫోలియోలను తనవద్దే ఉంచుకునే అవకాశం ఉంది. సీనియర్ కాంగ్రెస్ నేత రమేష్ చెన్నితాలకు విజిలెన్స్‌తో పాటు హోం శాఖ బాధ్యతలను అప్పగించనున్నట్లు తెలుస్తోంది. కేరళ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సన్నీ జోసెఫ్‌కు రెవెన్యూశాఖ కేటాయించాలని యూడీఎఫ్ నిర్ణయం తీసుకుంది. ఇకపోతే కొచ్చికి సమీపంలోని నెట్టూర్‌లో 1964లో వీడీ సతీశన్ జన్మించారు. వృత్తిరీత్యా న్యాయవాది అయిన ఆయన.. సామాజిక కార్యకర్తగానూ పేరొందారు.

కేరళ విద్యార్థి విభాగంతో ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. తర్వాత యూత్ కాంగ్రెస్‌లో చేరి, పార్టీని బలంగా ముందుకు తీసుకెళ్లారు. తర్వాత కాంగ్రెస్‌లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ప్రజానేతగా, సంస్కరణాభిలాషిగా ఎదిగారు. 2001లో పరావుర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచి, వరుసగా ఆరుసార్లు విజయం సాధించారు. 2021లో ఆయన కెరీర్ మలుపు తిరిగింది. ఆ ఎన్నికల్లో ఎల్‌డీఎఫ్ గెలుపొందగా.. యూడీఎఫ్ విపక్షానికే పరిమితమైంది. కానీ ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా నియమితులయ్యారు. అవినీతి, గోల్డ్ స్మగ్లింగ్ వివాదం, శాంతి భద్రతలు, పరిపాలనాపరమైన వైఫల్యాలను ఎత్తిచూపి పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టారు. అందుకే ప్రస్తుతం సీఎం ఎంపిక కోసం ఏఐసీసీ పరిశీలకులు జరిపిన అభిప్రాయ సేకరణలో కూడా ఎమ్మెల్యేలు, ప్రజలు సతీశన్‌కే మద్దతు ఇచ్చారు.

## కేరళంలోనూ మహిళలకు ఉచిత బస్సు

ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్టు ప్రకటించారు. ఉద్యోగాలు చేసే మహిళలు, విద్యార్థినులు, రోజువారీ ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయనున్నట్టు కూడా ప్రకటించారు. వృద్ధతరం పెరుగుతుండటం, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. సీనియర్ సిటిజన్ల హెల్త్‌కేర్, సామాజిక భద్రత, పునరావాసం, సంక్షేమ పథకాలను ఈ ప్రత్యేక శాఖ సమన్వయం చేస్తుందని చెప్పారు. ఆశావర్కర్ల గౌరవ వేతనాన్ని రూ.3,000కు పెంచుతున్నట్టు కూడా ముఖ్యమంత్రి సతీశన్ ప్రకటించారు. కేరళం హెల్త్‌కేర్ సిస్టంలో ఆశా వర్కర్లు చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. వర్కర్లు, హెల్పర్లకు రూ.1,000 చొప్పున వేతనం పెంచుతున్నామని, పాఠశాలల్లో వంటపనులు చేస్తున్న వారు, సహాయక సిబ్బంది, ప్రీ-ప్రైమరీ టీచర్లకు అదనంగా రూ.1,000 వేతనం పెంచుతున్నామని చెప్పారు. 2023 నవ కేరళం యాత్ర సందర్భంగా యువజన కాంగ్రెస్ నేతలపై జరిగిన దాడులపై ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం సతీశన్ ప్రకటించారు. ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధించేందుకు, జవాబుదారీతనాన్ని పాదుకొలిపేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తామని, రుణాలు, వ్యయం, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై పారదర్శకతకు కట్టుబడి ఉంటామని తెలిపారు.

# అమెరికా ఆంక్షలున్నా రష్యా నుంచి చమురు కొనుగోళ్లు ఆగవు

కొనుగోలు చేసింది. ఆంక్షలను సడలించినప్పుడూ మాస్కో నుంచి చమురు దిగమతి చేసుకున్నాం. ఇప్పుడు కూడా ఆ కొనుగోళ్లు కొనసాగుతాయి. చమురు ఏ దేశం నుంచి కొనాలనేది పూర్తిగా మన వాణిజ్య ప్రయోజనాలపైనే ఆధారపడి ఉంటుంది. అందువల్ల అమెరికా ఆంక్షల సడలింపు ఉన్నా.. లేకపోయినా మనకు ఇంధన సరఫరాపై ఎలాంటి ప్రభావం పడదు" అని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ సోమవారం వెల్లడించారు. అలాగే, దేశంలో ముడిచమురు కొరత లేదని ఆమె స్పష్టం చేశారు.ఇరాన్ తో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగిన వేళ.. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసేందుకు భారత్ సహా ప్రపంచ దేశాలకు అనుమతిస్తూ అమెరికా ఆంక్షలు సడలించిన సంగతి తెలిసిందే. అయితే, ఇప్పటికే సముద్రంలో ఉన్న రష్యా చమురు నౌకల నుంచి మాత్రమే ఈ కొనుగోళ్లు జరపాలని గతంలో వెల్లడించింది. ఆ గడువు మే 17తో ముగిసిన నేపథ్యంలో.. దేశంలో చమురు కొరతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తాజాగా స్పష్టతనిచ్చింది. మే నెలలో ఇప్పటివరకు రష్యా నుంచి భారత్ సగటున రోజుకు 23 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకున్నట్లు కెప్లెర్ డేటా పేర్కొంది.

## రెండు నెలలకు సరిపడా ఇంధనం

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్‌లో ఇంకా తొమ్మిదిన్నర రోజులకు మాత్రమే సరిపడా చమురు నిల్వలు ఉన్నాయంటూ ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అయితే, దీనిపై తాజాగా పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం స్పందించింది. ఆ వీడియో అవాస్తవమంటూ కొట్టిపారేసింది. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కొందరు ఇలాంటి అసత్యాలను ప్రచారం చేస్తున్నారని, వీటిని ప్రజలు ఎవరూ నమ్మొద్దని విజ్ఞప్తి చేస్తూ 'ఎక్స్'లో పోస్టు పెట్టింది. దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ నిల్వలకు ఎలాంటి కొరత లేదని ఫ్యాక్ట్‌చెక్ విభాగం పేర్కొంది. ఇంధన సరఫరా స్థిరంగానే ఉందని, ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా కేంద్రం నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. భారత్‌లో ఇంకా దాదాపు 60 రోజులకు సరిపడా చమురు నిల్వలు ఉన్నాయని వెల్లడించింది. సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్‌ని చూసి ప్రజలు ఆందోళనకు గురికావొద్దని సూచించింది. అధికారిక వెబ్‌సైట్‌లలో వచ్చే సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరింది.



## రూటు మార్చిన ఇరాన్

జరుగుతోంది. ఈ కేబుళ్లకు నష్టం జరిగినా, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడినా.. పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఇంటర్నెట్ వేగం నెమ్మదించి బ్యాంకింగ్ వ్యవస్థలు, మిలిటరీ కమ్యూనికేషన్స్, కృత్రిమ మేధ విభాగాలు, సీమాంతర లావాదేవీలు ఇలా అన్నింటిపైనా ప్రభావం పడుతుంది. ప్రస్తుతం అనేక దేశాల మధ్య ఉన్న ప్రధాన సముద్రగర్భ కేబుళ్లు హర్మూజ్ కింద నుంచే ఏర్పాటు చేశారు. సింగపూర్ లాంటి ఆసియా డేటా హబ్‌లను, ఐరోపాలోని కేబుల్ స్టేషన్లను కలిపే డిజిటల్ లింక్, భారత్‌కు వచ్చే అత్యధిక ఇంటర్నెట్ ట్రాఫిక్ ఈ జలసంధి మీదుగానే ఉంది. దీంతో ఇరాన్ హెచ్చరికలు ఆందోళన రేకెత్తిస్తున్నాయి.

**ఇరాన్‌కు ఆ హక్కు ఉందా..?**

1982 నాటి 'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ది లా ఆఫ్ సీ' ప్రకారం.. తీరప్రాంత దేశాలకు తమ భూభాగంలో లేదా ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించే



కేబుళ్లు/పైప్‌లైన్‌లకు సంబంధించి షరతులను విధించే హక్కు ఉంటుంది. ఈ కన్వెన్షన్‌పై ఇరాన్ సంతకం చేసింది కానీ.. ఇంకా దాన్ని ఆమోదించలేదు. అయితే, ప్రస్తుతం సూయజ్ కాలువ మీదుగా వెళ్లే సబ్‌సీ కేబుళ్లకు ఈజిప్టు లైసెన్సు ఫీజులు వసూలుచేస్తోంది. దీన్ని ఉదాహరణగా చూపిస్తూ ఇరాన్.. హర్మూజ్‌లోని కేబుళ్లపై వసూళ్లకు సిద్ధమైంది. అయితే, ఈ రెండూ విభిన్నమైన జలమార్గాలు. సూయజ్ కాలువను ఈజిప్టు భూభాగం మీదుగా కృత్రిమంగా ఏర్పాటుచేయగా, హర్మూజ్ సహజసిద్ధంగా ఏర్పడిన జలసంధి. పైగా ఇది ఇరాన్ ప్రాదేశిక జలాల కిందకు రాదని అంతర్జాతీయ చట్టాలు చెబుతున్నాయి. మరి ఈ వసూళ్ల వార్తలపై టెక్ కంపెనీలు ఎలా స్పందిస్తాయో చూడాలి..!

## రహదారి రక్తసిక్తం

ప్రమాదం జరిగిన సమయంలో ట్రక్కులో దాదాపు 100మంది ఉన్నట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. వారంతా వివాహ వేడుకలో పాల్గొనేందుకు బాపు గావ్ ప్రాంతం నుంచి ధనివరికి వెళ్తున్నట్లు సమాచారం. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. అతివేగం కారణంగానే ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది.

**హైదరాబాద్‌లో హైటెక్ మాల్‌ప్రాక్టీస్..**

పాల్పడుతున్న 12 మంది అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి భారీగా ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

# బండి భగీరథ్‌పై అదనపు సెక్షన్లు

పోక్సో యాక్ట్ 2012 మేరకు కేసులు నమోదు చేశారు. ఆ తరువాత బాధితురాలి నుంచి మహిళా అధికారులు వాంగ్మూలం తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు బాధితురాలు నిజం చెప్పకుండా ఉండేలా ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో అన్ని వైపుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగడంతో.. ప్రభుత్వం సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది. వెంటనే దర్యాప్తును చేపట్టిన రితిరాజ్ సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఘటన గురించి ఆరా తీశారు. అప్పటికే పోలీసులు బాధితురాలి నుంచి తీసుకున్న వాంగూల్మాన్ని పరిశీలించారు. అందులో స్పష్టత లేకపోవడంతో మరింత లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం నేరుగా బాధితురాలిని కలిసి జరిగిన విషయం తెలుసుకున్నారు. పోక్సో కేసు దర్యాప్తులో మహిళా అధికారులు ఫ్రెండ్లీ వాతావరణంలో బాధితురాలి నుంచి జరిగిన ఘటనకు సంబంధించిన అంశాలను సేకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే రితిరాజ్ నేరుగా బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెతో చాలాసేపు మాట్లాడినట్టు తెలిసింది. బాధితురాలు చెప్పిన విషయాలకు పోలీసులు కేసు నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేని విషయాన్ని ఆమె గుర్తించారు. బాధితురాలు చేసిన ఆరోపణలు పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1), 6ల పరిధిలోకి వస్తాయి. బాధితురాలిపై పలుమార్లు లైంగికదాడి జరిగినట్టు ఆరోపణలుంటే ఈ సెక్షన్ల కింద కేసు నమోదు చేయా లని చట్టం సూచిస్తున్నది. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా జరిగిన నేరం అత్యంత తీవ్రమైనదని గ్రహించిన డీసీపీ ఆ మేరకు కేసులో సెక్షన్లను అలర్ట్ చేయించారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జోడించారు. సెక్షన్ల ప్రకారం నేరం రుజువైతే.. నిందితుడికి 20 ఏండ్లకు తగ్గకుండా జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించే అవకాశాలున్నాయి




# ప్రమాదాల సమయంలో 'గోల్డెన్ అవర్'కీలకం

సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మాక్ డ్రిల్ ద్వారా లభించే అనుభవాలతో అధికారులు విపత్తుల సమయంలో మరింత బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. వరదలు, అగ్నిప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు వంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వేగవంతమైన స్పందన, వివిధ శాఖల మధ్య సమన్వయం, ముందస్తు సన్నద్ధత ఎంతో కీలకమని ఆయన అన్నారు. ÷-రకృతి విపత్తులు సంభవించినప్పుడు మొదటి గంట ఎంతో కీలకమైనదని, దానిని 'గో÷-డలెన్ అవర్'గా పరిగణించాలని పేర్కొన్నారు. ఆ సమయంలో సిబ్బంది అంతా పూర్తి సమన్వయంతో పనిచేస్తూ, అందుబాటులో ఉన్న అత్యాధునిక ఎక్విప్‌మెంట్‌ను సరిగ్గా వినియోగించి ప్రజలకు తక్షణ సేవలు అందించాలన్నారు. అగ్నిప్రమాదాలు, వరదల సమయంలో అన్ని వ్యవస్థలు సకాలంలో స్పందించి ఆస్తి, ప్రాణ నష్టాలను కనిష్ట స్థాయికి తగ్గించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రమాదం జరిగిందనే కాల్ రాగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా సరైన సమయంలో, సరైన ప్రాంతానికి చేరుకుని బాధిత ప్రజలకు సకాలంలో వైద్య, రక్షణ సేవలు అందించడం అధికారుల బాధ్యత అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. వరదలు, అగ్నిప్రమాదాలు, ఆకస్మిక ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, వేగంగా సహాయక చర్యలు చేపట్టడం, అత్యవసర సేవలను సమన్వయం చేయడం కోసం ఇటువంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత చరిత్రను గుర్తుచేశారు. 1908లో సంభవించిన హైదరాబాద్ మహావరదలను, ఇటీవలి కాలంలో వచ్చిన గోదావరి?కృష్ణా నదుల వరదలను ప్రస్తావిస్తూ... విపత్తుల విషయంలో అప్రమత్తత లేకపోతే ఎంతటి ఘోర నష్టం జరుగుతుందో చరిత్ర చెబుతోందన్నారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాలు, శిక్షణ పొందిన రెస్క్యూ బృందాలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అడవుల్లో సంభవించే అగ్నిప్రమాదాలు పచ్చదనాన్ని నాశనం చేస్తుంటే, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న అగ్నిప్రమాదాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా విపత్తుల సమయంలో చేపట్టిన రక్షణ చర్యలను అధ్యయనం చేస్తూ తెలంగాణలో అత్యుత్తమ విపత్తు నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తున్నామని స్పష్టం చేశారు. మాక్ డ్రిల్‌లో భాగంగా గాలితో నింపే లైఫ్ బోట్లు, నీటిలో చిక్కుకున్న వారిని రక్షించే అత్యాధునిక సాంకేతిక పద్ధతులు, అత్యవసర తరలింపు చర్యలు, సమన్వయంతో కూడిన రెస్క్యూ ఆపరేషన్‌లను ప్రత్యేక బృందాలు ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించాయి. అనంతరం మంత్రి నెక్లెస్ రోడ్ బోటింగ్ క్లబ్‌ను సందర్శించి అక్కడి రెస్క్యూ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో మాక్ ఎక్సర్‌సైజులు నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, విపత్తు నిర్వహణ శాఖ ,జిల్లా అధికారులను మంత్రి అభినందించారు. ఈ భారీ మాక్ డ్రిల్ కార్యక్రమంలో విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన మరియు అగ్నిమాపక శాఖ డీజీ విక్రమ్ సింగ్ మాన్, హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్, ఎన్‌డీఎంఏ లీడ్ కన్‌స్టలెంట్ మేజర్ జనరల్ (రిటైర్డ్) సుధీర్ బెల్ పాల్గొన్నారు. వీరితో పాటు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ , రెవెన్యూ, వైద్య ఆరోగ్య, జీహెచ్‌ఎంసీ , హైడ్రా, పరిశ్రమలు, రవాణా, పశు సంవర్ధక, వెటర్నరీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మాక్ డ్రిల్‌ను విజయవంతం చేశారు.

## కోట్లు ఖర్చు పెట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారు



హైదరాబాద్(జనంసాక్షి): కేంద్ర మంత్రి బండి సంజయ్‌తోపాటు భాజపాపై రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. వ్యక్తిని, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "బండి సంజయ్, భాజపాపై బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోంది. రూ.కోట్లు ఖర్చుపెట్టి రాష్ట్రమంతా పోస్టర్లు వేయించారు. బండి సంజయ్ తప్పు చేయలేదు. ఆయన కుటుంబ సభ్యులు తప్పు చేస్తే.. న్యాయపరంగా చర్యలుంటాయి. సంజయ్‌ను లక్ష్యంగా చేసుకొని బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు.బీఆర్‌ఎస్ హయాంలో మహిళలపై 67 శాతం క్రైమ్ రేటు పెరిగింది. జూబ్లీహిల్స్ బాలిక కేసులో కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా?మద్యం కేసులో మహిళ జైలుకు వెళ్తే.. రాజీనామా చేశారా? ఓ మహిళా సర్పంచి తనను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే లైంగికంగా వేధిస్తున్నారని ఫిర్యాదు చేస్తే పార్టీ పరంగా ఏం చర్యలు తీసుకున్నారు? కేటీఆర్‌కు నైతిక విలువలు లేవు. మీ ఇంటి ఆడబిడ్డ తప్పు చేస్తే ఎందుకు రాజీనామా చేయలేదు? ప్రజా సమస్యలపై పోరాటం చేయడం చేతగాకపోతే రాజకీయాల నుంచి తప్పుకోవాలి. కాళేశ్వరం, ఈ-కారు రేస్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లను అరెస్టు చేయాలి. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కలిశాయి కాబట్టే వారిని అరెస్టు చేయడం లేదు" అని రామచందర్‌రావు అన్నారు.

## తెలంగాణలో పలు జిల్లాలకు వర్షసూచన

కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.మరోవైపు ఎల్లుండి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత మరింత పెరగనుంది. ఈ నేపథ్యంలో పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. రేపు ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ అయింది. ఇవాళ, రేపు కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశముందని అధికారులు వెల్లడించారు.

## ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

**తమిళనాడు విధానం అనుసరణీయం ● రాష్ట్రాలకు కేంద్ర కేబినేట్ కార్యదర్శి సోమనాథన్ సూచన**

హైదరాబాద్(జనంసాక్షి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింపుల్ ఈ-గవర్నేన్స్ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలని కేంద్ర ప్రభుత్వ కేబినెట్ సెక్రెటరీ డాక్టర్ టివి సోమనాథన్ ఆయా రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీలను ఆదేశించారు. సోమవారం కేంద్ర కేబినెట్ సెక్రెటరీ తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఆయా రాష్ట్రాల్లో ఉన్న నిబంధనల మేరకు ప్రజలకు సరళతరమైన,మెరుగైన ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రయత్నించాలని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచించారు. సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ-గవర్నెన్స్ విధానాన్ని వివరించారు. ప్రజలకు పాదర్శకంగా సులభతరమైన పౌర సేవలను అందిస్తున్నామని, ఎప్పటికప్పుడు వివిధ విభాగాల వారీగా ఆన్ లైన్ లో డ్యాష్ బోర్డుల ద్వారా తెలియజేస్తున్నామన్నారు. మున్సిపల్, ఇండస్ట్రీస్, ఎడ్యుకేషన్, ఎనర్జీ, రెవెన్యూ తదితర శాఖల్లో ఈ-గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలను వివరించారు. కేబినెట్ సెక్రెటరీ సిఎస్ కె.రామకృష్ణారావును ఈ-గవర్నెన్స్ విధానంపై అభినందించారు. తమిళనాడు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని కూడా అధ్యయనం చేసి ప్రజలకు ఎలాంటి ఆర్థికభారం, ఇతర ఇబ్బందులు కలగకుండా రాష్ట్రంలో ఈ-గవర్నెన్స్ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. సమావేశంలో స్పెషల్ సిఎస్ నవీన్ మిట్టల్, ముఖ్యకార్యదర్శి యోగితారాణా, శీకాగోయల్, సెక్రెటరీలు రఘునందన్ రావు, ఇ.శ్రీధర్, అనితా రామచంద్రన్, హౌసింగ్ ఎం.డి వి.పి. గౌతం, సెర్ప్ సిఇఒ దివ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఇంధనం, ఆవిష్కరణలు, సాంకేతికతలలో సహకారం

డిజిటల్ టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని మోదీ ఆహ్వానించారు. అలాగే ఆర్కిటిక్ పరిశోధనలు, అంతరిక్ష రంగం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సెమికండక్టర్లు, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కూడా భారత్-నార్వే కలిసి పనిచేయనున్నట్లు తెలిపారు.



# నగరంలో అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలు

- రాష్ట్రంలో ఆరు గిరిజన మ్యూజియంల ఏర్పాటు



**హైదరాబాద్, మే18 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మ్యూజియం డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ సెక్రటరీ కమ్ డైరెక్టర్ సంతోష్ బి.ఎమ్., హాజరయ్యారు. ఈ సందర్భంగా నెహ్రూ శతజయంతి ట్రైబల్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన కుమ్రం భీమ్, సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశంలోని ప్రతి రాష్ట్రంలో సాధారణంగా ఒక్క గిరిజన మ్యూజియం మాత్రమే ఉండగా, తెలంగాణ రాష్ట్రంలో ఆరు గిరిజన మ్యూజియంలు ఏర్పాటుచేయడం గర్వకారణమని పేర్కొన్నారు. వేగంగా మారుతున్న ఆధునిక సమాజంలో గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం, విలువలు తదితర వారసత్వ సంపదను భావితరాలకు పరిచయం చేసే ప్రధాన వేదికలుగా మ్యూజియంలు నిలుస్తాయని అన్నారు. అలాగే కుమ్రం భీమ్, రాంజీ గోండ్ వంటి గిరిజన వీరులు ప్రజల హక్కులు, స్వేచ్ఛ, స్వాభిమానాల కోసం చేసిన పోరాటాలు, త్యాగాలు తదితర చారిత్రక అంశాలను యువతకు తెలియజేయడంలో గిరిజన మ్యూజియంలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విద్యార్థులు, యువత ఆసక్తిగా నేర్చుకునే విధంగా గిరిజన మ్యూజియంలను ఇంటరాక్టివ్, డిజిటల్ మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. వచ్చే నవంబర్ 15 నాటికి రాంజీ గోండ్ స్మారక గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియంను అత్యాధునిక హంగులతో పూర్తి చేసి, ప్రధానమంత్రిని ఆహ్వానించి ఆవిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర్ రెడ్డి, డైరెక్టర్ సముజ్వల, మ్యూజియం క్యురేటర్ సత్యనారాయణతో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# క్రీడా,యువజన వారోత్సవాలు ప్రారంభం




**హైదరాబాద్, మే18 (జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా క్రీడా, యువజన వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఇందులో మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, మల్ రెడ్డి రాంరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నరు. ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్ లో జరిగిన జుంబా కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 18 నుండి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా యువజన, క్రీడా వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. 5 కిలోమీటర్ల వాకథాన్ ను జెండా ఊపి మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, ఏపీ జితేందర్ రెడ్డి, శివసేన రెడ్డి, మల్ రెడ్డి రాంరెడ్డి, సోనీ బాలాదేవి ప్రారంభించారు.

# ముస్లిం సమాజం అభివృద్ధికి విద్యా విజ్ఞానం ఒక్కటే మార్గం

**అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ పిలుపు**



**హిందూపురం (జనంసాక్షి) :** ముస్లిం సమాజం అభివృద్ధికి విద్యా విజ్ఞానం ఒక్కటే మార్గమని అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ పిలుపునిచ్చింది. పట్టణంలో కంచి కామాక్షమ్మ కళ్యాణ మంటపంలో వేదికగా అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫరూక్ ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముస్లిం విద్యార్థుల చైతన్య సదస్సు 2026లో పదో తరగతి, ఇంటర్మీడి యట్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 120 మంది విద్యార్థులకు షహీద్ టిప్పు సుల్తాన్ ప్రతిభా పురస్కారాలు అందజేశారు మాజీ మంత్రి ఎన్ రఘువీరా రెడ్డి, మాజీ శాసనసభ్యులు అబ్దుల్ గని, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి వీరయ్య, బెంగళూరు ఆధ్యాత్మిక గురువులు బజ్మ్ ఏ షాహీన్ అధ్యక్షులు బాబాజీ, కదిరి మున్సిపల్ చైర్ పర్సన్ దిల్షాద్ ఉన్నిసా బాహాఉదీన్ హిందూపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అనిల్ కుమార్, జామియా మసీద్ ముత్తు వల్లి అస్లాం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కేటి శ్రీధర్, ప్రముఖ కవి రచయిత డాక్టర్ సమీవుల్లా, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయులు, ఆంధ్రప్రదేశ్ ముతవల్లీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షకీల్ షఫీ, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, ఎస్ డి జి ఎస్ కాలేజ్ ప్రిన్సిపల్ నాగేంద్ర కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు వివిధ కళాశాల లా యాజమాన్యాలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు ముస్లిం సమాజం అభివృద్ధి కి విద్యా విజ్ఞానం ఒక్కటే మార్గం అని ప్రసంగించారు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ప్రముఖులు ప్రజాసంఘాలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 8వ వేతన సవరణ సంఘానికి టాప్ర ప్రతిపాదనలు



**హైదరాబాద్ (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం నియమించిన 8వ వేతన సవరణ సంఘం వివిధ సంఘాల ప్రతినిధులతో హైదరాబాద్ లోని మారియట్ హోటల్ లో సమావేశం అయింది. తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ బృందం ఈ సందర్భంగా వేతన సవరణ సంఘం అధికారులతో కలిసి తమ ప్రతిపాదనలు సమర్పించింది. కనీస వేతనం రు. 69,000లు చెల్లించాలని, వేతన సవరణ ఫిట్ మెంట్ 3.833 గా ఉండాలని, బిఎస్ఎన్ఎల్ లో విలీనమైన డిఓటి పెన్షనర్లకు 37ఏ నిబంధన ప్రకారం వేతన లేదా పెన్షన్ సవరణ చేపట్టాలని, ఉద్యోగులతో సమానంగా అందరు పెన్షనర్లకు అంటే తేది 1.1.2026 కు ముందు, తరువాత రిటైర్ అయిన వారికి పెన్షన్ రివిజన్ చేయాలని, రక్షణ రంగంలో వలె సివిల్ పెన్షనర్లకూ వన్ ర్యాంక్ వన్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. ఎన్‌పీఎస్/యూపీఎస్ పెన్షన్ విధానాలను రద్దు చేసి పాత డిఫైండ్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, ఉద్యోగి చివరి మాస వేతనం బేసిక్ పే కు 67శాతం సర్వీసు పెన్షన్, 50శాతం కుటుంబ పెన్షన్ మంజూరు చేయాలని, పూర్తి పెన్షన్ పొందడానికి క్వాలిఫయింగ్ సర్వీసుగా 5 సం.లుగా నిర్ణయించాలని, పార్లమెంట్ స్టాండిగ్ కమిటీ సిఫారస్ ప్రకారం 65 సంవత్సరముల వయసు నుండి ప్రతి సంవత్సరం అదనపు పెన్షన్ 5శాతం ఇవ్వాలని, కమ్యూటేషన్ రెస్టొరేషన్ పీరియడ్ ని 15 సంవత్సరముల నుండి 11 సంవత్సరములకు తగ్గించాలని, ప్రస్తుత పరిస్థితుల్లో ఇంటి అద్దెలు విపరీతంగా పెరిగిపోయినందున స్వంత ఇల్లు లేని పెన్షనర్లకు ఇంటి అద్దె చెల్లించాలని, కోవిడ్ కాలంలో రద్దు చేసిన సీనియర్ సిటిజన్లకు రైల్వే ప్రయాణ రాయితీని పునరుద్దరించాలని, దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో సిజిహెచ్ఎస్ ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని, 80 సంవత్సరాల సూపర్ సీనియర్ సిటిజన్లకు కేర్ టేకర్ అలవెన్స్ ని మంజూరు చేయాలని, సర్వీసు పెన్షనర్ కాని కుటుంబ పెన్షనర్ కాని మరణించినపుడు రు. 50,000 లు లేదా ఒక నెల పెన్షన్ అంత్య క్రియల ఖర్చులగా చెల్లించాలని ప్రతిపాదనలతో టాప్ర బ్రుందం 8వ వేతన సవరణ సంఘాన్ని కలిసి మెమొరాండం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టాప్ర గౌ.అ. ఎంఎన్ రెడ్డి, సిజి కన్వీనర్ రామచంద్రుడు, సభ్యులు ప్రభాకర్, వి క్రిష్ణమోహన్. జి అశోక్, ఎం. అర్జున్ భార్గవాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఈపీసెట్ 2026లో ఎంజేపీ విద్యార్థుల హవా

## 516 ర్యాంక్ సాధించిన హర్షిణి

- అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ఐదువేల లోపు ర్యాంకులు
- ఇంజనీరింగ్ లో 10వేల లోపు ర్యాంకులు
- విద్యార్థులకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం అభినందన



**హైదరాబాద్, మే18 (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల సొసైటీ విద్యార్థులు ఈఏపీసెట్-2026 ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నత విద్యా కోర్సుల కోసం నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలో 3781 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. వీరిలో ఐదువేల లోపు ర్యాంక్ 46మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ 178 మంది విద్యార్థులు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో హర్షిణి (516వ ర్యాంక్), కల్పిత (1315 ర్యాంక్), కె. శ్రవణ్ కుమార్ (1377 ర్యాంక్), టి. నవ్య(1692 ర్యాంక్) అత్యుత్తమ ర్యాంక్ సాధించగా, ఇంజనీరింగ్ విభాగంలో బి. అనిరుధ్ (3513 ర్యాంక్), జి. వినోద్ కుమార్ (3568 ర్యాంక్ ), ఎన్. రుషిక్ వర్మ (4433 ర్యాంక్) సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో మొత్తం 1626 మంది ఎంజెపి విద్యార్థులు క్వాలిఫై కాగా వీరిలో ఐదు వేల లోపు ర్యాంక్ సాధించిన వారు 43 మంది విద్యార్థులు, పదివేల లోపు ర్యాంక్ సాధించిన వారు 122 మంది విద్యార్థులు ఉన్నారు. 20000 లోపు ర్యాంక్ 247 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 703 మంది విద్యార్థులు సాధించారు. ఇంజనీరింగ్ విభాగంలో 2155 మంది విద్యార్థులు క్వాలిఫై కాగా వారిలో 5000 లోపు ర్యాంక్ ముగ్గురు విద్యార్థులు, 10000 లోపు ర్యాంక్ 56 మంది విద్యార్థులు, 20000 లోపు ర్యాంక్ 167 మంది విద్యార్థులు, 40000 లోపు ర్యాంక్ 412 మంది విద్యార్థులు సాధించారు. ఉన్నత విద్యా కోర్సుల్లో చేరేందుకు అరజత సాధించిన విద్యార్థులను, బోధన సిబ్బందిని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు, ముఖ్య కార్యదర్శి బాల మాయా దేవి, ఎంజెపి కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు. ఈ ఫలితాలు బీసీ గురుకుల విద్యాసంస్థల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ప్రత్యేక శిక్షణ, క్రమశిక్షణకు నిదర్శనంగా నిలుస్తున్నాయని వారు కొనియాడారు. ప్రభుత్వం గురుకుల విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రత్యేక దృష్టి సారించిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు మెరుగు పరిచామని, ప్రత్యేక ఆన్ లైన్ కోచింగ్ ద్వారా విద్యార్థులకు అవసరమైన పోటీ పరీక్షల శిక్షణ అందిస్తున్నామని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా రెండు కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్ మాత్రమే ఉండగా గత ఏడాది కొత్తగా పది సిఓఇలు లు, ఈ ఏడాది మరో పది సిఓఇలు ఏర్పాటు చేశామన్నారు. వచ్చే ఏడాది మరింత ఎక్కువ సంఖ్యలో బీసీ గురుకుల విద్యార్థులు ఉన్నత విద్యా కోర్సులకు శిక్షణ తీసుకుని అత్యుత్తమమైన ఫలితాలు సాధిస్తారని ఆయన ఆకాంక్షించారు.

# సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో దారుణం

- మద్యం మత్తులో స్నేహితుడి దారుణహత్య

**హైదరాబాద్, మే 18 (జనంసాక్షి) :** సికింద్రాబాద్ మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణ హత్య జరిగింది. మద్యం మత్తులో తలెత్తిన చిన్నపాటి వివాదం ఒకరి ప్రాణం తీసే వరకు వెళ్లింది. తనతో పాటే కూర్చొని మద్యం సేవించిన స్నేహితుడినే ఓ వ్యక్తి దారుణంగా హతమార్చాడు. పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్‌లోని ఎన్.టి.పి.సి భవనంలోని ఐదవ అంతస్తులో ఈ ఘటన చోటుచేసుకుంది. నిన్న రాత్రి నర్సింహులు అనే వ్యక్తి, అతని స్నేహితుడు కలిసి అక్కడే మద్యం సేవించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య ఒక విషయంలో తీవ్రమైన గొడవ మొదలైంది. మద్యం మత్తులో ఉన్న స్నేహితుడు అక్కడే ఉన్న మద్యం సీసాతో నర్సింహులుపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తలకు బలంగా గాయం కావడంతో నర్సింహులు ఘటనా స్థలంలోనే రక్తపు మడుగులో కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న మోండా మార్కెట్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్ సాయంతో ఆధారాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ దారుణానికి ఒడిగట్టిన నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నారు. పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# భర్త చేతిలో భార్య హత్య

- తల్లి మృతితో అనాథలైన ఇద్దరు చిన్నారులు
- సుత్తితో దాడి చేసినట్లు సమాచారం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు



**చెన్నూర్ మే 18 (జనం సాక్షి) :** చెన్నూర్ మండలం ఎల్లక్కపేట గ్రామంలో చోటుచేసుకున్న ఓ విషాదకర ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామానికి చెందిన చల్ల శారద (24) అనే వివాహిత అనుమానాస్పద పరిస్థితుల్లో మృతిచెందిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఆమెను అత్యంత దారుణంగా హత్య చేసినట్లు భావిస్తున్నారు. ఈ సంఘటన గ్రామంలో విషాద ఛాయలు అలుముకునేలా చేసింది. మృతురాలు శారదకు ఇద్దరు చిన్న కుమారులు ఉన్నట్లు సమాచారం. తల్లి మృతితో ఆ చిన్నారులు అనాథలవుతున్న పరిస్థితి గ్రామస్తులను కలచివేస్తోంది. నిత్యం కుటుంబ బాధ్యతలతో గడిపే యువ గృహిణి ఇలా అర్ధాంతరంగా మృతిచెందడం పట్ల స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు, ఈ హత్యను ఆమె భర్త రమేష్ సుత్తితో దాడి చేసి చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఘటనకు గల అసలు కారణాలు ఏమిటన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. కుటుంబ కలహాలే ఈ దారుణానికి దారితీసి ఉండవచ్చని స్థానికంగా చర్చ జరుగుతోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. ఘటనాస్థలంలో ఆధారాలు సేకరించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో ఎల్లక్కపేట గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. యువతి మృతిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు విచారణ అనంతరం మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# ధాన్యం కొనుగోళ్లలో తీవ్రనిర్లక్ష్యం : సబితారెడ్డి

**వికారాబాద్, మే18 (జనంసాక్షి) :** ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబిత ఇంద్రా రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా బోంరాస్ పేట మండలంలోని తుంకిమెట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంద న్నారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు పరిస్థితి ధీనంగా మారింద న్నారు. వర్షాలకు తడిసి ధాన్యం మొలకలు వచ్చాయన్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో రైతుల పరిస్థితి ఈ విధంగా ఉంటే రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చున్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్మంలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ , తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి రెవెన్యూ, పోలీసు, పౌర సరఫరాలు సంస్థ, వ్యవసాయ, రవాణా, సహకార శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు మరియు ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తెచ్చిన ధాన్యాన్ని ఎటువంటి ఆలస్యం లేకుండా వెంటనే కొనుగోలు చేయాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ట్యాబ్‌లో నమోదు చేయడంలో జాప్యం జరుగుతుండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు ట్యాబ్ నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, కొనుగోలు వివరాలను సమయానికి అప్‌డేట్ చేయాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, రవాణా, మిల్లింగ్ ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని, ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల ముఠా అరెస్టు



**చెన్నూర్ మే 18 (జనం సాక్షి) :** మంచిర్యాల జిల్లా చెన్నూర్ పట్టణాన్ని కేంద్రంగా చేసుకొని నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తూ రైతులను మోసం చేస్తున్న ముఠా ను పట్టుకున్నట్లు చెన్నూర్ టౌన్ సీఐ బన్సీలాల్ తెలిపారు. సోమవారం తమ పోలీసు సిబ్బందికి స్థానిక బస్టాండ్ లో పట్టుకున్నారని, ఈ విషయం స్థానిక వ్యవసాయ శాఖ ఏఓ కు తెలియజేసి విచారణ చేసి వారి వద్దనుంచి నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకొని ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

## భూ తగదాలతో అక్కను హత్య చేసిన తమ్ముడు

**సూర్యాపేట, మే18 (జనంసాక్షి) :** భూ తగాదాల కారణంగా తమ్ముడు తన అక్కపై కత్తితో దాడిచేసి హత్య చేశాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) పోలీస్ స్టేషన్ పరిధి తుమ్మలపెన్‌పహాడ్ గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సురిగి సైదులుకు, అతడి సోదరి అంజమ్మకు మధ్య భూమి కోసం గొడవలు జరుగుతున్నాయి. దీనికి సంబంధించి గతంలో ఆత్మకూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇరువర్గాలను బైండోవర్ చేసి పోలీసులు హెచ్చరించారు. ఈ క్రమంలో ఆమెను అడ్డు తప్పిస్తే త్వరగా భూమిని సొంతం చేసుకోవచ్చని సైదులు భావించాడు. పనికి వెళ్తున్న అంజమ్మపై విచక్షణారహితంగా కత్తితో దాడి చేసి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నల్లాల బావి వద్ద నీటి కోసం ఘర్షణ

- మహిళకు తీవ్ర గాయాలు



**చెన్నారావుపేట, మే 18 (జనం సాక్షి):** నల్లాల బావి వద్ద నీటి కోసం ఇరు కుటుంబాలు ఘర్షణ పడ్డ సంఘటన మండలంలోని చెరువుకొమ్ము తండా గ్రామంలోని కొర్ర తండాలో సోమవారం చోటుచేసుకుంది. ఇదే కొర్ర తండాకు చెందిన కొర్ర రమేష్ బోడ దంచి, బోడ కంసాలిలకు చెందిన ఇరు కుటుంబాల మధ్య నల్లాల బావి వద్ద తాగునీటి కోసం గేటువాలు తిప్పే క్రమంలో ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో బోడ కంసాలి అనే మహిళ తలకు తీవ్ర గాయం కాగా స్థానికులు 108కి సమాచారం అందించారు. చెన్నారావుపేట 108 సిబ్బంది పైలెట్ వైనాల నాగరాజు, ఈఎంటి అనిత హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని తీవ్ర గాయాల పాలైన మహిళకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## వివాహిత దారుణ హత్య

**మంచిర్యాల, మే18 (జనంసాక్షి) :** చెన్నూర్ మండలంలోని ఏళ్ళక్కపేట గ్రామంలో దారుణం జరిగింది. చల్ల శారద (24) అనే వివాహితను గుర్తు తెలియని దుండగులు అతి కిరాతకంగా హత్య చేశారు . సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం ఘటన స్థలాన్ని పరిశీలించి హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్యకు గల కారణాలపై అన్ని కోణాల్లో విచారిస్తున్నారు. మరోవైపు శారద హత్యతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. శారదను హత్య చేసిన దుండగులు పోలీస్ స్టేషన్ లోనే ఉన్నారని.. నిందితులను తమకు అప్పగించాలంటూ మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు చెన్నూర్ పోలీస్ స్టేషన్‌పై రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఇద్దరు కానిస్టేబుళ్లు గాయపడ్డట్లు సమాచారం. దీంతో పోలీస్ స్టేషన్ దగ్గర ఉద్రిక్త పరిస్థితి నెలకొనగా.. అధికారులు రంగంలోకి దిగి ఆందోళనకారులను శాంతింపజేశారు.

# రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

- చావుబతుకుల్లో కొడుకు



**జనగామ, మే18 (జనంసాక్షి) :** జనగామ జిల్లా రఘునాథపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ట్రాక్టర్ ఢీకొట్టడంతో తండ్రి అక్కడికక్కడే మరణించగా.. తీవ్రంగా గాయపడిన కొడుకు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. కొమాళ్ల గ్రామానికి చెందిన అలావత్ బాలాజీ (49) తన కుమారుడు నరేశ్‌తో కలిసి సోమవారం ఉదయం టీవీఎస్ ఎక్సెల్‌పై రాఘవపురం బయల్దేరాడు. ఈ క్రమంలో హనుమకొండ-హైదరాబాద్ జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బాలాజీ అక్కడికక్కడే మరణించాడు. నరేశ్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇది గమనించి స్థానికులు 108 సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు వచ్చిన సిబ్బంది నరేశ్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## కారు ఢీకొని భార్యాభర్తలు మృతి

**సిద్దిపేట, మే18 (జనంసాక్షి) :** కారు ఢీకొని బైక్‌పై వెళ్తున్న భార్యభర్తలు మృతి చెందారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ సమీపంలో చోటు చేసుకుంది. గజ్వేల్ మండలం షేర్‌పల్లికి చెందిన ప్రవీణ్ (50), జ్యోతి (45) భార్యభర్తలు. సోమవారం పని నిమిత్తం ఇద్దరు కలిసి బైక్‌పై బయటకు వెళ్లారు. ఈ క్రమంలో గజ్వేల్ సమీపంలోని పత్తి మిల్ దగ్గర ప్రమాదానికి గురయ్యారు. కారు ఢీకొని భార్యభర్తలు చనిపోయారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.

# నైతికత నిఘంటువులో మిగిలిందా?

నైతికత అనే పదం రాజకీయ ప్రసంగాల్లో తరచుగా వినిపిస్తుంది. అధికారంలోకి వచ్చే ముందు దానిని గొంతెత్తి చాటిన నాయకులే, అధికారంలోకి వచ్చాక దాన్ని మరిచిపోతారు. బండి సంజయ్ కుమారుడు పోక్సో కేసులో జైలులో ఉన్నాడు. బాధిత కుటుంబంపై ఒత్తిడి తీసుకొచ్చారని ఆరోపణలున్నాయి. రాయబారం జరిగిందని మాజీ ఐపీఎస్ అధికారి బహిరంగంగా నిరూపించారు. ఈ నేపథ్యంలో బండి సంజయ్ పదవిలో కొనసాగడం నైతికతకు అవమానం, బాధితురాలికి అన్యాయం, ప్రజాస్వామ్యానికి అపమానం. నిర్దోషత్వం నిరూపించుకోవాలంటే ముందు పదవి వదులుకోవాలనే డిమాండ్ హెచ్చుతోంది. నిజం నిలబడితే ప్రజలే మళ్ళీ అధికారం అప్పగిస్తారు. కానీ పదవిలో ఉంటూ, అధికారం చేతిలో ఉంచుకొని నిర్దోషత్వం నిరూపించుకోవడానికి ప్రయత్నించడం అది నైతికత కాదు, అది అధికార దుర్వినియోగం.


పోక్సో చట్టం ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ యాక్ట్ దేశంలోని అత్యంత కఠినమైన చట్టాలలో ఒకటి. మైనర్ బాలికలపై లైంగిక వేధింపులు జరిగినప్పుడు నిందితులను కఠినంగా శిక్షించేందుకు రూపొందించిన ఈ చట్టం. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కుమారుడు అనే సత్యం ఈ కేసును జాతీయ నైతిక ప్రశ్నగా మారుస్తోంది. అంతరంగిక భద్రత, చట్టపాలన, మహిళా సంరక్షణ ఇవన్నీ హోంశాఖ పరిధిలోని విషయాలే. అదే శాఖలో సహాయ మంత్రిగా ఉన్న వ్యక్తి కుమారుడు పోక్సో కేసులో నిందితుడైనప్పుడు ఆ మంత్రి పదవిలో కొనసాగడం నైతికంగా సమర్థనీయమా? బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన వెల్లడింపు ఈ కేసుకు మరో కీలకమైన పార్శ్వాన్ని జోడించింది. పోక్సో కేసులో బాధిత కుటుంబాన్ని మాజీ జర్నలిస్టు సంగప్ప ద్వారా రాయబారం జరిగిందని, బండి సంజయ్ ఇందులో ప్రమేయం ఉందని ఆయన బహిరంగంగా ఆరోపించారు. ఇది చాలా తీవ్రమైన ఆరోపణ. ఒక పోక్సో కేసులో అంటే మైనర్ బాలిక లైంగిక వేధింపులకు గురైన కేసులో బాధిత కుటుంబంపై రాయబారం జరగడమంటే, అది కేవలం చట్ట ఉల్లంఘన మాత్రమే కాదు. అది బాధితురాలి గాయంపై నిప్పు పోయడం. అది నైతికతకు, మానవీయతకు వ్యతిరేకమైన చర్య. బండి సంజయ్ ఫోన్ కాల్ డేటాను స్వాధీనం చేసుకుంటే ఆయన ప్రమేయం స్పష్టమవుతుంది.

రాష్ట్రంలోని మహిళా సంఘాలు, పౌర సమాజం, ప్రజా సంఘాలు ఒక్కగొంతుతో డిమాండ్ చేస్తున్నాయి. బండి సంజయ్ తక్షణమే రాజీనామా చేయాలని. ఈ డిమాండ్ రాజకీయంగా ప్రేరేపించబడింది కాదు ఇది సమాజపు మనసాక్షి నుండి వస్తున్న స్వరం. మైనర్ బాలిక న్యాయం కోసం అడుగుతోంది. ఆ అడుగుకు అడ్డంకులు కలిగించే వ్యవస్థ ఉండకూడదని, అధికారం అడ్డుపడకూడదని ప్రజలు కోరుతున్నారు. భారత రాజకీయ చరిత్రలో నైతికతను పాటించి స్వచ్ఛందంగా రాజీనామా చేసిన నాయకులున్నారు. లాల్ బహదూర్ శాస్త్రి రైలు ప్రమాదంలో తన శాఖ బాధ్యత వహించి మంత్రి పదవి వదులుకున్నారు. అది నైతిక నాయకత్వానికి చిహ్నం. ఈరోజు బండి సంజయ్ ముందు అదే నైతిక పరీక్ష ఉంది. కుమారుడు చేసిన తప్పుకు తండ్రి పదవి వదులుకోవాలా అని ప్రశ్నించవచ్చు. అది సహజమైన ప్రశ్నే. కానీ ఇక్కడ విషయం వేరు కుమారుడు పోక్సో కేసులో జైలులో ఉండగా, బాధిత కుటుంబంపై ఒత్తిడి తీసుకొచ్చారని తండ్రిపై నేరుగా ఆరోపణలున్నాయి. రాయబారం జరిగిందని నిర్దిష్ట ఆరోపణలున్నాయి. ఇటువంటి పరిస్థితిలో పదవిలో కొనసాగడం నైతికత కాదు, అధికారానికి అంటిపెట్టుకోవడం.

ఈ కేసులో దర్యాప్తు సంస్థలు అత్యంత జాగ్రత్తగా, నిష్పాక్షికంగా వ్యవహరించాలి. కేంద్ర మంత్రి పేరు వస్తోంది కాబట్టి ఒత్తిడి ఉంటుంది, అడ్డంకులు వస్తాయి. కానీ ఆ అడ్డంకులకు లొంగిపోవడం అంటే మైనర్ బాలికకు న్యాయం నిరాకరించడమే. ఫోన్ కాల్ డేటా స్వాధీనం అనే డిమాండ్‌ను వెంటనే పరిశీలించాలి. రాయబారం జరిగిందని ఆరోపించిన వ్యక్తులను సాక్షులుగా పరిగణించి వారి జాబితాలను రికార్డు చేయాలి. ఏ రాజకీయ ఒత్తిడికి లొంగకుండా చట్టం తన పనిచేయాలి.

**తెలంగాణ ప్రజలు చూస్తున్నారు. దేశం చూస్తోంది. న్యాయం నిద్రపోదు.**
**మైనర్ బాలిక కన్నీళ్ళు ఏ అధికారానికైనా, ఏ పదవికైనా మించినవి.**
**ఆ కన్నీళ్ళు తుడవడమే నిజమైన పాల..!**

## డాలర్ మాయ





యుద్ధ విరామం
శవాలు శిథిలాలు
వెల్లు చీకట్లు
నియంత దారి
యుద్ధాలకు కారణం
మంటల మాట
తుపాకి స్వేచ్ఛ
పిల్లల బొమ్మలాట
నెత్తుటి బాట
దేశ రక్షణ
ఆయుధాల తయారీ
జ్ఞానపు దారి
డాలరు మాయ
దేశాలకు ముసలం
జరపదిలం

**రేడియమ్**
**9291527757**

# నేటికీ అభివృద్ధికి నోచుకోని కళింగాంధ్ర

## 'మన కళింగాంధ్ర' పుస్తక పరిచయం



**కేశవ్**
**కోల్కతా**
**ఆర్థిక సామాజిక విశ్లేషకులు**
**జాగృతి సమీక్ష సంపాదకులు**

అత్యంత చారిత్రక ప్రాధాన్యత ఉన్నప్పటికీ, దశాబ్దాల తరబడి వెనుకబాటుకు గురైన కళింగాంధ్ర ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, సాహితీ రూపాన్ని ఎంతో చక్కగా విడమర్చి కళ్ళ ముందు ఉంచారు దుప్పల రవికుమార్ గారు తన 'మన కళింగాంధ్ర' వ్యాస సంకలనంలో. వెనుకబాటు తనం ప్రజల పాపం కానే కాదు అనే అత్యంత చారిత్రక వాస్తవాన్ని ధృవపరచారు.

మహానది నుంచి గోదావరి వరకు నడుమ కళింగ రాజ్యం ఎప్పుడూ కయ్యాలకు ఎదురు నిలిచి తన ఉనికిని, సంస్కృతిని చెక్కు చెదరనీయకుండా కాపాడుకుంటూ నిలిచిన నేల అని రచయిత అంటున్నారు. అయినా ఇదే నేల అత్యంత బాధాకరమైన సరైన ఉపాధి లేక, ఇతర ప్రాంతాల్లో గోనె సంచుల్లో తన సమస్తాన్ని అంటే ఆకలిని, ఆలుబిడ్డలను, ఆత్మగౌరవాన్ని అన్నింటిని చుట్టి పొట్ట చేత పట్టుకొని కనిపిస్తాడని ఎంతో హృద్యంగా రాస్తున్న వాక్యాలు చూస్తుంటే, ఒకసారి పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని 24 పరగణాలు, హుగ్లీ, హౌరా జిల్లాల్లోని నూలు, జనపనార పరిశ్రమల వైపుకు గతంలో శ్రీకాకుళం నుంచి పొట్ట చేత పట్టుకుని పయనించిన వందల వేలకొలది మా పూర్వీకుల సంతతి కనిపిస్తుంది.

గతంలో, నేను రాసిన 'ఆకలి' కథా సంకలనంలోని ఆకలి కథలో బిధాన్ నగర్ స్టేషన్ లో పొట్ట కూలి కోసం ఇలానే హృదయ విదారకంగా కనిపిస్తాడు చంద్రన్న. ఫిక్షన్ కాదు వాస్తవం. కళ్ళారా చూసిన జీవితాలవి. అనుభవించిన జీవితాలు. పూటకి ఆకలి తీర్చుకుంటామంటే ఇక ఆ జనపనార మిల్లులు కూడా దయచేయని బాధాకరమైన జీవితాలు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా సరే ప్రజా జీవితాలు అలానే కనిపిస్తున్నాయి. ఇది చారిత్రక వాస్తవం. జనపనార మిల్లులు, నూలు మిల్లులు ఉన్న స్థానంలో నేడు రియల్ ఎస్టేట్లు అందమైన భవనాలతో వెలిగిపోతున్నాయి. కానీ, ఇవి ఆస్థాయి ఉపాధి ఇవ్వవు కదా.

ఇక మన రచనలోకొస్తే, పుస్తకంలో విలువైన వ్యాసాలు అప్పుడప్పుడు రచయిత రాసినవి కనిపిస్తాయి. అలానే, ప్రఖ్యాత రచయితలు ప్రొఫెసర్ కె ఎస్ చలం, ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపారాణి, జి వెంకటకృష్ణ, డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ గారి ఆప్త వాక్యాలు మరిన్ని చారిత్రక వాస్తవాలను హృద్యంగా అందిస్తూ రచనను మరింత చారిత్రకం చేస్తాయి. 'ఇవీ మన ఊసులు' అనే శ్రీకాకుళం మాండలికాన్ని ఉపయోగిస్తూ రచయిత ఒక దగ్గరికి చేర్చిన 15 వ్యాసాలు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, సాహితీ కోణాలను తాకుతాయి. రచయిత స్వయంగా జర్నలిస్టు మాత్రమే కాకుండా, సాహితీకారుడు కూడా. అది కూడా నిబద్ధత ఉన్న సాహితీవేత్త కావడం వలన, సాహితీ కోణాన్ని కూడా తాకుతూ అందించిన వ్యాసాలు పుస్తకానికి మరింత చారిత్రకతను అందించాయి. ఈ రచనలు అన్నీ కూడా ఆయా సందర్భాల్లో జరిగిన, కొనసాగిన పరిణామాలను విశ్లేషించడానికి ప్రయత్నం చేశాయి.

'ఒక సోంపేట కొన్ని గుణపాఠాలు' వ్యాసంలో గతంలో సోంపేట ప్రాంతం ఉద్యమించిన పరిస్థితులు, వ్యవస్థ నిర్దయను బట్టబయలు చేస్తున్నారు. సోంపేటలో థర్మల్ పవర్ ప్లాంట్ కు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం ఈరోజు మన జ్ఞాపకాల పొరల్లోంచి జారిపడి ఉండొచ్చు. కానీ, మొత్తం దేశాన్ని, ప్రపంచాన్ని కూడా కదిలించి వేసిన సోంపేట ఉద్యమం అసాధారణమైన చారిత్రక ఉద్యమం.

దుప్పల రవికుమార్ గారి వ్యాసాల్లో ఏదో సాధారణ సమీక్ష మాత్రమే ఉండదు. అక్షరాల్లో నిప్పు కణికలు ఉంటాయి. ప్రశ్న ఉంటుంది. అరుంధతీ రాయ్ రచనలో కనిపించే సామాజికావేశం, భావావేశం అంతే స్పష్టంగా దిశా నిర్దేశం ఉంటుంది. 'ఒక ప్రైవేటు కంపెనీ పునాదిరాయి వేసుకోవడానికో, తవ్వుకోవడానికో సిద్ధమైనప్పుడు, అన్నివేలమంది పోలీసులు పహరా కారణమేమిటని ఎక్కడి నుంచో పరామర్శలకు వస్తున్న మేధావులు, పర్యావరణ నిపుణులు సైతం ఆశ్చర్యపోతున్నారు' అంటారు. (పేజీ 47) ఆ విధంగా మన ప్రభుత్వ ఆధ్వర్యంలోని పోలీసులకు, పెట్టుబడిదారులకు ఉన్న అవ్యాజానురాగాలతో కూడిన అమలిన, అలౌకిక ప్రేమ బంధాన్ని చూసి ఎవరైనా కంటతడి పెట్టుకోవలసిందే! అంటున్నారు.

మరో దగ్గర 'నివురుగప్పిన నిప్పు మందస రైతుల తిరుగుబాటు' వ్యాసంలో మందస తిరుగుబాటు గురించి ఎన్నో అంశాలతో కూడిన చర్చ కనిపిస్తుంది. కళింగాంధ్రకు ఏం తక్కువ? నిజమే అత్యద్భుత ప్రకృతి అమరిక.. సముద్ర తీర ప్రాంతం, మైదాన ప్రాంతం, అటవీ ప్రాంతాల కలగలుపైన త్రివేణి సంగమం ఎంతమందికి ఇంత అదృష్టం? సహజ వనరుల మాటో... ప్రపంచంలో చాలా దేశాల వారి కన్ను కుట్టేటట్టు అలరారే సహజ సంపద ఈ నేల సొంతం. ఖనిజాలు, ధాతువులు మాత్రమే కాక సారవంతమైన మట్టి. వీటన్నిటి నుంచి భారతదేశంలోనే ఏ ప్రాంతానికి లేనన్ని 15కు మించి నదులు. ఈ నేలగుండా ప్రవహిస్తుంటాయి. కానీ, కరువు కరాళ నృత్యం చేస్తునే ఉంది. (పేజీ 39)

'కళింగాంధ్ర బహుజన సాహిత్యం' వ్యాసంలో రచయిత కళింగాంధ్ర అందించిన అసాధారణ సాహిత్యం గురించి ప్రస్తావిస్తారు. నాటి గురజాడ తరం నుంచి, నేటి మేటి కథకులు అట్టాడ అప్పల నాయుడు, గంటేడ గౌరునాయుడు, సువర్ణముఖి ,బమ్మిడి జగదీశ్వర రావుల వరకు సాహితీ ప్రయాణాన్ని విశదపరచారు.

'నేటి కళింగాంధ్ర' పుస్తకం ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం. వ్యవస్థ నిర్దయకు ఒక ప్రత్యేక ప్రాంతం ఎలా బలైపోయిందో ఈ రచన చదివితే తప్ప మనకు వాస్తవాలు అర్థం కావు. అన్ని రకాల ప్రకృతి సంపద కలగలిసి ఉన్నప్పటికీ కూడా ప్రజల జీవితాలు ఎందుకు వెనకబడి ఉంటాయో రచయిత విశ్లేషణ ఈ పుస్తకంలో కనిపిస్తుంది. సాధారణ ప్రజల కోణంలో సాధారణ ప్రజలకు న్యాయం జరగడానికి రాసే రచన ఎప్పుడూ కూడా చారిత్రక ప్రాధాన్యత సంతరించుకుంది. అలాంటి ప్రాధాన్యత ఉన్న రచన ఈ పుస్తకం. ఇందులో, కళింగాంధ్ర సాధారణ ప్రజల హృదయాలు కనిపిస్తాయి. వారి బాధలు కనిపిస్తాయి. తప్పుడు ఆర్థిక విధానాన్ని అలవర్చుకుంటున్న పాలకవర్గాల వింత చేష్టలు కనిపిస్తాయి.

ఎక్కడైనా సరే పాలకవర్గం పనితీరు ఎలా ఉంటుందీ అంటే ఆయా ప్రాంతాల ప్రజల జీవన విధానాలను మెరుగుపరచాలని వారికి ఎప్పుడు కూడా అనిపించదు. ఆయా ప్రాంతాల్లో ఏదైనా కార్పొరేట్ ఒక పరిశ్రమ పెట్టాలి అనుకుంటే అప్పుడు కార్పొరేట్లకు అనుగుణంగా ప్రయాణం సాగించాలని ఆయా పాలకవర్గాలు అనుకుంటాయి. చాలా ప్రాంతాల్లో మనం ఈ పనితీరును చూసే ఉన్నాం. అందుకే భారతదేశంలో చాలా రాష్ట్రాలు చాలా ముందుకు వెళ్లాయి అలానే మరికొన్ని రాష్ట్రాలు ఎప్పుడూ కూడా ఒకలా వెనకబడి ఉంటాయి. దీనికి కారణాలను ఆయా ప్రజల మీదకు నెట్టేస్తారు. అని వాస్తవాలు అలా ఉండకపోవచ్చు. కార్మిక చట్టాలను ఏమాత్రం ప్రశ్నించకుండా శ్రామిక వర్గం పని చేసుకుంటూ పోతూ ఉంటే ఆయా ప్రాంతాల్లో కర్మాగారాలను నిశ్చింతగా నిర్మించి కొనసాగిస్తారు. గుజరాత్ మహారాష్ట్ర లాంటి ప్రాంతాల్లో మనం ఇలాంటి పారిశ్రామిక సంస్కృతిని చూస్తుంటాం. ప్రశ్నలు లేవనెత్తనీయకుండా రోజుకి పన్నెండేసి గంటలు పని చేయించడం అలవాటు చేసేసి శ్రామిక దోపిడీ కొనసాగించడం మనం చూస్తుంటాం. ఇప్పుడు గనుల్ని, ప్రకృతిని మింగేసే బడా కార్పొరేట్ ఎక్కడన్నా మరింత పెద్ద స్థాయిలో ముందుకు వస్తూ మరలా కార్పొరేట్లకు ఏ ప్రాంతాలు కావాలో ఆ ప్రాంతాలు మాత్రమే అభివృద్ధి చేసే దిశ కొనసాగే ప్రపంచీకరణ మనం చూస్తూనే ఉన్నాం. ఏది ఏమైనా సరే, మన 'కళింగాంధ్ర పుస్తకం' ఎన్నో వ్యాసాలను కలగలిపి మరలా చర్చను ముందుకు తీసుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒక ప్రత్యేక ప్రాంతం యొక్క చారిత్రక ప్రాధాన్యతను ముందుకు తెచ్చి ఎన్నెన్నో ప్రశ్నలు లేవనెత్తింది. సమాధానాల కోసం ఆయత్తం కావాల్సి ఉందని మనల్ని గుర్తు చేసింది.

**మన కళింగాంధ్ర...**
**రచయిత: దుప్పల రవికుమార్**
**సిక్కోలు బుక్స్**
**నరసన్నపేట, 9989265444**
**వెల: 150/**

# ఎన్నికల ప్రజాస్వామ్యం మీద : బీజేపీ వ్యవస్థాగత అప్రజాస్వామిక దాడి

2014 నుంచి భారతదేశంలో రాజ్యాంగ సంస్థల స్వాతంత్ర్యం క్రమంగా బలహీనపడుతోందని ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్, అరవింద్ కేజ్రీవాల్, మమతా బెనర్జీ, కపిల్ సిబాల్ వంటి నాయకులు, ప్రముఖ న్యాయవాదులు, జర్నలిస్టులు, సంపాదకులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సుప్రీం కోర్టులో ప్రజాస్వామిక న్యాయవాదులు లేవనెత్తిన పిటిషన్లు ఈ ఆందోళనలను ధృవీకరిస్తున్నాయి. ఎన్నికల నిర్వహణలో, ఓటరు లిస్టుల సవరణ, ఫలితాల ప్రకటనల్లో లోపాలు – ఇవి కేవలం ఒక్కసారి జరిగిన లోపాలు కాదు, వ్యవస్థాగత వ్యూహం వారి వాదన. ఆ విమర్శలను ఉదాహరణలతో పరిశీలిస్తుంది.

**నియామకాల ద్వారా సంస్థల స్వాతంత్ర్య హననం:**

2023 చట్టం ద్వారా చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఎలక్షన్ కమిషనర్ల నియామకంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో క్యాబినెట్ మంత్రిని చేర్చడం సుప్రీం కోర్టు "అనూప్ కార్నివాల్ " తీర్పును అధిగమించిందని ప్రజాస్వామిక న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. కపిల్ సిబాల్, ప్రశాంత్ భూషణ్ వంటి న్యాయవాదులు సుప్రీం కోర్టులో ఈ చట్టాన్ని సవాలు చేస్తూ "ఎన్నికల కమిషన్ ఎగ్జిక్యూటివ్‌కు బానిస అయింది" అని వాదించారు. సుప్రీం కోర్టు కూడా దీన్ని " టిరణీ ఆఫ్ ది ఎలెక్టెడ్" అని వ్యాఖ్యానించింది. జ్ఞానేశ్వర్ కుమార్ (అమిత్ షా సంబంధం) నియామకం ఈ విమర్శలకు ఉదాహరణగా వారు పేర్కొన్నారు.

ప్రొఫెసర్ యోగేంద్ర యాదవ్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)లో లక్షలాది ఓటర్ల పేర్లను ఓటర్ల జాబితా నుండి తొలగించడాన్ని తీవ్రంగా విమర్శించారు. బీహార్, పశ్చిమ బెంగాల్, కర్ణాటకలో వలస కార్మికులు (మైగ్రంట్ వర్కర్లు), దళితులు, మైనారిటీల పేర్లు ఎక్కువగా తొలగించబడ్డాయని, ఇది "ఎలెక్టోరల్ డీఫామ్" అని అభివర్ణించారు. సుప్రీం కోర్టులో ఆయన ఈ అసాధారణతలను (బీహారీ పేర్లు కన్నడ/తమిళంలో) ఏలా ఉంటాయో ఉదాహరించారు. మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్‌లో 25 లక్షల ఓటర్ల ఏకపక్షంగా తొలగించడాన్ని "ఓట్ లూటీ"గా అభివర్ణించారు. కపిల్ సిబాల్ ఈ పేర్ల తొలగింపు బీజేపీ విజయావకాశాలను మార్జిన్‌ల కంటే ఎక్కువగా ఉన్నాయని సుప్రీం కోర్టుకు చెప్పారు.

**"ఈవీఎంలు", ఓటింగ్ ప్యాటర్న్‌లు - ఫలితాలప్ అనుమానాలు:**

అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ, పంజాబ్ ఎన్నికల్లో ఈవిఎం లను "ఎలక్ట్రానిక్ విక్టరీ మెషన్స్"గా అభివర్ణించి, ట్యాంపరింగ్ ఆరోపణలు చేశారు. మమతా బెనర్జీ 2026 పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ "100 సీట్లు లూటీ" చేసిందని, ఎన్నికల కమిషన్ ను "బీజేపీ కమిషన్" అని ఆరోపించారు. కపిల్ సిబాల్ "ఈ ఎన్నికలు గెలవలేదు, దొంగిలించబడ్డాయి" అని చెప్పి, సెంట్రల్ ఫోర్సెస్ దుర్వినియోగం, ఓటర్ల డిస్ ఎన్‌ఫ్రాంచైజ్‌మెంట్‌ను ఎత్తి చూపారు. అర్ధరాత్రి సమయంలో ఆఖరి గంటల్లో ఓట్ల స్పైక్స్, ఫారం–17సీ సరిగా ఇవ్వకపోవడం, ఏజెంట్లను బయటకు పంపడం వంటి ఆరోపణలు పలు రాష్ట్రాల్లో నమోదయ్యాయి.

కపిల్ సిబాల్ గవర్నర్లను "బీజేపీ ఏజెంట్లు" అని విమర్శించి, తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో రాజ్యాంగ ఉల్లంఘనలను ఎత్తి చూపారు. మమతా బెనర్జీ ఈడీ, సీబీఐ మొదలైన దర్యాప్తు సంస్థల దుర్వినియోగాన్ని "ఎంఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆఫ్ బీజేపీ"గా అభివర్ణించారు. యోగేంద్ర యాదవ్ "అబ్యూసివ్ కాన్సిట్యూషనలిజం" అని, రాజ్యాంగాన్ని ఉపయోగించి రాజ్యాంగ దుర్వినియోగం చేయడం జరుగుతోందని అన్నారు. ప్రముఖ జర్నలిస్టులు, సంపాదకులు (రవీష్ కుమార్, నిర్ధార్ పత్రికలు) "గోదీ మీడియా", సోషల్ మీడియా ట్రోల్ ఆర్మీ ద్వారా ప్రజా అభిప్రాయాన్ని మలచడం గురించి రాశారు.

**సుప్రీం కోర్టు పాత్ర:**

ప్రశాంత్ భూషణ్, సంజయ్ పరీఖ్, శాదాన్ ఫరాసత్ వంటి న్యాయవాదులు ఎన్నికల కమిషన్ స్వాతంత్ర్యం, నియామకాలు, ఓటర్ లిస్ట్ సవరణలపై పిటిషన్లు దాఖలు చేశారు. సుప్రీం కోర్టు "ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా కనిపించాలి" అని హెచ్చరించింది. కానీ చట్టపరమైన రక్షణలు (ఇమ్యూనిటీ క్లాజులు) కారణంగా శిక్షాత్మక చర్యలు కష్టం అవుతున్నాయి. బీజేపీ ఈ చర్యలను "సంస్కరణలు", "మైగ్రంట్ ఓటర్ల శుద్ధి"గా చూపిస్తుంది. కానీ విపక్షాలు, న్యాయవాదులు ఇది ఒక దీర్ఘకాలిక వ్యూహంగా అభివర్ణించారు. ఎన్నికలను ప్రజాస్వామికంగా కాకుం డా "మేనేజ్" చేయడం అని వాదిస్తున్నారు. ఫలితంగా ప్రజల విశ్వాసం దెబ్బతిన్నది. ఈవీఎంలు,వీవీపాట్ లు, పారదర్శకతలో మెరుగుదలలు చూపించాలి. కానీ అలాంటిది జరగటం లేదు. దీని పై స్వతంత్ర దర్యాప్తు సంస్థలు దర్యాప్తు చేయటం అవసరం అని వారు అంటున్నారు. ప్రజాస్వామ్యం కేవలం ఎన్నికలు జరపడం కాదు – న్యాయమైన, నమ్మదగిన ఎన్నికలు జరపడం. యోగేంద్ర యాదవ్ చెప్పినట్లు "ఎన్నికల రిఫార్మ్ కాదు, డిఫార్మ్" జరుగుతోంది. సుప్రీం కోర్టు, ప్రజల నిరంతర విజిలెన్స్ లేకపోతే రాజ్యాంగ స్ఫూర్తి బలహీనపడుతుంది. ఇది ఒక్క పార్టీ సమస్య మాత్రమే కాదు -- భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు సమస్య.

**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.**

# నాయకుల విలాసవంత జీవనం.. ప్రజల అసంతృప్తికి కారణం

నిన్నటి సంచిక తరువాయి

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధుల జీవన విధానం సమాజంపై గణనీయమైన ప్రభావం చూపుతుంది. నాయకులు ఎలా ప్రవర్తిస్తారో అదే విధంగా ప్రభుత్వ యంత్రాంగం కూడా మారుతుంది. ఒకప్పుడు భారతదేశంలో రాజకీయ నాయకులు సాధారణ ప్రజల మాదిరిగానే జీవిస్తూ ప్రజల సమస్యలను దగ్గరగా అర్థం చేసుకునే ప్రయత్నం చేసేవారు. గ్రామాల్లో సాధారణ ఇళ్లలో బస చేయడం, ప్రభుత్వ అతిథి గృహాలకంటే ప్రజల మధ్య ఉండడం, చిన్న సమావేశాలతోనే కార్యక్రమాలు నిర్వహించడం అప్పటి రాజకీయ సంస్కృతిలో కనిపించేది. కానీ ప్రస్తుతం రాజకీయ కార్యక్రమాలు భారీ ఖర్చులతో కూడిన ప్రదర్శనలుగా మారుతున్నాయి. ఒక చిన్న సభ నిర్వహణకే లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. సభల కోసం వందలాది వాహనాలు, భారీ కటౌట్లు, విలాసవంతమైన వేదికలు, ప్రత్యేక అలంకరణలు ప్రజా ధనాన్ని విపరీతంగా ఖర్చు చేస్తున్నాయి.



1970లలో ఒక జిల్లా స్థాయి రాజకీయ పర్యటనకు పరిమిత వాహనాలు మాత్రమే ఉపయోగించేవారు. కానీ ప్రస్తుతం చిన్నస్థాయి నాయకులే 10 నుండి 15 వాహనాలతో తిరుగుతున్న దృశ్యాలు సాధారణమైపోయాయి. ముఖ్యంగా ఎన్నికల సమయంలో రాజకీయ నాయకుల ఖర్చులు అమాంతం పెరుగుతున్నాయి. భారత ఎన్నికల వ్యవస్థపై పనిచేసే అనేక సంస్థల అంచనాల ప్రకారం 2024 సాధారణ ఎన్నికల సమయంలో దేశవ్యాప్తంగా సుమారు రూ. 1 లక్ష కోట్లకు పైగా వ్యయం జరిగిందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ఎన్నికల వ్యవస్థలలో భారతదేశాన్ని నిలిపింది. ఎన్నికల సమయంలో జరిగే ఈ అధిక ఖర్చులు తర్వాత అధికారంలో ఉన్నప్పుడు కూడా కొనసాగుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రాజకీయ నాయకుల వాహన దళాల నిర్వహణ ప్రభుత్వ ఖజానాపై భారీ భారాన్ని మోపుతోంది. ఒక్కో విలాసవంతమైన వాహనం కొనుగోలుకు రూ. 20 లక్షల నుండి రూ. 2 కోట్ల వరకు ఖర్చవుతోంది. వాటి నిర్వహణ, ఇంధనం, డ్రైవర్లు, మరమ్మత్తులు, భద్రతా ఏర్పాట్లు కలిపి సంవత్సరానికి కోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో మంత్రుల కోసం ప్రత్యేకంగా విలాసవంతమైన వాహనాలను దిగుమతి చేసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో బెంచీలు లేక విద్యార్థులు నేలపై కూర్చోవాల్సిన పరిస్థితులు కనిపించడం తీవ్ర వ్యత్యాసాన్ని సూచిస్తోంది.

ఒకప్పుడు రాజకీయ నాయకుల కుటుంబ సభ్యులు ప్రభుత్వ వ్యవహారాలకు దూరంగా ఉండేవారు. కానీ ప్రస్తుతం కుటుంబ రాజకీయాలు పెరగడంతో ప్రభుత్వ వనరుల వినియోగం కూడా విస్తరించిందనే విమర్శలు వస్తున్నాయి. కొన్నిసార్లు ప్రభుత్వ వాహనాలు వ్యక్తిగత కార్యక్రమాలకు వినియోగించబడుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ ఆస్తి ప్రజల ఆస్తి అనే భావన బలహీనపడటం సమాజానికి ప్రమాదకర సంకేతంగా మారుతోంది. ప్రభుత్వ ధన వినియోగంపై కఠిన పర్యవేక్షణ లేకపోతే వృథా ఖర్చులు మరింత పెరిగే అవకాశముందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతల మధ్య రాజకీయ నాయకుల విలాసవంతమైన జీవనం ప్రజల్లో ఆగ్రహాన్ని పెంచుతోంది. 2025 నాటికి దేశంలో నిరుద్యోగ యువత సంఖ్య కోట్లలో ఉందని పలు సర్వేలు తెలియజేస్తున్నాయి. రైతులు అప్పుల భారంతో ఆత్మహత్యలు చేసుకుంటున్న ఘటనలు కొనసాగుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో జీవన వ్యయం గణనీయంగా పెరిగింది. ఇలాంటి సమయంలో ప్రజాప్రతినిధులు విలాసవంతమైన కాన్వాయ్‌లతో తిరగడం సామాన్య ప్రజలకు అసహనాన్ని కలిగిస్తోంది. ప్రజాస్వామ్యంలో నాయకుడు ప్రజల కష్టాలను అర్థం చేసుకునే స్థితిలో ఉండాలి గానీ ప్రజల నుండి దూరంగా ఉండకూడదనే భావన బలపడుతోంది. భారతదేశంలో కొన్ని రాష్ట్రాలు ఇటీవల ఖర్చు నియంత్రణ చర్యలను ప్రారంభించినప్పటికీ అవి పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. కొన్నిచోట్ల మంత్రుల వాహన దళాల సంఖ్య తగ్గించాలని సూచనలు వచ్చినా ప్రాయోగికంగా పెద్ద మార్పు కనిపించలేదు. ప్రభుత్వ ఖర్చులపై పారదర్శకత పెరగాల్సిన అవసరం ఉందని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. ప్రతి శాఖ ఖర్చుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచితే ప్రజా ధన వినియోగంపై అవగాహన పెరుగుతుందని భావిస్తున్నారు.

రాజకీయ వ్యవస్థలో నైతిక విలువల క్షీణత కూడా వృథా ఖర్చులకు ఒక ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఒకప్పుడు రాజకీయాల్లో సేవాభావం, త్యాగం, ప్రజల పట్ల బాధ్యత ప్రధాన విలువలుగా ఉండేవి. ఇప్పుడు రాజకీయాలను అధికారం, ఆస్తి, ప్రభావం కోసం వినియోగించే ధోరణి పెరిగిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో భారీగా ఖర్చు చేసిన నాయకులు తర్వాత ఆ ఖర్చులను తిరిగి పొందేందుకు అధికారాన్ని వినియోగిస్తున్నారనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితి ప్రజాస్వామ్య వ్యవస్థ నాణ్యతను దెబ్బతీస్తోంది.

అంతర్జాతీయంగా పరిశీలిస్తే అనేక అభివృద్ధి చెందిన దేశాల్లో రాజకీయ నాయకులు చాలా సరళంగా జీవిస్తున్న ఉదాహరణలు కనిపిస్తాయి. కొన్ని యూరప్ దేశాల్లో ప్రధానులు సైతం పరిమిత భద్రతతో ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించిన సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వ ఖర్చులను తగ్గించడం ద్వారా ప్రజల నమ్మకాన్ని పెంచడం అక్కడి రాజకీయ సంస్కృతిలో భాగంగా ఉంది. భారతదేశంలో కూడా అలాంటి బాధ్యతాయుత రాజకీయ సంస్కృతి బలపడాల్సిన అవసరం ఉందని మేధావులు సూచిస్తున్నారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలే అసలైన యజమానులు. ప్రజాప్రతినిధులు కేవలం సేవకులుగా వ్యవహరించాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం అనేక ప్రాంతాల్లో ప్రజల కంటే నాయకులకే అధిక ప్రాధాన్యం లభిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. రహదారుల మూసివేతలు, భారీ భద్రతా ఏర్పాట్లు, ప్రజలను గంటల తరబడి నిలిపివేయడం వంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా మారుతున్నాయి. నాయకులు ప్రజలకు దగ్గరగా ఉండే రాజకీయ సంస్కృతి తిరిగి రావాల్సిన అవసరం ఉంది.

యువతలో ప్రస్తుతం రాజకీయాలపై విమర్శాత్మక దృక్పథం పెరుగుతోంది. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వ ఖర్చులపై ప్రజలు ప్రశ్నలు అడుగుతున్నారు. పారదర్శకత కోసం డిమాండ్ పెరుగుతోంది. ఇది ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరమైన పరిణామంగా భావించవచ్చు. ప్రజలు జాగృతంగా ఉన్నప్పుడు మాత్రమే ప్రభుత్వాలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తాయి. అందుకే రాజకీయ వ్యవస్థలో మార్పు రావాలంటే ప్రజల అవగాహన కూడా కీలక పాత్ర పోషిస్తుంది.

ప్రభుత్వాలు ఖర్చు నియంత్రణ కోసం కొన్ని ముఖ్యమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మంత్రుల వాహనాల సంఖ్యకు గరిష్ట పరిమితి నిర్ణయించడం, ప్రభుత్వ కార్యక్రమాల్లో అధిక వ్యయాలను నియంత్రించడం, ప్రజా ధన వినియోగంపై స్వతంత్ర తనిఖీ సంస్థలను బలోపేతం చేయడం అవసరం. అలాగే ప్రజాప్రతినిధుల ఆస్తుల వివరాలు, అధికారిక ఖర్చుల వివరాలు నిరంతరం ప్రజలకు వెల్లడించే విధానం అమలు చేయాలి. ప్రజల ధనం ప్రజల అభివృద్ధికే వినియోగించబడుతోందనే నమ్మకం కలిగినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుంది.

ముగింపుగా పరిశీలిస్తే భారత రాజకీయ వ్యవస్థ ప్రస్తుతం ఒక కీలక దశలో నిలిచింది. ఒకవైపు దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నప్పటికీ మరోవైపు రాజకీయ వృథా ఖర్చులు ప్రజల్లో అసంతృప్తిని పెంచుతున్నాయి. లాల్ బహదూర్ శాస్త్రి వంటి నాయకుల నిరాడంబర జీవనం నేటి తరానికి ఆదర్శంగా నిలవాలి. ప్రజాప్రతినిధులు సరళ జీవన విధానాన్ని అనుసరించి ప్రజా ధనాన్ని జాగ్రత్తగా వినియోగించినప్పుడే దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలపడుతుంది. ప్రభుత్వ వనరులు ప్రజల సంక్షేమానికి వినియోగించబడినప్పుడే నిజమైన స్వాతంత్ర్య ఫలాలు ప్రతి పౌరునికి చేరుతాయి.



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

## ఇబ్రహీంబాగ్ చెరువు అభివృద్ధి పనులపై అధికారుల పరిశీలన



**రాజేంద్రనగర్, మే 18 (జనం సాక్షి) :** ఇబ్రహీంబాగ్ చెరువు అభివృద్ధి పనులను జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ డిప్యూటీ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి వివిధ శాఖల ఈఈలు, డీఈఈలు కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. చెరువులోకి డ్రైనేజ్ నీరు ప్రవేశించకుండా చేపడుతున్న డైవర్షన్ పనుల పురోగతిపై అధికారులు సమీక్ష నిర్వహించారు. అలాగే రూ.99 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పందెనా వాగు అభివృద్ధి పనులపై కూడా అధికారులతో చర్చించారు. పనులను డౌన్ స్ట్రీమ్ ప్రాంతం నుండి ప్రారంభించాలని కోరగా, జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి సంబంధిత కాంట్రాక్టర్లకు వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఇంకా డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కొన్ని అభివృద్ధి పనులను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వాటిపై ఎస్ఈతో సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇబ్రహీంబాగ్ చెరువు పరిరక్షణ, అభివృద్ధి, ప్రజా మౌలిక వసతుల బలోపేతం దిశగా అధికారులు కీలక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఈ సంజయ్, కాంగ్రెస్ నాయకులు మెరుగు జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలందరికీ పని కల్పించాలి



**యాచారం, మే 18 (జనం సాక్షి) :** పని అడిగిన ప్రతికూలికి పని కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని ఎంపీడీవో రాధా రాణి అన్నారు సోమవారం యాచారం మండల పరిధిలోని తక్కలపల్లి తండాలో ఆమె ఉపాధి పనులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూలీలందరూ ఉపాధి పనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నియమ నిబంధనల ప్రకారం పనులు చేయాల్సిన అవసరం ఉందన్నారు ఉదయం వేళల్లో కూలీలు పనులు చేయాలన్నారు కూలీలకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలని మెడికల్ కిట్లు పంపిణీ చేశారు పంచాయతీ కార్యదర్శిలు ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి సిబ్బంది అందుబాటులో ఉండి అందరికీ పని చూపించాలన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కౌసల్య ఉపసర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## వడ్లు కొనాలని జాతీయ రహదారిపై రైతుల ధర్నా



**బొంరాస్‌పేట, మే 18 (జనం సాక్షి) :** ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యము మద్దతు ధర లభిస్తుందని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకెళితే వడ్లు కొనుగోలు చేయడం లేదని సోమవారం ఏకంగా హైదరాబాద్ బీజాపూర్ 163వ జాతీయ రహదారి తుంకిమెట్ల ప్రధాన చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. కలెక్టర్ వచ్చి స్పష్టమైన హామీ ఇవ్వాలని నినాదాలు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై బాల వెంకటరమణ సిబ్బందితో కలిసి రైతులతో మాట్లాడి ధర్నాను విరమింప చేశారు. అనంతరం రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు.

# శాంతిభద్రతల పరిరక్షణలో సరికొత్త అస్త్రం 'సాక్ ఐ'

- **కృత్రిమ మేధతో సోషల్ మీడియాపై నిరంతర నిఘా..**




**ముషీరాబాద్, మే 18 (జనం సాక్షి) :** సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో ఎప్పుడూ ముందుండే హైదరాబాద్ సిటీ పోలీస్ విభాగం, సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలను రెచ్చగొట్టే వారిపై ఉక్కుపాదం మోపేందుకు సోషల్ మీడియా అబ్జర్వేషన్ అండ్ సైబర్ ఇంటెలిజెన్స్(సాక్ ఐ) పేరుతో సరికొత్త కృత్రిమ మేధ ఆధారిత అప్లికేషన్‌ను ప్రారంభించింది. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఆన్‌లైన్ వేదికలపై తప్పుడు ప్రచారాలు చేసే వారిని పసిగట్టడంతో పాటు, అసాంఘిక శక్తుల కదలికలను ఎప్పటికప్పుడు విశ్లేషించేందుకు ఈ అత్యాధునిక వ్యవస్థను హైదరాబాద్ పోలీస్ ఐటీ విభాగం రూపొందించింది. గతంలో సోషల్ మీడియా పర్యవేక్షణకు భారీగా సిబ్బంది అవసరమవ్వడమే కాకుండా గంటల తరబడి మాన్యువల్‌గా శ్రమించాల్సి వచ్చేది. కానీ ఈ 'సాక్ ఐ' ద్వారా ఇకపై అన్నీ ఆటోమేటెడ్ పద్ధతిలో నిరంతరాయంగా జరుగుతాయి. దీనిలోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెంట్ డ్యాష్‌బోర్డ్ ద్వారా డయల్ 100 కాల్స్, అంతర్గత నిఘా సమాచారం, నగరంలో జరుగుతున్న ప్రధాన ఘటనల వివరాలను ఒకే చోట క్రోడీకరించి అధికారులకు పూర్తి స్థాయి క్షేత్రస్థాయి అవగాహన కల్పిస్తుంది. సాక్ ఐ తన ప్రయోగాత్మక దశలోనే అద్భుతమైన విజయాన్ని సాధించింది. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన పురానాపూల్ ఎక్స్ రోడ్ ఘటనకు సంబంధించి 85 ద్వేషపూరిత, మతపరమైన సున్నితమైన అంశాలను, అలాగే గుడిమల్కాపూర్ వివాదానికి సంబంధించి పలు సోషల్ మీడియా ఖాతాలలో ఉన్న 126 పోస్ట్‌లను ఇది గుర్తించింది. ఇటువంటి కంటెంట్‌ను సకాలంలో తొలగించేలా తక్షణ చర్యలు చేపట్టడం ద్వారా శాంతి సామరస్యాలను కాపాడటమే కాకుండా, విద్వేషాలను రేకెత్తించే వారిని గుర్తించడం సాధ్యమైంది. ప్రత్యేకించి మాదకద్రవ్యాల సరఫరా, మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై ఈ వ్యవస్థ దృష్టి పెడుతుంది. చిన్నారులపై లైంగిక వేధింపుల కంటెంట్, సైబర్ బుల్లింగ్, స్టాకింగ్ వంటి అంశాలను ఏఐ మోడల్స్ స్వయంగా గుర్తించి అప్రమత్తం చేస్తాయి. పోస్టుల తీవ్రతను బట్టి వాటిని హై, మీడియం, లో రిస్క్ కేటగిరీలుగా విభజించి, అభ్యంతరకర పోస్టులను తొలగించేలా సంబంధిత సోషల్ మీడియా సంస్థలకు నివేదిస్తుంది. నేరగాళ్ల నెట్‌వర్క్ విశ్లేషణ చేసే సామర్థ్యం ఈ అప్లికేషన్ ప్రత్యేకత కావడంతో, వివాదాస్పద పోస్టులను పదేపదే షేర్ చేసే వారిని, వాటిని వైరల్ చేసే ఖాతాలను ఇట్టే పట్టేస్తుంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను కూడా ఇది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది. ప్రతి ఫిర్యాదుకు ఒక యూనిక్ ట్రాకింగ్ నంబర్ కేటాయించి, అది పరిష్కారమయ్యే వరకు ఎండ్-టు-ఎండ్ మానిటరింగ్ చేస్తుంది. నగరంలో ప్రతిరోజూ జరిగే నిరసనలు, ర్యాలీలు, మతపరమైన ఊరేగింపుల వంటి కార్యక్రమాలపై ముందస్తు నిఘా ఉంచేందుకు 'ఈవెంట్ బేస్డ్ మానిటరింగ్' ఫీచర్‌ను ఇందులో పొందుపరిచారు. నిర్ణీత కీవర్డ్స్ ఆధారంగా సోషల్ మీడియా కార్యకలాపాలను ట్రాక్ చేస్తూ, ఏదైనా ముప్పు పొంచి ఉంటే వెంటనే పోలీసులను అప్రమత్తం చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పబ్లిక్ ప్రొఫైల్స్ మరియు కీవర్డ్స్ ఆధారంగా సెర్చ్ చేసే సామర్థ్యం ఉన్న గ్లోబల్ సెర్చ్ ఇంజిన్ ద్వారా ఏదైనా అంశంపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను, వస్తున్న కథనాలను తక్షణమే విశ్లేషించే వీలు కలుగుతుంది. అత్యాధునిక ఏఐ సాంకేతికతతో కూడిన ఈ 'సాక్ ఐ' వ్యవస్థ పోలీసుల పనిభారాన్ని తగ్గించడమే కాకుండా, నేర నివారణలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తుందని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ ఆశాభావం వ్యక్తం చేసారు. "సమాజంలో అశాంతిని రేకెత్తించే శక్తుల ఆటకట్టించేందుకు, మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చేందుకు ఈ ఏఐ వ్యవస్థను రూపొందించామన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరగాళ్లు సామాజిక మాధ్యమాలను అస్త్రంగా చేసుకుంటున్న తరుణంలో, అత్యాధునిక సాంకేతికతతో వారిని సమర్థంగా ఎదుర్కొంటాం" అని ఆయన స్పష్టం చేశారు.

## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- **ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**




**నిజాంపేట్, మే 18 (జనం సాక్షి) :** మేడ్చల్ కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మను చౌదరి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు తో కలిసి బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ హాజరయ్యారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో సీలింగ్ రూఫ్ లీకేజీల కారణంగా నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీటి సరఫరాను నిరంతరాయంగా అందించేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణమే అభివృద్ధి చేయాలని అధికారులను ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కోరారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పని చేసి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలను ఆదర్శవంతమైన నివాస సముదాయాలుగా తీర్చిదిద్దాలని ఆయన పేర్కొన్నారు.

## కదలని ధాన్యం బస్తాలు లారీల కోసం రోడ్డెక్కిన రైతులు

- **అన్నదాతలను ఆగం చేస్తున్న లారీ యూనియన్**



**కొల్చారం, మే 18 (జనం సాక్షి) :** కొల్చారం మండలంలోని పోతం శెట్టిపల్లి గ్రామ శివారులో ఏడుపాయల టీ జంక్షన్ వద్ద సోమవారం ఎన్‌హెచ్ 765డి రహదారిపై సుమారు రెండు గంటలపాటు రైతన్నలు లారీల కోసం రాస్తారకో నిర్వహించారు. సుమారు 3500 వడ్ల బస్తాలు తూకం వేసి ఐదు రోజులు గడుస్తున్న ఒక్క లారీ కూడా రాకపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. లారీలు ఎందుకు రావడం లేదని గ్రామ సర్పంచ్ దయాకర్ గౌడ్ లారీ యూనియన్ వాళ్లను నిలదీస్తే బయట మాకు 15000 రూపాయలు ఇస్తున్నారు. మీరు 17000 రూపాయల నుంచి 20000 రూపాయలు మాకు డబ్బులు ఇస్తేనే లారీలు వస్తాయంటూ లారీ యూనియన్ వాళ్లు రైతులకు తెలిపారు. రైతుల దగ్గర లారీ యూనియన్ వాళ్లు డబ్బులు డిమాండ్ చేస్తే అధికారులు ఏం చేస్తున్నారంటూ రైతన్నలు నిలదీశారు. అలాగే వరిగుంతం సీతారాం తాండ గ్రామాలకు చెందిన రైతులు తహసిల్దార్ వద్దకు వచ్చి గ్రామంలో 7500 బస్తాలు తూకం వేసి వారం రోజులు గడిచిన కూడా ఇంతవరకు లారీలు రాలేదని రైతులతో కలిసి సొసైటీ చైర్మన్ చిన్నారపు ప్రభాకర్ తహసిల్దార్ శ్రీనివాస చారికి విన్నవించుకున్నారు.

### తహసీల్దార్ శ్రీనివాస చారి ఇచ్చిన హామీ

వరిగుంతం గ్రామానికి రెండు రోజులలో లారీలను పంపించగలనని తాసిల్దార్ శ్రీనివాస చారి రైతులకు హామీ ఇచ్చారు. రెండు రోజులలో లారీలు పంపించలేనిచో పెద్ద ఎత్తున రాస్తారకోలు నిర్వహిస్తామని వరిగుంతం సీతారాం తండా పోతం శెట్టిపల్లి గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బాల్య దశలోనే దేశభక్తిని పెంపొందించుకోవాలి

- **జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గాజుల బస్వ రాజ్**

**తాండూరు, మే 18 (జనంసాక్షి) :** బాల్య దశలోనే దేశభక్తిని పెంపొందించుకోవాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గాజుల బస్వరాజ్ పేర్కొన్నారు. శ్రీ రామకృష్ణ సేవా సమితి తాండూర్ వారి ఆధ్వర్యంలో మంబాపూర్ గ్రామంలో 15 రోజులపాటు నిర్వహించిన సమ్మర్ క్యాంప్ (బాల వికాస కేంద్రం) ముగింపు సమావేశం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీ రామకృష్ణ సేవా సమితి గౌరవ అధ్యక్షులు గాజుల బస్వరాజ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశం అందించారు. సమ్మర్ క్యాంపులు విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీయడంలో ఎంతో ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. నేటి సమాజంలో చిన్నారులు మొబైల్ ఫోన్లకు అలవాటు పడి చదవడం, రాయడం, ఆటలకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామి వివేకానంద భావజాలాన్ని బాల్య దశ నుంచే అలవర్చుకుని దేశానికి అవసరమైన మంచి పౌరులుగా ఎదగాలని దేశభక్తిని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. గ్రామ సర్పంచ్ భార్గవి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు, సంస్కారం, క్రమశిక్షణ పెంపొందించేందుకు ఇలాంటి బాల వికాస కేంద్రాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. గ్రామంలో జరిగే ప్రతి మంచి కార్యక్రమానికి తమ వంతు సహకారం అందిస్తామని, ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమ కన్వీనర్ కేవియం వెంకట్ మాట్లాడుత సమ్మర్ క్యాంప్ విజయవంతానికి సహకరించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, మ్యాథ్స్‌తో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన ప్రేరణ, అభ్యాసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా శ్రీ రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా అందిస్తామన్నారు వాలంటీర్లుగా సేవలందించిన సంతోష్, పద్మ, ప్రసన్నలను ఘనంగా సత్కరించారు. క్యాంప్‌లో పాల్గొన్న చిన్నారులు శ్లోకాలు, సూక్తులు, పాటలు, పెద్దల ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు తమ మనసులో మాటను పంచుకుంటూ క్యాంప్ అనుభవాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు యాలటీ భార్గవి శ్రీనివాస్, ఉపసర్పంచ్ మోహిద్, మాజీ ఎంపీటీసీ యాల టి శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం వీరప్ప, శ్రీ శారద విద్యా మందిర్ ప్రిన్సిపల్ సంతోష్, ఉపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి, క్యాంప్ వాలంటీర్లు పద్మ, ప్రసన్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# హెచ్‌సీఏను తక్షణమే రద్దు చేయాలి

- **టీసీఏ ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి**



**సికింద్రాబాద్, మే 18 (జనంసాక్షి) :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)ను తక్షణమే రద్దు చేయాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్(టీసీఏ) ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి డిమాండ్ చేశారు. హెచ్‌సీఏ లో కొనసాగుతున్న అక్రమాలు, నిధుల మళ్లింపులపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్‌సీఏను తక్షణమే రద్దు చేసి, బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బీసీసీఐ) నేరుగా బాధ్యతలను స్వీకరించాలని కోరారు. ఈ మేరకు సోమవారం టీసీఏ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధరం గురువారెడ్డి మాట్లాడుతూ.. హెచ్‌సీఏలో జరుగుతున్న నకిలీ సొసైటీల వ్యవహారం, రిగ్గింగ్ ఎన్నికలు, టీజీ20 వేలం స్కామ్‌లపై సీఐడీ లేదా సీబీఐ చేత తక్షణ విచారణ జరిపించాలని కోరారు. రూ.100 కోట్ల టీజీ20 నిధుల మళ్లింపు కుట్ర జరిగిందన్నారు. బీసీసీఐ నిబంధనలను, సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ చట్టవిరుద్ధంగా 'టీజీ20 గవర్నింగ్ కౌన్సిల్'ను ఏర్పాటు చేశారని ఆయన ఆరోపించారు. ఏజీఎం ఆమోదం లేకుండానే, ఒక్కో ఫ్రాంచైజీ జట్టును రూ.3 కోట్ల నుండి రూ.10 కోట్ల వరకు వేలం వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారని పేర్కొన్నారు. దీని ద్వారా దాదాపు రూ.100 కోట్లకు పైగా నిధులను థర్డ్ పార్టీల ద్వారా దారి మళ్లించేందుకు కుట్ర పన్నారని మండిపడ్డారు. దీనిపై తాము త్వరలోనే అధికారికంగా సీఐడీకి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. హెచ్‌సీఏ రికార్డులను జప్తు చేసి, టీజీ20 ఖాతాలను ఫ్రీజ్ చేయాలన్నారు. ?నకిలీ క్లబ్ గుర్తింపుతో ఎన్నికల అక్రమాలు జరిగాయని, 'ఆక్స్‌ఫర్డ్ బ్లూస్ క్రికెట్ క్లబ్' పేరుతో రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఒకే పేరుతో రెండు నకిలీ సొసైటీలను నమోదు చేసి పెద్ద మోసానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితాను తారుమారు చేసేందుకే ఈ కుట్ర జరిగిందని ఆరోపించారు. గతేడాది నవంబర్‌లో మాత్రమే క్లబ్ బాధ్యతలు స్వీకరించిన ఎమ్. జీవన్ రెడ్డి, కేవలం నాలుగు నెలల కాలంలోనే ఫోర్జరీ, మాల్‌ప్రాక్టీస్ ద్వారా ఈ ఏడాది మార్చిలో హెచ్‌సీఏ గౌరవ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. ఇప్పటికే క్రైమ్ నెం. 02/2025 కింద ఈ సంస్థపై సీఐడీ విచారణ జరుగుతున్నా, హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ పి. నవీన్ రావు పర్యవేక్షణలో ఉన్నా.. హెచ్‌సీఏ ఒక చట్టవిరుద్ధ సంస్థలా వ్యవహరిస్తోందన్నారు. అనేక మంది సీనియర్ క్రికెటర్లను పక్కనబెట్టి అంబటి రాయుడును క్రికెట్ అడ్మినిస్ట్రేటర్‌గా నియమించారని, ఆయన వచ్చిన వెంటనే ప్రయోజనాల ఘర్షణ ఉన్న కమిటీలను నియమించి సెలక్షన్ వ్యవస్థను హైజాక్ చేశారని ఆరోపించారు. కామెంటేటర్‌గా ఉన్న టి.సుమన్ ను సెలెక్టర్‌గా నియమించడం, ఆయనే సోషల్ మీడియాలో ఓపెన్ సెలక్షన్స్ ప్రకటించడం అవినీతికి ద్వారాలు తెరవడమేనన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయిన ఆకాష్ భండారి జూనియర్స్ సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా ఉంటూ, సెక్రటరీ జీవన్ రెడ్డితో కలిసి ఎవరికీ తెలియని ఐదుగురు ఆటగాళ్లను ముంబైకి చెందిన ఒక ప్రైవేట్ అకాడమీ ద్వారా ఇంగ్లాండ్ పర్యటనకు పంపడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. హెచ్‌సీఏ అధికారిక ఆటగాళ్లను ప్రైవేట్ టూర్లకు పంపడం బైలాస్‌కు విరుద్ధమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16 నుంచి 36 ఏళ్ల వయసున్న ఆటగాళ్లకు ఈ తీవ్రమైన 45 డిగ్రీల ఎండలో ఒకే రోజు ఓపెన్ సెలక్షన్స్ నిర్వహించాలనుకోవడం హెచ్‌సీఏ మూర్ఖత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో జమ్మూ కాశ్మీర్‌లో బోర్డును రద్దు చేసినట్లుగానే ఇక్కడ కూడా బీసీసీఐ జోక్యం చేసుకోవాలన్నారు. హెచ్‌సీఏలోని అక్రమ నియామకాలన్నింటికీ టీసీఏ తరఫున లీగల్ నోటీసులు పంపుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ క్రీడా యువత తీవ్రంగా నష్టపోయిందని, ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో టీసీఏ సలహాదారు గోపాల్ శర్మ, ప్రతినిధులు చిత్తరంజన్, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుకుసాగాలి

- **యాచారం గ్రామ సర్పంచ్ మస్కు అనిత శరణం**



**యాచారం, మే 18 (జనం సాక్షి) :** మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆచారం గ్రామ సర్పంచ్ మస్కు అనిత శరణం అన్నారు. సోమవారం యాచారం మండల కేంద్రంలో మహిళ భవనాలకు శంకుస్థాపన చేశారు. గ్రామంలోని 6, 7 వార్డుల్లో డ్రైనేజీ సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళల పాత్ర ఎనలేనిదని ఆమె కొనియాడారు. మహిళలు డ్వాక్రా సంఘాలతో స్వయం ఉపాధితో మరియు రాజకీయంగా ఆర్థికంగా అన్ని రంగాల్లో ముందుకు సాగాలన్నారు. గ్రామ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తున్నానని తెలిపారు. గ్రామంలో అవసరమైన సిసి రోడ్డు, మురికి కాలువల నిర్మాణం కోసం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సహకారంతో నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. గ్రామస్తులు అధికారుల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మంగా కృష్ణ, పంచాయతీ కార్యదర్శి కిషన్ నాయక్, వార్డు సభ్యులు రెడ్డి లక్ష్మి, మస్కు యాదయ్య, సెల్ల శ్రీనాథ్, పుత్రి బేగం, సాజిద్, బెల్లి వైష్ణవి, షేక్ పాషా, నారిమల్ల శ్రీకాంత్, లావణ్య, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
19 మే 2026

# గ్రామీణ యువతకు స్వయం ఉపాధే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి జూపల్లి కృష్ణారావు



**సంగారెడ్డి ప్రతినిధి, మే 18 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంతాల యువతకు స్వయం ఉపాది కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని లక్ష్యం పర్యాటక, సాంస్కృతిక, అబ్కారీ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఎస్ఐహెచ్ఎంలో ఘనంగా నిర్వహించిన పర్యాటక వారోత్సవాలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జహీరాబాద్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్ఎం) సంస్థను కార్పొరేట్ స్థాయిలో బలోపేతం చేసేందుకు రూ.5 కోట్లు మంజూరు చేయనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో నూతనంగా ప్రవేశపెట్టిన బేకరీ, కన్ఫెక్షనరీ కోర్సులను మంత్రి ప్రారంభించారు. వీటితో పాటు నిథమ్ విద్యా సంవత్సరానికి సంబంధించిన బీబీఏ, ఎంబీఏ కోర్సుల అడ్మిషన్లను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు, పర్యాటక శాఖ రూపొందించిన 'టూరిస్ట్ గైడ్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా నిరుపయోగంగా ఉన్న ఎస్ఐహెచ్ఎంను పునః ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంత యువతీ యువకుల్లో వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించి, వారి కాళ్లపై వారు నిలబడేలా చేయాలనే ఉద్దేశంతో దశాబ్దాల క్రితం ఈ సంస్థను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు. ఎస్ఐహెచ్ఎంలో చేరిన పేద విద్యార్థులకు ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు, వారికి స్టైఫండ్ అందించే దిశగా ప్రభుత్వం తగిన కృషి చేస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిన ఈ యుగంలో, ప్రైవేట్ రంగంలో పుష్కలంగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. యువత ఈ అవకాశాలను అందుకోవడానికి పర్యాటక, ఆతిథ్య (హాస్పిటాలిటీ) రంగాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు కేవలం కోర్సులకే పరిమితం కాకుండా భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, విదేశీ భాషలను కూడా నేర్చుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, మార్కెట్‌లో ప్రస్తుతం డిమాండ్ ఉన్న ఆధునిక కోర్సులను కరిక్యులమ్‌లో చేర్చాలని నిథమ్ డైరెక్టర్ వెంకటరమణను మంత్రి ఆదేశించారు. పిల్లల ఉపాధి కోర్సుల విషయంలో తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ వాణిప్రసాద్, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్, నిథమ్ డైరెక్టర్ వెంకట రమణ, మాజీమంత్రి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ లు,తదితర అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మహిళల సంపూర్ణ ఆరోగ్య రక్షణ ప్రభుత్వ ధ్యేయం



**సంగారెడ్డి టౌన్/కంది, మే 18 (జనం సాక్షి) :** తెలంగాణలోని డ్వాక్రా (స్వయం సహాయక సంఘాల) మహిళల సంపూర్ణ ఆరోగ్య రక్షణ కోసం రేవంత్ రెడ్డి ప్రభుత్వం "హెల్త్ మిషన్-100" (100 రోజుల ఆరోగ్య మిషన్) అనే బృహత్తర కార్యక్రమం ద్వారా ఉచితంగా 30 రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తుందని టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా గ్రామణాభివృద్ధి శాఖ, కంది మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో లో కంది గ్రామ పిహెచ్సిలో ఏర్పాటు చేసిన వైద్య పరీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజిఐఐసీ కార్పొరేషన్ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ మహిళల్లో సాధారణంగా వచ్చే బిపి, సుగర్, థైరాయిడ్, రక్త హీనత వంటి 30 రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నారన్నారు. పరీక్షలు పూర్తయిన తర్వాత ప్రతీ మహిళ కు క్యుఆర్ కోడ్ తో కూడిన "డిజిటల్ హెల్త్ కార్డ్" రూపొందించి ప్రభుత్వ పోర్టల్ లో భద్రపరుస్తారని వివరించారు. దీనివల్ల భవిష్యత్తు లో ఏ ఆసుపత్రికి వెళ్ళిన వారి పూర్తి ఆరోగ్య చరిత్ర అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని డ్వాక్రా మహిళలకు సద్వినియోగం చేసుకోవాల ని కోరారు. ఈ కార్యక్రమం లో కంది గ్రామ సర్పంచ్ శ్రీరామ్, ఉప సర్పంచ్ ఖాన్, వార్డు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

- కొనుగోలు కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ఎస్పీ



**సంగారెడ్డి ప్రతినిధి, మే 18 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. కొండాపూర్ మండలం అలియాబాద్, కంది గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సందర్శించారు. ఈ సందర్భంగా వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతులకు అండగా నిలుస్తూ అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పోలీస్ శాఖ తరఫున అన్ని రకాల భద్రతా పరమైన ఏర్పాట్లకు సిద్ధంగా ఉన్నామని ఎస్పీ తెలిపారు. అవసరాన్ని బట్టి రవాణా వాహనాలు అందుబాటులో ఉండేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఇతర రాష్ట్రాలకు చెందిన ధాన్యాన్ని అక్రమంగా తెలంగాణ రాష్ట్రంలో విక్రయించకుండా చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో విధులు నిర్వహిస్తూ శాంతిభద్రతలు పరిరక్షించడంతో పాటు రైతుల ప్రయోజనాలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు.

## మొక్కజొన్న రైతులకు లారీలు గన్ని బ్యాగుల కొరత తీర్చాలి




**వనపర్తి రూరల్, మే 18 (జనం సాక్షి) :** వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కజొన్న రైతులు లారీలు, గన్ని బ్యాగుల కొరత తీర్చాలని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే శ్రీరామ్ డిమాండ్ చేశారు. సోమవారం వనపర్తి మార్కెట్ యార్డును సందర్శించి మొక్కజొన్న వరి రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనపర్తి మార్కెట్ యార్డులో మొక్కజొన్నలు కొనుగోలు చేయక పేరుకుపోయాయన్నారు. కొన్నింటిని తూకం వేసి నెల రోజులైనా లారీలు రాక తరలించలేదని రైతులు వాటి వద్ద రాత్రి పగలు కావలి కాస్తున్నారన్నారు. మార్కెట్లో పెద్ద మొత్తంలో మొక్కజొన్నలు అలాగే ఉన్నాయని గన్ని బ్యాగులు లేక కాంటాలు వేయలేదని, ఖాళీ సంచులు తెస్తే తూకం వేస్తామని అధికారులు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఖాళీ సంచులు కొనాలని గణపురం మండలం అప్పారెడ్డిపల్లి రైతుల నుంచి 1100 ఖాళీ సంచుల కోసం రూ. 33000 వసూలు చేశారన్నారు. వరి వేరుశనగ రైతులకు ఉచితంగా ఖాళీ సంచులు ఇస్తున్నారని మక్కజొన్న రైతుల వద్ద డబ్బులు వసూలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. డబ్బులు వాపస్ ఇవ్వాలని తగినన్ని ఖాళీ సంచులను ఉచితంగా సరఫరా చేయాలన్నారు. మద్దతు ధరరూ.2400 కొంత సరుకు మాత్రమే కొన్నారని, తక్కిన వాటిని రైతులు రూ. 1700లకే ప్రైవేటు వారికి అమ్ముతున్నారని మొత్తం సరుకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే పార్టీ ఆధ్వర్యంలో రైతులను సమీకరించి ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఘణపురం, గోపాల్ పేట, వనపర్తి మండల రైతులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల జీతాల దుర్వినియోగం



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, మే 18 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని మారెడు మాన్ దిన్నె గ్రామపంచాయతీలో గ్రామపంచాయతీ కార్మికుల జీతాలను అక్రమంగా మళ్లించి, కార్మికుల సంతకాలను ఫోర్జరీ చేసి అవినీతికి పాల్పడ్డారని గ్రామపంచాయతీ కార్మికులు ఆరోపించారు. ఈ మేరకు బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకొని తమకు రావలసిన జీతాలను ఇప్పించాలని వారు సోమవారం ప్రజావాణిలో ప్రభుత్వ అధికారులను కోరారు.గ్రామపంచాయతీ చెత్త ట్రాక్టర్ డ్రైవర్ అయిన మేకల జమ్మలయ్య మాట్లాడుతూ, తనకు 2024 నుండి 2025 మధ్యకాలంలో 8 నెలల జీతాలు ఇవ్వలేదని తెలిపారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్మికురాలు వి. ఈశ్వరమ్మకు 4 నెలల జీతాలు, డి. ఈదమ్మకు 3 నెలల జీతాలు చెల్లించలేదని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, మాజీ ఉపసర్పంచ్ శ్రీధర్ రావు కలిసి గ్రామపంచాయతీ వర్కర్ వి. రాజు ఖాతాలో పలు దఫాలుగా డబ్బులు జమ చేశారని ఆరోపించారు.

**వివరాలు ఇలా ఉన్నాయి :**
20-04-2024 న రూ. 5,500, 19-08-2024న రూ. 66,000, 11-07-2025 న రూ. 85,500 మొత్తం రూ. 1,57,000లను వి. రాజు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఆ డబ్బుల గురించి ప్రశ్నించగా అవి గ్రామపంచాయతీ కార్మికుల జీతాలేనని చెప్పారని, కానీ తమకు మాత్రం ఒక్క రూపాయి కూడా అందలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో గ్రామపంచాయతీ కార్మికుల జీతాలు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారని, అయితే 2024-2025 మధ్యకాలంలో మాత్రం వి. రాజు ఖాతాలోకి డబ్బులు మళ్లించారని తెలిపారు. ఈ డబ్బులను గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, మాజీ ఉపసర్పంచ్ శ్రీధర్ రావు, వి. రాజు ముగ్గురు కలిసి పంచుకున్నారని ఆరోపించారు.
ఇంకా, తాము జీతాలు తీసుకున్నట్లు చూపిస్తూ గ్రామపంచాయతీ రికార్డుల్లో తమ సంతకాలను ఫోర్జరీ చేశారని, పంచాయతీ నిధులను బయట వ్యక్తుల ఖాతాల్లోకి మళ్లించారని తెలిపారు. కొన్ని బిల్లులకు సంబంధించిన రికార్డులు లేకపోవడంతో పాటు, అవినీతి బయటపడుతుందనే భయంతో కొంత రికార్డులను మాయం చేశారని ఆరోపించారు. అందువల్ల గ్రామపంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ను, గ్రామపంచాయతీ వర్కర్ వి. రాజును తక్షణమే విధుల నుండి తొలగించి, మాజీ ఉపసర్పంచ్ శ్రీధర్ రావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే తమకు రావలసిన జీతాలను వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ కార్మికులు ప్రభుత్వాన్ని కోరారు.

## విపత్కర పరిస్థితిల్లో ప్రజలను అప్రమత్తం చేయాలి

- అదనపు రెవిన్యూ కలెక్టర్ మధు మోహన్
- వరదలు,పారిశ్రామిక ప్రమాదాలపై మాక్ డ్రిల్ నిర్వహణ
- ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన



**గద్వాల నడిగడ్డ, మే 18 (జనం సాక్షి) :** వరదలు, ఇతర విపత్కర సమయాల్లో ప్రజలను ముందస్తుగా అప్రమత్తత చేయడం ద్వారా ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా చూడవచ్చని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధు మోహన్ అన్నారు. సోమవారం అలంపూర్ లో తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో, కేంద్ర పర్యావరణ విపత్తు సంస్థ మరియు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహకారంతో వరదలు మరియు పారిశ్రామిక ప్రమాదాలపై మాక్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నమూనా ప్రథమ చికిత్స కేంద్రం, అత్యవసర సహాయక కేంద్రాలను అదనపు కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం కట్టలపేట ప్రాంతంలో గాయపడిన బాధితులను అంబులెన్స్‌ల ద్వారా ప్రథమ చికిత్స కేంద్రాలకు ఎలా తరలించాలో ప్రదర్శించారు. అనంతరం తుంగభద్ర ఘాట్ వద్ద నిర్వహించిన వరద మాక్ డ్రిల్‌లో ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక,పోలీస్, వైద్య శాఖల సిబ్బంది బోట్ల సహాయంతో వరదలో చిక్కుకున్న వారిని రక్షించే విధానాన్ని ప్రయోగపూర్వకంగా ప్రదర్శించారు. రెస్క్యూ చర్యలు చేపట్టి, బాధితులకు వైద్య పరీక్షల అనంతరం ఆసుపత్రులకు తరలించడంను ప్రయోగపూర్వకంగా వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సమీపంలోని మాంటిస్సోరి పాఠశాలలో ఏర్పాటు చేసిన రిలీఫ్ సెంటర్‌కు తరలించి ఆశ్రయం కల్పించడం, అక్కడ బాధితులకు ఆహారం, త్రాగునీరు, వైద్య సేవలు మరియు అవసరమైన ఇతర సౌకర్యాలను అందించడాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో భారీ వరదలు వస్తే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని, ముంపు ప్రాంతాల ప్రజలను కాపాడడం, సురక్షిత ప్రాంతాలకు తరలించి పక్కాగా సహాయక చర్యలు చేపట్టేందుకు మాక్ ఎక్సర్ సైజ్ దోహదపడుతుందన్నారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, వైద్య, మత్స్య, మున్సిపల్ తదితర శాఖల సిబ్బంది సమన్వయంతో ఎలా పనిచేయాలో ప్రాక్టికల్‌గా ప్రదర్శించామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా యంత్రాంగం ప్రజలకు అండగా నిలుస్తుందని, సహాయక చర్యలు వేగవంతంగా చేపడుతుందన్నారు. ప్రజలు ఎలాంటి విపత్తు పరిస్థితుల్లోనూ భయాందోళనలకు గురికాకుండా అధికారుల సూచనలు పాటించాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ మున్సిపల్ చైర్మన్ జయరాములు, జిల్లా అగ్నిమాపక అధికారి అశోక్, తహసీల్దార్ ప్రభాకర్, వైద్య, పోలీస్, బెటాలియన్ మున్సిపల్, విద్యుత్, రెస్క్యూ బృందాలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇథనాల్ ఫ్యాక్టరీతో ప్రజల ప్రాణాలతో చెలగాటం

- కాలుష్యంపై కదిలిన అఖిలపక్షం,ప్రజా సంఘాలు
- ఎంపీడీవోకు వినతిపత్రం



**బెజ్జంకి, మే 18 (జనం సాక్షి) :** మండలంలో ఇథనాల్ ఫ్యాక్టరీల వల్ల స్థానిక గ్రామాలు ప్రజలు తీవ్ర కాలుష్య సమస్యలను ఎదుర్కొంటున్నాయని ఆరోపిస్తూ అఖిలపక్ష పార్టీలు,ప్రజా సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు.ఫ్యాక్టరీల నుంచి వెలువడుతున్న విష వాయువులు,రసాయన వ్యర్థాల కారణంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని,గ్రామాల భవిష్యత్ ప్రమాదంలో పడుతోందని అధికారులకు వివరించి ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. రైతు యుద్ధం – ప్రజా ఆరోగ్యం కోసం అనే నినాదంతో నాయకులు మాట్లాడుతూ ప్రజావాసాల మధ్య కొనసాగుతున్న ఇథనాల్ ఫ్యాక్టరీలను తక్షణమే మూసివేయాలని లేదా ప్రజలకు ఎలాంటి హాని కలగని నిర్జవన ప్రాంతాలకు తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమ నిర్వాహకులు ధర్మ సమాజ్ పార్టీ మానకొండూరు నియోజకవర్గ ఇంచార్జి లింగాల సురేష్ మాట్లాడుతూ గ్రామాల రక్షణ,ప్రజల ఆరోగ్యం కోసం ఈ పోరాటాన్ని మరింత విస్తృతంగా ఉధృతం చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో స్వేరో రాష్ట్ర నాయకులు బొర్ర సురేష్ కుమార్, సీపీఎం జిల్లా నాయకులు బోనగిరి శ్రవణ్, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు వడ్లూరి పరిసరములు, సీపీఎం మండల నాయకులు సంగ ఎల్లయ్య, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి మహేష్, ఎంజేస్ మండల నాయకులు జేరిపోతుల రవి, ప్రసన్న కుమార్,పట్టణ శాఖ అధ్యక్షులు బోనగిరి చందు,ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లింగాల బాబు,బొర్రా స్వామి,కనగండ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే పోలీసుల ప్రాధాన్యం



**వనపర్తి బ్యూరో, మే 18 (జనంసాక్షి) :** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 10 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను నేరుగా వనపర్తి అదనపు ఎస్పీ రాజేష్ మీనాకు వివరించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను నేరుగా విని, వాటికి తక్షణ పరిష్కారం చూపడం పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ప్రజలకు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేసే నమ్మకమైన వేదికగా మారిందన్నారు.ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును సున్నితంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకొని చట్టబద్ధంగా, వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అంకితభావంతో పనిచేస్తుందని తెలిపారు. ప్రజలు పోలీసు శాఖపై విశ్వాసం ఉంచి, తమ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.



# విపత్కర పరిస్థితిల్లో ప్రజలను అప్రమత్తం చేయాలి

- అదనపు రెవిన్యూ కలెక్టర్ మధుమోహన్
- వరదలు,పారిశ్రామిక ప్రమాదాలపై మాక్‌డ్రిల్ నిర్వహణ
- ప్రకృతి విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన

**గద్వాల నడిగడ్డ, మే 18 (జనం సాక్షి) :** వరదలు, ఇతర విపత్కర సమయాల్లో ప్రజలను ముందస్తుగా అప్రమత్తత చేయడం ద్వారా ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా చూడవచ్చని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధు మోహన్ అన్నారు. సోమవారం అలంపూర్‌లో తెలంగాణ రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో, కేంద్ర పర్యావరణ విపత్తు సంస్థ మరియు కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ సహకారంతో వరదలు మరియు పారిశ్రామిక ప్రమాదాలపై మాక్ ఎక్సర్‌సైజ్‌ను నిర్వహించారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నమూనా ప్రథమ చికిత్స కేంద్రం, అత్యవసర సహాయక కేంద్రాలను అదనపు కలెక్టర్ పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. అనంతరం కట్టలపేట ప్రాంతంలో గాయపడిన బాధితులను అంబులెన్స్‌ల ద్వారా ప్రథమ చికిత్స కేంద్రాలకు ఎలా తరలించాలో ప్రదర్శించారు. అనంతరం తుంగభద్ర ఘాట్ వద్ద నిర్వహించిన వరద మాక్ డ్రిల్‌లో ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక,పోలీస్, వైద్య శాఖల సిబ్బంది బోట్ల సహాయంతో వరదలో చిక్కుకున్న వారిని రక్షించే విధానాన్ని ప్రయోగపూర్వకంగా ప్రదర్శించారు. రెస్క్యూ చర్యలు చేపట్టి, బాధితులకు వైద్య పరీక్షల అనంతరం ఆసుపత్రులకు తరలించడంను ప్రయోగపూర్వకంగా వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సమీపంలోని మాంటిస్సోరి పాఠశాలలో ఏర్పాటు చేసిన రిలీఫ్ సెంటర్‌కు తరలించి ఆశ్రయం కల్పించడం, అక్కడ బాధితులకు ఆహారం, త్రాగునీరు, వైద్య సేవలు మరియు అవసరమైన ఇతర సౌకర్యాలను అందించడాన్ని ప్రదర్శించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో భారీ వరదలు వస్తే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొని, ముంపు ప్రాంతాల ప్రజలను కాపాడడం, సురక్షిత ప్రాంతాలకు తరలించి పక్కాగా సహాయక చర్యలు చేపట్టేందుకు మాక్ ఎక్సర్ సైజ్ దోహదపడుతుందన్నారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, వైద్య, మత్స్య, మున్సిపల్ తదితర శాఖల సిబ్బంది సమన్వయంతో ఎలా పనిచేయాలో ప్రాక్టికల్‌గా ప్రదర్శించామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో జిల్లా యంత్రాంగం ప్రజలకు అండగా నిలుస్తుందని, సహాయక చర్యలు వేగవంతంగా చేపడుతుందన్నారు. ప్రజలు ఎలాంటి విపత్తు పరిస్థితుల్లోనూ భయాందోళనలకు గురికాకుండా అధికారుల సూచనలు పాటించాలని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ మున్సిపల్ చైర్మన్ జయరాములు, జిల్లా అగ్నిమాపక అధికారి అశోక్, తహసీల్దార్ ప్రభాకర్, వైద్య, పోలీస్, బెటాలియన్ మున్సిపల్, విద్యుత్, రెస్క్యూ బృందాలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## క్రీడ వారోత్సవాల సందర్భంగా వాక్‌థాన్



వరంగల్ ప్రతినిధి, మే 18(జనం సాక్షి) : ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా యువజన క్రీడలవారోత్సవాలలో భాగంగా మొదటి రోజున సోమవారం వరంగల్ నగరంలో వాక్‌థాన్, కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సతీష్ శారద ప్రారంభించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కాశీబుగ్గలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన ఈ వాక్‌థాన్ ఐడీఓసీ వరకు కొనసాగింది. ఈ వాక్‌థాన్ అనంతరం మానవహారం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువతలో ఆరోగ్య చైతన్యం, క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యం అనేది అక్షరాల సత్యం అని ప్రతి ఒక్కరు ఒత్తిడిని నివారించుటకు వ్యాయామం మార్నింగ్ వాక్ తప్పనిసరి అని వారు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సీఈవో రామ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పని సరిగా వ్యయం మార్నింగ్ వాక్ చేయాలని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి, యువజన మరియు క్రీడల వారోత్సవాల నోడల్ అధికారి మాట్లాడుతూ ఈ కార్యక్రమ 18 నుండి 23 వరకు నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఓ నీరజ, డిబిసిడిఓ పుష్పలత, యూత్ మరియు స్పోర్ట్ అధికారి అనిల్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాజమణి,ఫిషరీస్ శ్రీపతి, డి ఎం డబ్ల్యు ఓ డి రమేశ్, సంబంధిత శాఖల అధికారులు పలు విద్యాసంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత ప్రాంతాల్లో మాక్ డ్రిల్

- హనుమకొండ సమ్మయ్యనగర్, లష్కర్ సింగారంలోని యుపిహెచ్‌సి, వివేక్ నగర్‌లో మాక్ ఎక్సర్సైజ్
- పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, డీసీపీ కవిత, అదనపు కలెక్టర్ రవి, అధికారులు



హనుమకొండ ప్రతినిధి, మే 18 (జనంసాక్షి) : హనుమకొండ నగరంలోని వరద ముంపు ప్రభావిత కాలనీలలో సోమవారం చేపట్టిన మాక్ ఎక్సర్సైజ్ ( డ్రిల్ )ను వివిధ శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించారు. ప్రకృతి విపత్తులు, పారిశ్రామిక ప్రమాదాలు సంభవించినప్పుడు రెస్క్యూ బృందాలు, వివిధ శాఖల అధికారులు చేపట్టే సహాయక చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ఈ మాక్ ఎక్సర్సైజ్ సాగింది. ఉదయం 8:30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మాక్ ఎక్సర్సైజ్ హనుమకొండలోని ఏడు చోట్ల ఏకకాలంలో రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డిఆర్ఎఫ్), అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, పోలీస్,మున్సిపల్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో సహాయక చర్యలు నిర్వహించారు.

వరద ప్రభావిత ప్రాంతమైన ఏడు వరద ముప్పు ప్రాంతాలలో ఎమర్జెన్సీ సైరన్ ను మోగిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎస్ డి ఆర్ ఎఫ్, అగ్నిమాపక శాఖ, ఇతర శాఖల అధికారులు సహాయక చర్యలను చేపట్టారు. ముంపునకు గురైన ఆ కాలనీ ప్రజలను ఎస్ డీ ఆర్ ఎఫ్ అధికారి రవి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సుదర్శన్ రెడ్డి, ఆధ్వర్యంలో రెస్క్యూ బృందాలు సురక్షితంగా బయటకు తీసుకువచ్చి పునరావాస కేంద్రం నకు తరలించారు. 108 అంబులెన్సు, ఎస్డిఆర్ఎఫ్ వాహనాలు, అగ్నిమాపక వాహనాలను సహాయక చర్యలలో భాగంగా రంగంలోకి దిగాయి. సహాయక చర్యలు చేపట్టేందుకు ఏర్పాటుచేసిన స్టేజింగ్ వద్ద లైఫ్ బోట్లను అందుబాటులో ఉంచారు.

### ఎస్వీ కన్వెన్షన్ హాలులో పునరావాస కేంద్రం

స్నేహ నగర్ లోని ఎస్వీ కన్వెన్షన్ హాలులో పునరావాస కేంద్రం ను అధికారులు ఏర్పాటు చేశారు. మాక్ ఎక్సర్సైజ్ లో భాగంగా వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా ఎన్డిఆర్ఎఫ్, డిఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖల బృందాలు సురక్షితంగా కాపాడి వాహనాల్లో పునరావాస కేంద్రానికి తరలించారు. పునరావాస కేంద్రంలో డిఎంహెచ్వో డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది వైద్య సేవలను అందించారు. బాధితుల కోసం బెడ్లను ఏర్పాటు చేసి బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లను అందజేశారు. అల్పాహారం, భోజన సౌకర్యాలను కల్పించారు.

### క్షేత్ర స్థాయిలో సహాయక చర్యలను పరిశీలించిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

మాక్ ఎక్సర్సైజ్ లో భాగంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పలు వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. సహాయక చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సమ్మయ్య నగర్ లో వరద ప్రభావ కాలనీ నుండి ఎస్డిఆర్ఎఫ్, అగ్నిమాపక బృందాలు ప్రజలను తరలిస్తున్న విధానాన్ని కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, అదనపు కలెక్టర్ ఎన్. రవి, డీఆర్వో శ్రీనివాస్, ఏసీపి నరసింహారావు, ఇతర అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా అర్బన్ ఫ్లడింగ్, ఫ్లాష్ ఫ్లడ్స్ వంటి విపత్తులకు అధికంగా గురయ్యే ప్రాంతంగా ఉందని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తెలిపారు. గత ఐదేళ్లలో మూడు సార్లు భారీ వరదలు సంభవించాయని, గత ఏడాది మూడు సైక్లోన్ల ప్రభావంతో రెండు రోజుల పాటు సాధారణ జీవనం పూర్తిగా స్థంభించిన పరిస్థితులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. విపత్తు నిర్వహణలో ప్రతి శాఖ సమన్వయం, ప్రజల సహకారం అత్యంత కీలకమని, ముందస్తు సిద్ధత ద్వారానే ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించగలమని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి స్పష్టం చేశారు. మాక్ ఎక్సర్సైజ్ లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఫైర్ ఆఫీసర్ శంకర్ లింగం, డీడబ్ల్యుఓ విశ్వజ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బిక్కన్ ధర్వేశ్ దర్గా ఆస్తులను పరిరక్షించాలి

- మీడియా సమావేశంలో ముస్లిం పెద్దలు



వరంగల్ బ్యూరో, మే 18 (జనం సాక్షి) : ఉరుసు ప్రాంతంలోని బిక్కన్ దర్వేష్ దర్గా ఆస్తులను పరిరక్షించాలని పలువురు ముస్లిం పెద్దలు కోరారు ఈ మేరకు వారు దర్గా ప్రాంతంలో సోమవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మమ్మద్ రియాజ్, మహమ్మద్ అలీ మహమ్మద్ రఫిక్, జైనుల బిదిన్, కాంగ్రెస్ నాయకుడు డు మహమ్మద్ అమీర్, అలీషా ఖాద్రీ, రియాజ్ , రెహమాన్, యూసుఫ్ బేగ్ మాట్లాడుతూ 'హజ్రత్ జిందా బిక్కన్ దర్వేష్ దర్గా, మస్జిద్'కు చెందిన సర్వే నంబర్లు 273, 274, 275, 276లో సుమారు 17 ఎకరాలు 5 గుంటల భూమి అధికారికంగా వక్ఫ్ ఆస్తిగా గెజిట్‌లో నమోదై ఉన్నట్లు తెలిపారు. కొందరు వక్ఫ్ భూమిలో అక్రమంగా ప్రవేశించి నిర్మాణాలకు ప్రయత్నిస్తున్నారని, కొందరు నిర్మాణాలు కూడా చేసినట్లు ఆరోపించారు. అదేవిధంగా సెల్ టవర్ కూడా నిర్మాణం చేసి దాని నుండి వచ్చేటువంటి డబ్బులను కూడా వాడుకుంటున్నట్లు పేర్కొన్నారు. మిల్స్ కాలనీ పోలీసులు వెంటనే స్పందించి ఎఫ్ఐఆర్ నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వక్ఫ్ శాఖ ప్రతినిధులు కోరుతున్నారు. వక్ఫ్ ఆస్తులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటూ అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని అక్రమ ఆక్రమణలను తొలగించాలని కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- మక్క జొన్న, ధాన్యం కొనుగోళ్ల నిర్వహణలో రైతుల నుండి డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు



మహబూబాబాద్ బ్యూరో,మే 18(జనం సాక్షి): సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, జిల్లా స్థాయి అధికారులతో కలిసి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో ప్రజావాణికి వస్తారని, వారి అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో నమోదైన ప్రతి అర్జీని ఆయా శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి. ఎలాంటి జాప్యం లేకుండా నిబంధనల ప్రకారం పరిష్కరించాలి. కేవలం నివేదికల కోసమే కాకుండా, బాధితుడికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగేలా నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలి. ఒకవేళ సమస్య తిరస్కరణకు గురైతే, దానికి గల స్పష్టమైన కారణాలను అర్జీదారునికి లిఖితపూర్వకంగా తెలియజేయాలని అన్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, సంక్షేమ శాఖల అధికారులు పరస్పరం సమన్వయం చేసుకుంటూ భూ సమస్యలు, ఇతర సామాజిక సమస్యలను పరిష్కరించాలి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ధరణి సమస్యలు, ఆసరా పింఛన్లు, డబుల్ బెడ్రూమ్ ఇళ్ళు, భూ వివాదాలు మరియు స్థానిక సమస్యలపై జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ప్రజలు కలెక్టర్‌కు వినతి పత్రాలు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 132 దరఖాస్తులు వచ్చాయి, ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మక్క జొన్న, ధాన్యం కొనుగోళ్ల నిర్వహణలో రైతులను డబ్బులు వసూలు చేస్తే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గత రెండు మూడు రోజుల నుండి రికార్డు స్థాయిలలో కొనుగోలు తరలింపు జరుగుతుందని మరింత అంకితభావంతో పనిచేసే రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మే 18 నుండి ప్రారంభమైన యువజన క్రీడా దినోత్సవ పోస్టర్ను ఆవిష్కరించి జిల్లా వ్యాప్తంగా షెడ్యూల్ ప్రకారం ఏర్పాటుచేసిన కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, జడ్పీ సీఈవో (హౌసింగ్ పీడీ) పురుషోత్తం, డి ఆర్ డి ఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిసిఓ వెంకటేశ్వర్లు, అన్ని విభాగాల అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, డివిజన్ కార్యాలయాలలో డివిజన్ స్థాయి అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.




## ప్రైవేటు టాంకర్లు రాకుండా చూస్తాం

- మున్సిపల్ డిఈఈ రంగారావు
- 'జనంసాక్షి' కథనానికి స్పందన

వరంగల్ బ్యూరో, మే 18 (జనం సాక్షి) : రంగసాయిపేట వాటర్ ట్యాంకులోకి ప్రైవేట్ ట్యాంకర్లు రాకుండా చూస్తామని, నీళ్లు పట్టుకుపోకుండా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ డి ఈ ఈ రంగారావు అన్నారు. సోమవారం జనం సాక్షిలో వచ్చినటువంటి రంగసాయిపేట వాటర్ ట్యాంకులో నీళ్ల దోపిడీ అనే కథనానికి స్పందన లభించింది. ఈ మేరకు డిఈఈ రంగారావు మాట్లాడారు. వాటర్ ట్యాంక్ లో ఎలాంటి సమస్య లేకుండా చూస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

## గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరికి 10 ఏళ్ల జైలుశిక్ష

- చెరొక 100,000 జరిమానా
- మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ములుగు పోలీసుల కఠిన చర్య....
- అభినందించిన జిల్లా ఎస్పి కేకన్ సుధీర్ రామనాథ్...



ములుగు,మే18(జనం సాక్షి): ములుగు జిల్లా మరియు సెషన్స్ కోర్టులో సోమవారం రోజు ఎన్‌డీపీఎస్ (మత్తు పదార్థాల ) కేసులో కీలక తీర్పు వెలువడింది. తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నెంబర్ 128/2020 ఎన్‌డీపీఎస్ యాక్ట్ మరియు ఎంవీ యాక్ట్ కు సంబంధించిన కేసులో న్యాయమూర్తి శ్రీమతి ఎస్వీపి సూర్య చంద్రకళ తీర్పు ప్రకటించారు. ఈ కేసులో నిందితులు పల్తియా తండా రంగంపేట గ్రామం గూడూరు మండలం మహబూబాబాద్ జిల్లా కు చెందిన పల్తియా శంకర్ వయసు 20 సంవత్సరాలు మరియు వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం అశోక్ నగర్ కు చెందిన 23 సంవత్సరాల బూడిద శ్రీకాంత్ లపై అభియోగాలు రుజువుకావడంతో ఇద్దరికీ భారత క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ప్రకారం 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష తో పాటు ఒక్కొక్కరికి రూ. 1,00,000 జరిమానా విధించారు. ఈ కేసులో షి ర్యాదుదారంగా తాడ్వాయి పోలీస్ స్టేషన్‌కు చెందిన అప్పటి ఎస్ఐ జి.రవీందర్ వ్యవహరించగా,దర్యాప్తు అధికారిగా పస్రా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ పని చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారిగా డీసీఆర్‌బీ డీఎస్పీ ఈ.కిషోర్ కుమార్ పర్యవేక్షణ నిర్వహించగా, లైజనింగ్ అధికారిగా డీసీఆర్‌బీ ఎస్ఐ నాగరాజు విధులు నిర్వర్తించారు. విచారణ సమయంలో పస్రా సీఐ పి.దయాకర్, తాడ్వాయి ఎస్ఐ కె.జగదీష్ హాజరయ్యారు. ఈ కేసు తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్లు చి.సత్యనారాయణ, డి.రామ్ సింగ్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. కేసు విచారణలో సీడీవోలు బి.గిరివాసు, వి.మౌనిక కీలకంగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి కేకాన్ సుధీర్ రామనాథ్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా మరియు వినియోగంపై ములుగు జిల్లా పోలీసులు నిరంతరం ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు. యువతను మాదక ద్రవ్యాల బారిన పడకుండా కాపాడటమే లక్ష్యంగా కఠిన చర్యలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

## యువత సన్మార్గంలో పయణించాలి

- సంజోష్‌ను అభినందించిన ఏఎస్పీ మనన్ బట్
- 118మంది విద్యార్థులు క్యాష్ అవార్డు పంపిణీ




ఏటూరునాగారం, మే 18(జనంసాక్షి) : యువత సన్మార్గంలో ప్రయణించాలని ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ బట్ అన్నారు. సంజోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లోని పదో తరగతిలో 500ల మార్కులకు పైగా వచ్చిన విద్యార్థులకు, ఇంటర్మీడియేట్ లో 900ల పై మార్కుల వచ్చిన విద్యార్థులకు రూ 2వేల చొప్పున క్యాష్ ఆవార్డులను సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ లో విద్యార్థులకు ఏఎస్పీ చేతుల మీదుగా బేవర్స్ సినిమా హీరో, సంజోష్ ఫౌండేషన్ అధ్యక్షుడు సంజోష్ లు కలిసి నగదును అందజేశారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఏఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్య, నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. మగ పిల్లలు ఆడ పిల్లల వెనుక పడొద్దని, వారి జీవితాలను ఆగం చేసుకోవద్దన్నారు. యువత క్షణిక ఆనందం కోసం నిండు జీవితాలను బలి చేసుకుంటున్నారన్నారు. మైనర్ బాలికల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. అనంతరం హైకోర్టు ల్యాయర్ పూజారి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ నేటి సమాజంలో క్షణిక అవేశంలో తీసుకునే నిర్ణయాలతో జీవితాలు ఆగం అవుతున్నాయి. విద్యార్థులకు ఎలాంటి సపోర్ట్ కావాలి అన్నా కూడా ఈ సంజోష్ ఫౌండేషన్ ద్వారా చేపడుతామన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం శంకరాజుపల్లి గ్రామంలో పుట్టిన నేను విద్యార్థులను పూర్తి స్థాయిలో అభివద్ధి చేయడానికే సంజోష్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసినట్లు బేవర్స్ సినిమా హీరో సంజోష్ తెలిపారు. మా పౌండేషన్ ద్వారా గతంలో కంటి ఆపరేషన్లు చేపట్టామన్నారు. ఇప్పుడు సుమారు 118 మంది విద్యార్థులకు రూ 2వేల చొప్పున అందజేశామన్నారు. అనంతరం నత్యప్రదర్శన చేసిన అలువాల సుమనశ్రీ ని సినిమా హీరో సంజోష్ సన్మానించారు. అదేవిధంగా కరాటేలో జాతీయ స్థాయికి చేరిన వసంత విశాల్ ను సంజోష్ సన్మానించారు.

పేద విద్యార్థులకు నగదు పురస్కారం ఇవ్వాలని ఆలోచన వచ్చిన సంజోష్‌ను మనందరం ఆదర్శంగా తీసుకోవాలని సినిమా హీరో సంపూర్ణేష్‌బాబు అన్నారు. నగదు పంపిణీ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని పయణించాలని, గుడ్డిగా ముందుకు వెళితే లక్ష్యం చేరడం కష్టం అన్నారు. కష్టాన్ని ఎప్పుడు ఎదురుకునే విధంగా సిద్దంగా ఉండాలన్నారు. చిన్న చిన్న కష్టాలు, అవమానాలకు కుంగిపోవొద్దని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమం లో డీఈఓ సిద్దార్థరెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎంఈఓ మల్లయ్య, భవిత జిల్లా కోఆర్డినేటర్ సాంబయ్య, ఏఎంఓ శ్యామ్ సుందర్‌రెడ్డి, ఎంఈఓ మల్లయ్య, జెడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ సాంబశివరావు, కన్నాయిగూడెం ఎంఈఓ రాజేష్, కోడి వెంకట్, పెండ్యాల ప్రభాకర్, రామాలయం కమిటీ చైర్మన్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకున్న కలెక్టర్



ములుగు ప్రతినిధి, మే 18(జనంసాక్షి) : సోమవారం తాడ్వాయి మండలం మేడారం లోని శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లులను ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఢదే హేమంత్ సహదేవరావు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు గిరిజన సంస్కృతి సంప్రదాయాల డోలు వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో పూజారులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ వన దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## పోడు రైతులకు అండగా ఉంటాం

- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



చింతలమానెపల్లి మే 18 (జనం సాక్షి) : పోడు రైతులకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. సోమవారం రోజున ప్రెస్ మీట్ ఏర్పాటుచేసిన మాజీ శాసనసభ్యులు సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలం లోని దిందా ఖర్చువెల్లి గ్రామలల్లో అటవీ అధికారులు అరాచకాలు, రైతుల పంట భూముల్లో మంచెలు వేసుకొని ఉంటూ అటవీశాఖ సిబ్బంది, రైతులను అడ్డుకుంటున్నారని తెలుసుకొని రైతులకు అండగా ఉండి రైతుల పక్షాన పోరాడుతామని అన్నారు మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమే అభివృద్ధి చేసేది కూడా బి అర్ ఎస్ ప్రభుత్వమే. అని అన్నారు రైతులు, మహిళలు పోరాడుతున్నా కనికరించని కాంగ్రెస్ ప్రభుత్వం, పైగా కేసులు పెట్టి జైలుకు పంపుతామంటూ పోడు రైతులకు బెదిరిస్తున్నారు అని అన్నారు స్థానిక ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ఇలా ఎంత మందిని కలిసినా దొరకని న్యాయం అని వెలపోసుకుంటున్న రైతులు. మరో పది రోజుల్లో భూమి దున్నుకోకపోతే ఈ సంవత్సరం పస్తులు ఉండక తప్పదని రోదిస్తున్న మహిళలు. అక్కడి రైతులు పండించేదే ఒకే ఒక పంట, అది కూడా వర్షాధార పంట. వర్షాకాలం వచ్చినా ఇంకా భూములకు రానివ్వని అడవి శాఖ అధికారులు. అని తెలిపారు ఈ సమస్య ఇంతటితో అటవీ అధికారులు ఆపి రైతులకు న్యాయం చేకూర్చేలా చేస్తే బాగుంటుందని అన్నారు లేనియెడల రైతుల గురించి ఎంతవరకైనా పోరాడడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కోఆప్షన్ సభ్యులు నాజిం హుస్సేన్ బాబాసాగర్ మాజీ ఎంపిటిసి రాజన్న సర్పంచ్ దోస్తాంగుల సత్యక్క డొకె శ్రీనివాస్ డోకి రాజన్న నీల గౌడ్ చందు రైతులు పాల్గొన్నారు

## పుష్కరాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): సరస్వతి అంత్య పుష్కరాల విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో పుష్కర విధులు కేటాయించిన అధికారులు, సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఈ 12 రోజులు చాలా ప్రధానమని అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జిల్లాలో గత సంవత్సరం పెద్ద ఎత్తున సరస్వతి పుష్కరాలు జరుపుకున్నామని, ఆ విధంగానే అంత్య పుష్కరాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతిరోజు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అధికార యంత్రం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి అధికారికి కేటాయించిన విధులను బట్టి ఆయా ప్రాంతాల్లో ముందస్తుగా పర్యటించి ఏర్పాట్లు పరిశీలన చేయాలని ఆదేశించారు. గైర్హాజరైన అధికారులకు, సిబ్బందికి మెమోలు జారీ చేయాలని, తగు చర్యల నిమిత్తం ఆయా శాఖలకు సిఫారసు చేయనున్నట్లు ఆయన స్పష్టంచేశారు. 21వ తేదీ ఉదయం 5.30 గంటలకు పుష్కరాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రతి రోజు స్వామీజిలు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రోటో కాల్ పాటించాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాలు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. సమాచారం సమగ్రంగా అందించేందుకు కమాండ్ కంట్రోల్ రూము ఏర్పాటు చేయనున్నామని, అలాగే వాకి టాకీ ద్వారా దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రత్యేక వైద్యులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఆర్వో వసంత కుమారి, భూపాలపల్లి, కాటారం ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్ ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఖ్యాతిని నిలబెట్టారు

- డీఈఓకు జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకుల సన్మానం



నిర్మల్, మే 18 (జనంసాక్షి): ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నిర్మల్ జిల్లా మూడో స్థానం రావడం చాలా సంతోషమని నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు అన్నారు సోమవారం నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో విద్య పటిష్టానికి డీఈఓ ఎన్నో చర్యలు తీసుకుంటున్నారని విద్యాభివృద్ధికి క్షణం తీరక లేకుండా పనిచేసే గొప్ప వ్యక్తి భోజన్న అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా కోకన్వీనర్లు. కత్రోజు అశోక్ చారి. సిరికొండ రమేష్ జింక లక్ష్మీనారాయణ కార్యనిర్వహకఅధ్యక్షుడు మరకంటి జీవన్, అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ ,బీసీ సంక్షేమ సంఘం నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
19 మే 2026

# ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- బూర్గంపహాడ్ మాక్ డ్రిల్ నిర్వహణలో కలెక్టర్ అంకిత్



**బూర్గంపహాడ్, మే 18 (జనంసాక్షి) :** ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో ముందస్తు అప్రమత్తత, శాఖల మధ్య సమన్వయంతో ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించవచ్చని కలెక్టర్ అంకిత్ సూచించారు. సోమవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మాక్ డ్రిల్ కు ఆయన హాజరయ్యారు. తొలుత పునరావాస కేంద్రం, ఆపరేషన్ సెంటర్లు, వైద్య శిబిరాలను కలెక్టర్ పరిశీలించారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), తెలంగాణ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్ డి ఆర్ ఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాక్ డ్రిల్ పలువురిని ఆకట్టుకుంది. ఫైర్శాఖ అధికారి క్రాంతికుమార్ అధ్వర్యంలో నిర్వహించిన ఈ మాక్ లు 6వ బెటాలియన్ టీజీఎస్పీకి చెందిన శంకర్, సీఆర్పీఎఫ్ కమాండర్ రాజేష్ దోగ్రా అబ్జర్వర్లుగా వ్యవహరించారు. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలను లైఫ్ జాకెట్లు, బోట్లు సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అంబులెన్స్ల ద్వారా పునరావాస కేంద్రాలకు చేర్చడం, బాధితులకు తాగునీరు, భోజనం, వైద్యసేవలు, తాత్కాలిక నివాస సదుపాయాలు కల్పించడం వంటి చర్యలను డెమో రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా బూర్గంపహాడ్ ఎస్సీ కాలనీ నుంచి 10 మంది గర్భిణులు, 45 మంది చిన్నారులు, 26 పశువులను సురక్షితంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పునరావాస కేంద్రానికి తరలించారు. అక్కడే బాధితులకు తక్షణ వైద్యసేవలు, ఆశ్రయం, తాగునీరు, ఆహార సదుపాయాలు కల్పించారు. వివిధ శాఖల అధికారులు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల్లో చేపట్టాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫైర్, రెవెన్యూ, ఇరిగేషన్, వైద్య, పశు సంవర్ధకశాఖల సిబ్బంది సమన్వయంతో సేవలు అందించడమే కాకుండా గజ ఈతగాళ్ల సహాయంతో చేపట్టే రెస్క్యూ విధానాలను ప్రాక్టికల్గా ప్రదర్శించారు. ఈ అవగాహన సదస్సులో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ విపత్తుల సమయంలో గోల్డెన్ అవర్లో తీసుకునే చర్యలు ప్రాణరక్షణకు కీలకమని, శాఖల మధ్య సమన్వయంతో తక్షణ సహాయం అందించాల్సిన అవసరం ఉందన్నారు. మాక్ డ్రిల్ ద్వారా జిల్లా యంత్రాంగం అత్యవసర పరిస్థితుల్లో క్రమశిక్షణ, సమన్వయంతో పనిచేసే సామర్థ్యాన్ని ప్రదర్శించిందని, భవిష్యత్‌లో సంభవించే ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా ఎదుర్కొనడానికి ఇలాంటి మాక్ డ్రిల్‌లు ఎంతో ఉపయోగపడతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీఎంహెచ్ ఒ తుకారాం రాథోడ్, జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు, ఏడీఏ తాతారావు, బూర్గంపహాడ్ తహశీల్దార్ కేఆర్ కె ప్రసాద్, ఎంపీడీవో జమలారెడ్డి, సీహెచ్సీ, పీహెచ్సీ వైద్యులు ముక్కంటేశ్వరరావు, నగేష్ లతో పాటు మండలంలోని సర్పంచ్లు, వివిధ శాఖల అధికారులు, ఎన్డీఆర్ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**సూర్యాపేట ప్రతినిధి, మే 18 (జనంసాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని పేర్కొన్నారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలకి సంబందించి 28 దరఖాస్తులు, డిఆర్డిఏ 14, డిడబ్ల్యూఓ 3, హౌసింగ్ 2, మిగిలిన 21 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 68 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరి సింగ్, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, జడ్పీ సీఈఓ శిరీష, డిఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ డీఏఓ శ్రీధర్ రెడ్డి, డిసిఓ ప్రవీణ్ కుమార్, డిఈఓ అశోక్ , జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వడ్లు కొనుగోలు చేయాలని రైతుల ధర్నా



**మర్రిగూడ, మే 18 (జనం సాక్షి) :** వడ్ల కొనుగోలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ మర్రిగూడ మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో శనివారం ఉదయం రైతులు మెరుపు ధర్నాకు దిగారు. సుమారు రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ధర్నాలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ, "రబీలో పండించిన వడ్లు నెలల తరబడి కల్లాల్లోనే ఉన్నాయి. వర్షాలు పడితే ధాన్యం మొత్తం తడిసిపోతుంది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని చెప్తున్నా క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు జరగడం లేదు. ఏదో ఒక సాకుతో కపట నాటకం ఆడుతోంది. తేమ పేరుతో, తాలు పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారు" అని తీవ్ర విమర్శలు చేశారు. ధర్నా చేస్తున్న రైతులకు పలు రాజకీయ పార్టీల స్థానిక నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా, రైతులకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ధర్నా కారణంగా చౌరస్తాలో కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. సమాచారం అందుకున్న మర్రిగూడ పోలీస్ లు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. విషయం తెలుసుకున్న మర్రిగూడ ఎమ్మార్వో జక్కర్తి శ్రీనివాస్ వెంటనే అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలను విన్న ఎమ్మార్వో, "వడ్ల కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేస్తాం. రెండు రోజుల్లో అన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం. ధాన్యం నష్టపోకుండా చూస్తాం" అని హామీ ఇచ్చారు. ఎమ్మార్వో హామీతో రైతులు శాంతించి ధర్నా విరమించారు.

## వరదలపై మాక్ ఎక్సర్‌సైజ్



**కామారెడ్డి ప్రతినిధి, మే 18 (జనంసాక్షి) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వరదలపై మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహణ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విపత్తు నిర్వహణ – 2026 కార్యక్రమంలో వరదలపై మాక్ ఎక్సర్‌సైజ్‌ను కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కౌండిల్య కాలనీలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొని వివిధ డెమోలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వరదల సమయంలో ఎదురయ్యే అత్యవసర పరిస్థితులను ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందస్తు ప్రణాళిక, శాఖల మధ్య సమన్వయం, స్పందన వ్యవస్థలు, సహాయక చర్యలను సమీక్షించి మరింత మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వేగంగా సహాయక చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. మాక్ డ్రిల్ ద్వారా విపత్తు నిర్వహణలో లోపాలను గుర్తించి స్పందన వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు. జిల్లాలోని 7 మండలాల్లో ఈ మాక్ డ్రిల్ నిర్వహించినట్లు తెలిపారు. కామారెడ్డి మండలంలోని కౌండిల్య కాలనీ, బిక్నూర్ మండలంలోని రామేశ్వరపల్లి, రాజంపేట మండలంలోని గుండారం, బీబీపేట్ మండలంలోని పెద్ద చెరువు, మద్నూర్ మండలంలోని బొగ్గగుడిసె, ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి, నాగిరెడ్డిపేట్ మండలంలోని మేజర్‌వాడ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. వరదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయక చర్యలు, పునరావాస ఏర్పాట్లు, శాఖల సమన్వయం తదితర అంశాలపై అధికారులు ప్రత్యక్ష సాధన నిర్వహించారు. వరదల్లో కొట్టుకుపోయిన బాధితులకు అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ద్వారా ఎలా ప్రాథమిక చికిత్స అందించాలో, అలాగే వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా ఎలా రక్షించాలో డెమో ద్వారా అవగాహన కల్పించారు. సహాయక బృందాలు ప్రాణాపాయ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రెస్క్యూ పరికరాల వినియోగం, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. అనంతరం మాక్ డ్రిల్‌లో పాల్గొన్న సిబ్బంది, సంబంధిత అధికారులకు వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి కామారెడ్డి, బీబీపేట్ పర్యవేక్షకులుగా లేబర్ శాఖ అధికారి శశికుమార్, పోలీస్ బెటాలియన్ శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ఎసీఎల్ బీ ఇన్‌చార్జ్ ఎన్వీ గిరి, డీఎఫ్ వో సుధాకర్, డీసీఎంహచ్ వో విజయభాస్కర్, పీడీ మెప్మా శ్రీధర్, పబ్లిక్ హెల్త్ డీఈ సంతోష్, యువత, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జూమ్ మీటింగ్ ద్వారా హైదరాబాద్‌లోని విపత్తు నిర్వహణ అధికారులు మానిటరింగ్ చేశారు.

## 108 వాహనంలో ప్రసవం



**చండూరు, మే 18 (జనంసాక్షి) :** చండూరు మండలం పరిధిలోని ధోనిపాముల గ్రామానికి చెందిన గాదే రాధా కి పురిటి నొప్పులు రావడంతో ఉదయం 04:42:30 సమయంలో గర్భిణి కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. సమాచారము అందుకున్న 108 సిబ్బంది (ఈఎంటి) పి. మహేష్ కుమార్ (పైలెట్) బి. రామకృష్ణ 108 వాహనంలో ధోనిపాముల గ్రామానికి చేరుకొని గర్భిణీని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గం మధ్యలో పురిటి నొప్పులు అధికంగా రావడంతో నల్లగొండ సమీపంలో సుమారు ఉదయం 6 గంటల సమయంలో నిండు గర్భిణి పండంటి మగ బిడ్డకి జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నప్పటికీ నల్గొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు. గర్భిణీకి నార్మల్ డెలివరీ చేసిన 108 సిబ్బంది అయినటువంటి ఈఎంటి పి. మహేష్ కుమార్ పైలెట్ బి. రామకృష్ణను గర్భిణి కుటుంబ సభ్యులు అభినందించారు.

## మాక్ డ్రిల్, ఎవాక్యుయేషన్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



**ఖమ్మం కార్పొరేషన్, మే 18 (జనం సాక్షి) :** వరదల సమయంలో అధికారుల సూచనలు ప్రజలు తప్పనిసరిగా పాటించి సహకరించాలని, విపత్తుల నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు జిల్లా యంత్రాంగాన్ని మాన్సూన్ సీజన్‌కు పూర్తి స్థాయిలో సిద్ధం చేసేందుకు చేపట్టిన ఫ్లడ్ మాక్ ఎక్సర్సైజ్ కార్యక్రమం విజయ వంతంగా నిర్వహించామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. జిల్లాలోని మున్నేరు పరివాహక ప్రాంతంలో జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్.డి.ఎం.ఏ) మార్గదర్శకాలు, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించిన వరద ప్రమాదాల మాక్ ఎక్సర్సైజ్ ను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వరదల వంటి విపత్తుల సమయంలో అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ప్రాణనష్టం నివారించవచ్చని అన్నారు. సాధారణంగా ప్రజలు నీరు కళ్లకు కనిపించే వరకు ఇళ్లను ఖాళీ చేయరని, ఈ ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు అధికారికంగా ఎవాక్యుయేషన్ సూచనలు ఇచ్చినప్పుడు ప్రజలు తప్పనిసరిగా సహకరించాలని సూచించారు. వర్షాకాలంలో సంభవించే అత్యవసర పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుండి సమాచారం అందిన వెంటనే వివిధ శాఖలు ఏ విధంగా స్పందించాలి, ప్రజలను ఎలా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి, రెస్క్యూ బృందాలు ఎలా పనిచేయాలి, రిలీఫ్ క్యాంపులను ఎలా నిర్వహించాలి వంటి అంశాలపై స్టెప్ బై స్టెప్ విధానంలో మాక్ ఎక్సర్సైజ్ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, టిఎస్టిడి, అగ్నిమాపక, పశుసంవర్ధక శాఖ, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో విపత్తు సమయంలో చేపట్టాల్సిన చర్యలపై సాధన నిర్వహించి నట్లు తెలిపారు. ఈ మాక్ డ్రిల్ ద్వారా వ్యవస్థలో ఉన్న లోపాలను గుర్తించి, భవిష్యత్తులో మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోవచ్చన్నారు.

## హత్య కేసులో సంచలన తీర్పు

### 10 మందికి జీవిత ఖైదు



**బోయిన్‌పల్లి, మే 18 (జనం సాక్షి) :** బోయినపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఒక హత్య కేసులో పది మంది నిందితులకు యావజ్జీవ కారాగార (జీవిత ఖైదు) శిక్షతో పాటు, ఒక్కొక్కరికి 6,500 రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీరజ సోమవారం కీలక తీర్పు వెల్లడించారు. ఈ వివరాలను జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే మీడియాకు తెలిపారు.బోయినపల్లి మండలం స్థంబంపల్లి గ్రామానికి చెందిన తునికి లక్ష్మీనారాయణ చిన్న కుమారుడు మహేష్, అదే గ్రామానికి చెందిన బొంగానీ పరశురాములు కుమార్తె ప్రేమించుకున్నారు. ఈ విషయం నచ్చని అమ్మాయి కుటుంబ సభ్యులు, బంధువులు 10 మందికలిసి అబ్బాయి ఇంటిపైకి గొడవకు వెళ్లారు. కట్టెలు, రాడ్లతో దాడి చేయడంతో మహేష్ తండ్రి తునికి లక్ష్మీనారాయణ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృతుడి భార్య తునికి విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి బోయినపల్లి ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించారు.అప్పటి వేములవాడ రూరల్ సీఐ నవీన్ కుమార్ కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు.అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో, వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుళ్లు సురేష్ కుమార్, రాజేంద్ర ప్రసాద్, కోర్టు మానిటరింగ్ కానిస్టేబుల్ నవీన్ 20 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ బలమైన వాదనలు వినిపించారు. శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో పది మంది నిందితులకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుంచి తప్పించుకోలేరు. శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యం. పోలీసులు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో పనిచేసి నిందితులకు శిక్ష పడేలా చూస్తారు.

ఈ కేసులో ప్రతిభ కనబరిచిన అదనపు ఎస్పీ చంద్రయ్య, పీపీ పెంట శ్రీనివాస్, సీఐలు నవీన్ కుమార్, శ్రీనివాస్, ఎస్ఐలు రవీందర్ నాయుడు, రమాకాంత్, కానిస్టేబుళ్లు నవీన్, సురేష్, రాజేంద్ర ప్రసాద్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## ఇందూరుకు సీఎం పంగనామాలు

- రేవంత్ హామీలపై ఎంపీ ధర్మపురి అర్వింద్ ఫైర్




**నిజామాబాద్ బ్యూరో, మే 18 (జనంసాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందూరుకు పంగనామాలు పెడుతున్నారు. ఔటర్ రింగ్ రోడ్ హామీని నెరవేర్చకుండా మొండిచేయి చూపుతున్నారు" అని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఔటర్ రింగ్ రోడ్ హామీని సీఎం రేవంత్ రెడ్డి మరిచిపోయారని ఆరోపించారు. "మరి మహేష్ ఏం చేస్తున్నారు? కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, సలహాదారులు ఏం చేస్తున్నార"ని నిలదీశారు. మహేష్‌ను రాజకీయంగా సమాధి చేయాలని రేవంత్ చూస్తున్నట్లుందని వ్యాఖ్యానించారు.

### యూజీడీ పనుల్లో జాప్యం..

నిజామాబాద్‌లో రూ.163 కోట్లతో చేపట్టిన 90.3 కిలోమీటర్ల యూజీడీ నిర్మాణ పనుల్లో 25 శాతం పనులు కూడా పూర్తి కాలేదని అర్వింద్ వివరించారు. ఇప్పటివరకు కేవలం రూ.10.4 కోట్లు మాత్రమే విడుదల చేశారని తెలిపారు. "ఇదీ రేవంత్‌కు ఇందూరు మీద ఉన్న ప్రేమ" అని ఎద్దేవా చేశారు.

### 2029లో బీజేపీదే అధికారం...

కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లాంటి జెన్యూన్ లీడర్‌ను సీఎం చేయాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. రేవంత్ నాయకత్వంలో 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ అధ్వాన్నంగా ఓడిపోతుందని జోస్యం చెప్పారు. "2029లో బీజేపీదే అధికారం. రాబోయే రోజుల్లో హైటెన్షన్ రాజకీయాలు చూస్తారు" అని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. ఇష్టం వచ్చినట్లు వాగ్దానాలు చేస్తూ ప్రజలకు మొండిచేయి చూపుతున్నారని మండిపడ్డారు.


## రెడ్ క్రాస్ సొసైటీ పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**కామారెడ్డి ప్రతినిధి, మే 18 (జనంసాక్షి) :** కలెక్టరేట్‌లోని సమావేశం మందిరం లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మే 15 నుండి జూన్ 15 వరకు నిర్వహించనున్న ప్రత్యేక రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తప్పనిసరిగా సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. అలాగే జిల్లా ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని సభ్యత్వం పొందాలని కోరారు. జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కార్యాలయంలో ప్రత్యేక రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా రుసుము చెల్లించి కలెక్టరేట్‌లో సభ్యత్వ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, సభ్యత్వ నమోదు ద్వారా సేవా కార్యక్రమాలకు తోడ్పడాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెడ్ క్రాస్ డ్రైవ్ వైస్ చైర్మన్ ఎన్.వై. గిరి, కార్యక్రమ నోడల్ అధికారి డా. శశికుమార్, రెడ్ క్రాస్ కామారెడ్డి జిల్లా చైర్మన్ ఎం. రాజన్న, జిల్లా రెడ్ క్రాస్ కరస్పాండెంట్ డా. పి.వి. నరసింహం తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలో భారీ భూ కుంభకోణం

- రియల్ ఎస్టేట్ సంస్థలకు దారదత్తంగా ప్రభుత్వ భూములు
- ఇద్దరు కలెక్టర్ల చేతి వాటం
- 458 ఎకరాలు దార దత్తం
- రూ. 6 లక్షల కోట్ల అవినీతి
- హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ సంచలన ఆరోపణలు



**హయత్‌నగర్, మే 18 (జనం సాక్షి) :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న భారీ భూ కుంభకోణం పై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీస్ ఉన్నతాధికారులు, నిఘా, దర్యాప్తు సంస్థలు విచారణ జరిపించాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ కోరారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ప్రభుత్వ పెద్దల సహకారంతో ఇద్దరు కలెక్టర్లు చక్రం తిప్పి ఆరు లక్షల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. సోమవారం తన కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వివరాలు వెల్లడించారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్ పల్లి శివారు లోని సర్వే నెంబర్లు 627, 629, 1011, 1012, 1013,1023, 1031, 1032 లోని 458 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉండేదని వివరించారు. 2022, 2023 సంవత్సరాలలో జిల్లా కలెక్టర్లుగా వ్యవహరించిన అమోయ్ కుమార్, ఎస్ హరీష్ లు ఆ భూములను జి ఓ సి ఎల్ కార్పొరేషన్ లిమిటెడ్, హిందూజా ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్, స్వేర్ స్పేస్ ఇన్ఫ్రాసిటీ ప్రైవేట్ లిమిటెడ్, హానర్ హోమ్స్ అనే సంస్థలకు ఒక ఎకరం కేవలం 1000 రూపాయలకు చొప్పున ధారాదత్తం చేశారని తెలిపారు. కలెక్టర్లు నేరుగా ఆయా సంస్థలకు రిజిస్ట్రేషన్ చేయించారని, రిజిస్ట్రేషన్ సమయంలో స్టాంప్స్ చార్జెస్ కూడా మినహాయించారని ఆయన వివరించారు. ప్రభుత్వ భూమిని ప్రైవేట్ సంస్థలకు కలెక్టర్ స్థాయి అధికారులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని ఆయన ఆరోపించారు. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం ఆ భూముల విలువ ఆరు లక్షల కోట్ల రూపాయలు ఉంటుందని ఆయన అన్నారు. ఇంతటి భారీ భూకంభకోణంపై ప్రస్తుత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలని ఆయన కోరారు. ఆర్టిఐ సహాయంతో తాము సేకరించిన వివరాలతో న్యాయపోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.




## పొదుపు పాటించాల్సిందే..

### ఎస్‌బీఐ, ఎల్ఐసీకి ఆర్థిక శాఖ సూచన




**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా సంస్థలు, ఇతర ఆర్థిక సంస్థలు పొదుపు చర్యలు పాటించాలని కేంద్ర ప్రభుత్వం సూచించింది. విదేశీ పర్యటనలు తగ్గించుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలంటూ ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆర్థిక సేవల విభాగం సర్క్యులర్ జారీ చేసింది. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ వంటి సంస్థల అధిపతులకు లేఖ రాసింది.ప్రభుత్వరంగ సంస్థల ఛైర్మన్‌లు, ఎండీలు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు నిర్దేశిత పరిమితి కంటే తక్కువ విదేశీ ప్రయాణాలు చేయాలని ఆర్థికసేవల విభాగం సూచించింది. సమావేశాలు, సమీక్షలు, సంప్రదింపులను వీలైనంత వరకు వర్చువల్‌గానే నిర్వహించుకోవాలని తెలిపింది. అవసరమైతే తప్ప విదేశీ ప్రయాణాలు చేయొద్దని పేర్కొంది. ప్రస్తుతం వినియోగిస్తున్న పెట్రోల్, డీజిల్ అద్దె వాహనాలకు బదులు విద్యుత్ వాహనాలు వినియోగించాలని సూచించింది. విదేశీ మారక నిల్వలు అడుగంటకుండా ఇటీవల ప్రధాని మోదీ పొదుపు చర్యలకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగించాలని, ఆన్‌లైన్ సమావేశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించిన నేపథ్యంలో ఆర్థిక సేవల విభాగం ఈ సర్క్యులర్‌ని జారీ చేసింది.

## నెలలోనే 100 కోట్ల ఇమేజ్‌లు!

### చాట్‌జీపీటీని తెగ వాడేస్తున్నారు..




**న్యూఢిల్లీ:**ఓపెన్‌ఏఐకి చెందిన ఇమేజ్ జనరేషన్ టూల్ చాట్‌జీపీటీ ఇమేజెస్ 2.0ను భారతీయులు తెగ వాడేస్తున్నారు. ఈ సరికొత్త ఇమేజ్ జనరేషన్ టూల్ సాయంతో ఇప్పటివరకు 100 కోట్లకు పైగా చిత్రాలను సృష్టించారని ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు.గత కొన్ని రోజులుగా సామాజిక మాధ్యమాల్లో ఏఐ ద్వారా క్రియేట్ చేసిన చిత్రాల హవా నడుస్తోంది. యానిమేటెడ్ స్టైల్ పోర్ట్రెయిట్‌లు, లింక్డ్ఇన్ ప్రొఫైల్ ఫోటోలు, ఫాంటసీ ఎడిట్స్, స్టైలిష్ అవతార్‌లను క్రియేట్ చేయడానికి ఏఐ టూల్స్‌ను వినియోగిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. అలా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఓపెన్‌ఏఐ విడుదల చేసిన చాట్‌జీపీటీ ఇమేజెస్ 2.0 భారతీయుల మెప్పు పొందింది. పాత వెర్షన్‌తో పోలిస్తే మరింత స్పష్టమైన ఎడిటింగ్, రిచ్ లేఅవుట్స్, వివిధ భాషల్లో వాడే వీలుండడం, టెక్స్ట్‌ను చక్కగా రాయగల సామర్థ్యాన్ని కలిగి ఉండడంతో చాట్‌జీపీటీ ఇమేజెస్ 2.0 యూజర్లను ఆకట్టుకుంటోంది. దీంతో ఈ టూల్‌ను భారీ స్థాయిలో ఉపయోగిస్తున్నారు.

# ఐటీ స్టాక్స్ అండ..

### భారీ నష్టాల నుంచి కోలుకున్న సూచీలు



ముంబయి: అంతర్జాతీయంగా పెరిగిన చమురు ధరలు, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ మొదలు కావొచ్చన్న భయాలు, రూపాయి విలువ పతనం వంటి కారణాలతో ఈ ఉదయం భారీ నష్టాలు చవిచూసిన సూచీలు.. తర్వాత కోలుకున్నాయి. ఐటీ స్టాక్స్ అండతో నష్టాలను అధిగమించాయి. సెన్సెక్స్ స్వల్ప లాభాల్లో ముగియగా.. నిఫ్టీ ఫ్లాట్‌గా స్థిరపడింది.సెన్సెక్స్ ఉదయం 74,807.97 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 75,237.99) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో దాదాపు వెయ్యికి పైగా పాయింట్ల నష్టంతో 74,180.26 వద్ద కనిష్ఠాన్ని తాకింది. ఆపై క్రమంగా కోలుకున్న సూచీ.. చివరికి 77.05 పాయింట్ల లాభంతో 75,315.04 వద్ద ముగిసింది. నిఫ్టీ 6.45 పాయింట్ల లాభంతో 23,649.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.33గా ఉంది.సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్, సన్‌ఫార్మా షేర్లు లాభపడ్డాయి. టాటా స్టీల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, ఎస్‌బీఐ, మారుతీ సుజుకీ కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 111 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4541 డాలర్ల వద్ద కొనసాగుతోంది.
అంతకుముందు దేశీయ మార్కెట్లు సోమవారం భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల చుట్టూ ఉన్న అనిశ్చితులు, ముడి చమురు ఆందోళనలు మన స్టాక్ మార్కెట్‌ను వదలడం లేదు. దాంతో నేటి ట్రేడింగ్‌లో సూచీలు నష్టాల్లో కదలాడుతున్నాయి. సెన్సెక్స్ ఒక దశలో 1000 పాయింట్లకు పైగా పడిపోయింది.ఉదయం 9.29 గంటల సమయంలో సెన్సెక్స్ 825 పాయింట్లు క్షీణించి, 74,387 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 265 పాయింట్లు పతనమై 23,378 వద్ద ఉంది. నిఫ్టీ సూచీలో ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, విప్రో, భారతీ ఎయిర్‌టెల్, టీసీఎస్ షేర్లు లాభాల్లో ఉండగా.. పవర్ గ్రిడ్ కార్పొరేషన్, టాటా స్టీల్, మారుతీ సుజుకీ, శ్రీరామ్ ఫైనాన్స్, ఐషర్ మోటార్స్ స్టాక్స్ నష్టాల్లో ఉన్నాయి.అమెరికా డాలర్‌తో పోలిస్తే మన రూపాయి రికార్డు స్థాయిలో బలహీనపడింది. ప్రస్తుతం మారకం విలువ 96.20గా ఉంది. ముడిచమురు ధరల భారం, పెరిగిన వాణిజ్యలోటు, విదేశీ మదుపర్ల అమ్మకాలు, ద్రవ్యోల్బణం మన కరెన్సీ ప్రభావం చూపిస్తున్నాయి. హర్మూజ్ అంశంలో వెంటనే ఒప్పందానికి రాకపోతే.. ఇరాన్‌పై సైనిక చర్య చేపట్టాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యోచిస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి. ఈ వార్తలతో ఫ్యూచర్స్‌లో బ్రెంట్ క్రూడ్ ధర ఒక బ్యారెల్‌కు 111 డాలర్లకు పెరిగింది.
హర్మూజ్ అంతరాయాల వేళ.. రష్యా చమురు దిగుమతులపై అమెరికా ఇచ్చిన ఆంక్షల మినహాయింపు ఈ రోజుతో ముగియనుంది. రష్యా చమురుపై దిగుమతులపై ఆధారపడిన భారత్‌కు ఇది తీవ్రంగా ఇబ్బందిపెట్టే అంశం. ఇప్పటికే దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతున్నాయి. ఈ మినహాయింపుల గడువు పూర్తి కావడంతో ఆ ధరలు మరింత పెరగొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాల కారణంగా మన సూచీలు నేటి సెషన్‌లో నష్టాల్లో ఉన్నాయి. చమురు ధరలు పెరుగుతుండటంతో ద్రవ్యోల్బణ భయాలు నెలకొన్నాయి. దాంతో శుక్రవారం అమెరికా మార్కెట్లు నష్టాల్లో ముగియగా.. ఆసియా మార్కెట్లలోనూ అదే పరిస్థితి నెలకొంది.

### ప్రారంభ స్థాయి ఉద్యోగుల స్థానంలో ఏఐ

### అంతర్జాతీయంగా సగం మంది సీఈఓల ధోరణి ఇది

### ఆలివర్ వైమాన్- న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీ నివేదిక

కంపెనీల్లో సాధారణ కార్యకలాపాలను కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత టూల్స్ పూర్తి చేస్తుండటంతో, ప్రారంభ స్థాయి ఉద్యోగ నియామకాలు తగ్గిపోతున్నాయి. కంపెనీల నియామకాల విధానంలో భారీ మార్పులకు ఇది కారణమవుతోంది. ఆలివర్ వైమాన్ ఫోరమ్, న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజీ నిర్వహించిన అంతర్జాతీయ సర్వే ప్రకారం.. 'తాజా ఉత్తీర్ణులను తీసుకోవడం తగ్గించి, అనుభవజ్ఞులైన ఉద్యోగుల నియామకాలపై దృష్టి పెట్టాలని' ప్రపంచవ్యాప్తంగా దాదాపు సగం మంది సీఈఓలు యోచిస్తున్నారు. పలు రంగాల పరిశ్రమలు, ప్రాంతాలకు చెందిన 415 మంది చీఫ్ ఎగ్జిక్యూటివ్‌ల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా, 2026 సీఈఓ సర్వే నివేదికను రూపొందించారు. దీని ప్రకారం 43% మంది సీఈఓలు రాబోయే రెండేళ్లలో జూనియర్ స్థాయి కొలువులను తగ్గించాలని భావిస్తున్నారు. 2025లో ఇలా భావించిన వారి సంఖ్య 17 శాతంగా ఉంది. 33% మంది సీఈఓలు మధ్య స్థాయి ఉద్యోగాల భర్తీపై ఎక్కువ దృష్టి పెడుతుండగా, 10% మంది సీనియర్ ఉద్యోగుల నియామకానికి మొగ్గుచూపుతున్నారు. ఫ్రెషర్లు, జూనియర్ ఉద్యోగులకు ఇచ్చే రొటీన్ పనులను, కంపెనీలు ఏఐ టూల్స్ సాయంతో నిర్వహించగలుగుతున్నాయి. కోడింగ్ రాయడం, డాక్యుమెంట్లను విశ్లేషించడం నుంచి కస్టమర్ సపోర్ట్, నివేదికను రూపొందించడం వంటి పనుల కోసం ఇప్పుడు ఏఐను ఎక్కువగా వినియోగిస్తున్నారు.నిర్ణయాలు తీసుకోవడం, వ్యూహాత్మక ఆలోచనలు, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవడంలో ఏఐ ఇంకా సఫలం కావడం లేదు. ఈ పనులకు అనువజ్ఞులైన ఉద్యోగుల అవసరం ఉందని ఎగ్జిక్యూటివ్‌లు భావిస్తున్నారు. ప్రాక్టికల్ అనుభవాన్ని, విమర్శనాత్మక ఆలోచనను ఏఐ టూల్స్‌తో భర్తీ చేయడం కష్టమని కంపెనీలు గుర్తిస్తున్నాయి.
రాబోయే 1-2 ఏళ్లలో ఉద్యోగుల సంఖ్య స్థిరంగా లేదా మార్పులేకుండా ఉంటుందని 45% మంది సీఈఓలు అంచనా వేస్తున్నారు. 25% మంది మాత్రం సిబ్బందిని 5% కంటే ఎక్కువ తగ్గించాలని అనుకుంటున్నారు. మొత్తంగా చూస్తే 75% మంది సీఈఓలు.. నియామకాలను నిలిపివేయడం లేదా సిబ్బందిని తగ్గించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు.

**ఏఐ నైపుణ్యాలుంటే..**

ఏఐ ద్వారా మంచి ప్రతిఫలాలను పొందుతున్న కొన్ని కంపెనీలు మాత్రం, ఆయా నైపుణ్యాలు కలిగిన యువ ప్రతిభపై నమ్మకం ఉంచుతున్నాయి. ఇటువంటి కంపెనీల్లో

## స్మార్ట్‌ఫోన్ ధరలు పెంచేసిన రియల్‌మీ

**న్యూఢిల్లీ:**చైనాకు చెందిన మొబైల్ తయారీ సంస్థ రియల్‌మీ తన 16 సిరీస్ స్మార్ట్‌ఫోన్ ధరలను పెంచేసింది.మిడ్ రేంజ్ సెగ్మెంట్‌లోని అన్ని వేరియంట్ల ధరలను రూ.1000 నుంచి రూ.3000 వరకు సవరించింది. పెరిగిన ధరలు నేటినుంచే అమల్లోకి రానున్నాయి. మెమొరీ, చిప్, స్మార్ట్‌ఫోన్ తయారీ ధరలు పెరగడమే ఇందుకు కారణంగా కంపెనీ పేర్కొంది. దీనికి సంబంధించిన ధరల పట్టికను టిప్‌స్టర్ అభిషేక్ యాదవ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రియల్‌మీ 16 ప్రో 5జీ స్మార్ట్‌ఫోన్ ధరలను రూ.వెయ్యి పెంచింది. అదేవిధంగా రియల్‌మీ 16 ఖతీనీ+ 5జీ స్మార్ట్‌ఫోన్‌ల ధరలు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు పెరిగాయి. రియల్‌మీ 16 5జీ స్మార్ట్‌ఫోన్ ధరలను కూడా రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు సవరించింది. చైనాకు చెందిన మొబైల్ తయారీ కంపెనీ వన్‌ప్లస్ మరోసారి ధరలను పెంచేసింది. వన్‌ప్లస్ 15స్మార్ట్‌ఫోన్ ధరలను రూ.4,500కు సవరించింది.వన్‌ప్లస్ 15ఖీ స్మార్ట్‌ఫోన్ ధరలను రూ.4,500కు సవరించింది గత రెండు నెలల్లో ఈ స్మార్ట్‌ఫోన్ ధరలను పెంచడం ఇది రెండోసారి. పెరిగిన ధరలతో బేస్ వేరియంట్ 12ఉః+256ఉః ధర రూ.50,499 నుంచి రూ.54,999కు చేరింది. అదేవిధంగా టాప్ వేరియంట్ ధర రూ.54,499 నుంచి రూ.59,999కు పెరిగింది. సవరించిన ధరలు నేటినుంచే అమల్లోకి రానున్నాయి. వన్‌ప్లస్ 15 స్మార్ట్‌ఫోన్ విడుదల సమయంలో ప్రారంభ ధర రూ.47,999 ఉండగా, సవరించిన ధరలతో ఇప్పటివరకు రూ.7వేలు పెరగడం గమనార్హం.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,48,800 (22 క్యారెట్లు) | ₹ 1,62,330 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 3,15,000

# సంపన్న దేశంలో కాసుల కటకట

### ఆర్థికంగా రారాజు ఖతార్‌కు ఎందుకీ పరిస్థితి..?

ఖతార్.. పర్షియన్ గల్ఫ్‌లో ఎడారితో నిండిన ఓ ద్వీపకల్పం. ప్రపంచంలోనే అత్యంత సుసంపన్న దేశాల్లో ఒకటి. అలాంటి దేశానికి ఇప్పుడు ఆర్థిక కష్టాలు ఎదురవుతున్నాయి. ఇరాన్ యుద్ధం వల్ల ఆదాయానికి భారీగా గండి పడటం, ద్రవ్యోల్బణ సమస్యలతో ఖతార్ సతమతమవుతోంది. ఇటీవల కాలంలో ఎన్నడూ చూడనివిధంగా ఆర్థిక వ్యవస్థ క్షీణించడం ఈ దేశానికి సవాల్‌గా మారింది.



**న్యూఢిల్లీ:**ఒకప్పుడు వెనకబడిన ప్రాంతంగా ఉన్న ఖతార్.. ఆర్థిక పురోగతికి సహజ గ్యాస్ వెన్నుదన్నుగా నిలిచింది. 1990ల్లో ఈ దేశంలో ఆర్థికంగా గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఈశాన్య ఖతార్‌లో ఉన్న నార్త్‌ఫీల్డ్.. ప్రపంచంలోనే అతిపెద్ద సహజ గ్యాస్ రిజర్వాయర్. ఇక్కడి సూపర్‌కూలింగ్ గ్యాస్ ఇంధనాన్ని ద్రవరూపంలోకి మారుస్తుంది. దీన్ని గుర్తించిన ఈ దేశం.. లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) ఉత్పత్తిని ప్రారంభించి దాన్ని ప్రపంచదేశాలకు ఎగుమతి చేయడం మొదలుపెట్టింది. 1996లో తొలిసారి 60వేల టన్నుల ఎల్ఎన్‌జీని జపాన్‌కు ఎగుమతి చేసింది. 2010 నాటికి ఖతార్ ఉత్పత్తి సామర్థ్యం 7 కోట్ల టన్నులకు పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలకు ఖతార్ నుంచి ఎల్ఎన్‌జీ సరఫరా అవుతోంది. ఈ దేశ ఆదాయంలో 60శాతం గ్యాస్, గ్యాస్ సంబంధిత ఎగుమతుల నుంచే సమకూరుతోంది. ఫిబ్రవరి చివర్లో పశ్చిమాసియాలో మొదలైన ఉద్రిక్తతల వల్ల ప్రపంచానికి ఖతార్ తలుపులు మూతపడినట్లయ్యింది. సాధారణంగా ఈ దేశం తమ ఎగుమతులు/ దిగుమతులకు అత్యధికంగా హర్మూజ్ జలమార్గం మీదే ఆధారపడుతుంది. అలాంటి కీలక జలసంధిని యుద్ధం కారణంగా ఇరాన్ మూసివేయడంతో ఖతార్‌కు ప్రపంచంతో సంబంధాలు తెగినట్లయ్యింది. హర్మూజ్‌ను మూసివేసిన 24 గంటల్లోనే తమ కాంట్రాక్టులను పూర్తిచేయలేమని ఈ దేశ అతిపెద్ద ఇంధన సంస్థ ఖతార్ ఎనర్జీ చేతులెత్తేసింది. ఇక, ఉద్రిక్తతలు మొదలైన రెండు వారాల తర్వాత ఖతార్ ప్రధాన గ్యాస్ ప్లాంట్ రాస్ లఫాన్‌పై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడి చేయడంతో పెద్ద దెబ్బ పడింది. ఈ దాడుల వల్ల రాస్ లఫాన్ ఉత్పత్తి కేంద్రం తీవ్రంగా దెబ్బతింది. దీన్ని పునరుద్ధరించేందుకు కొన్నేళ్ల సమయం పడుతుందని అంచనా. దీనివల్ల ఈ దేశానికి వందల కోట్ల డాలర్ల నష్టం వాటిల్లింది.

**ఆహారానికీ దిగుమతులే..**

ఖతార్ వాసుల రోజువారీ ఆహారానికి దిగుమతులే ఆధారం. హర్మూజ్ జలసంధి మూసివేతతో ఈ దిగుమతులు ఆగిపోయాయి. దీంతో వాయుమార్గంలో ఆహార పదార్థాలను దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల ఖర్చు తడిసిమోపెడవుతోంది. ఫలితంగా ద్రవ్యోల్బణ భయాలు మొదలయ్యాయి. ఇక, యుద్ధం నేపథ్యంలో అమెరికా సహా పలు దేశాలు గల్ఫ్‌కు ప్రయాణ అడ్వైజరీలు జారీ చేశాయి. దీంతో ఖతార్‌కు పర్యాటకుల తాకిడి తగ్గింది. పలు చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలు టూరిస్టులు లేక వెలవెలబోతున్నాయి. చిరు వ్యాపారాలు, హోటళ్ల ఆదాయం దెబ్బతింది. ఈ పరిణామాల వల్ల ఈ ఏడాది ఖతార్ ఆర్థికవ్యవస్థ 8.6 శాతం క్షీణించే అవకాశం ఉందని అంతర్జాతీయ ద్రవ్యనిధి అంచనా వేసింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఖతార్ రిజర్వ్ నిధులు కరిగిపోయే ప్రమాదముందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# దేశీయ తయారీ ఐఏఎఫ్ సీ-295 సిద్ధం

### టాటా-ఎయిర్‌బస్ సంయుక్త తయారీ



సీ-295 విమానం వద్ద అధికారుల బృందం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత రక్షణ రంగ తయారీలో మరో కీలక ముందడుగు పడింది. దేశీయంగా అసెంబుల్ చేసిన సైనిక రవాణా వాహనం ఎయిర్‌బస్ సీ-295 విమానం ప్రస్తుతం పరీక్షలకు సిద్ధమైంది. గుజరాత్ వడోదరాలోని టాటా- ఎయిర్‌బస్ ప్లాంట్‌లో ఈ విమానాన్ని రూపొందిం చారు. 'భారత్‌లో తయారీ' కార్యక్రమంలో ఈ ప్రాజెక్టు కీలకం. తద్వారా సీ-295 ప్లాట్‌ఫామ్‌కు ప్రపంచంలో అతిపెద్ద వినియోగదారుగా భారత్ అవతరించింది. భారత వాయు దళం (ఐఏఎఫ్) డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఎయిర్ మార్షల్ అవధేష్ కుమార్ భారతి ఇటీవల వడోదరా ప్లాంట్‌లోని ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను సందర్శించి, అక్కడ రూపొందిన సీ-295 విమానం పురోగతిని సమీక్షించారు. ఈ విమానంపై క్షుణ్నంగా పరీక్షలు నిర్వహించనున్నారు .టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్), ఎయిర్‌బస్ మధ్య కుదిరిన ఇండియా- స్పెయిన్ సీ-295 కార్యక్రమంలో భాగంగా, 2024 అక్టోబరు 28న వడోదరా ప్లాంట్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్‌తో కలిసి ప్రారంభించారు. 56 సీ-295 విమానాల కోసం స్పెయిన్‌తో రూ.21,935 కోట్ల ఒప్పందాన్ని మనదేశం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం.. 16 విమానాలను నేరుగా ఎగిరే స్థితిలో మనదేశానికి ఎయిర్‌బస్ సరఫరా చేస్తుంది. మిగిలిన 40 విమానాలను మనదేశంలోనే అసెంబ్లింగ్ చేస్తున్నారు. ప్రతి సీ-295 విమానంలో భారత్ ఎలక్ట్రానిక్స్, భారత డైనమిక్స్ అభివృద్ధి చేసిన దేశీయ ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సూట్ అమర్చుతున్నారు. ఐఏఎఫ్ దగ్గర ఉన్న ఆవ్రో-748 విమానాలను, ఎయిర్‌బస్ సీ-295 విమానాలు భర్తీ చేయనున్నాయి. సైనికుల తరలింపు, సరకుల రవాణా, వైద్య అవసరాలు, ప్రత్యేక ఆపరేషన్‌ల కోసం ఈ విమానాలను వినియోగిస్తారు. ఈ విమానం గరిష్ఠంగా 70 మంది సైనికులను, 48 మంది పారాట్రూపర్లు, 28 మెడికల్ స్ట్రెచర్‌లను తీసుకెళ్లగలదు. రెండు ప్రాట్ అండ్ విట్నీ పీడబ్ల్యూ 127జీ టర్బోప్రాప్ ఇంజిన్లతో ఈ విమానం నడుస్తుంది. తక్కువ దూరం నుంచి టేకాఫ్, ల్యాండింగ్ అయ్యే సామర్థ్యం దీనికి ఉంది. దీంతో సుదూర, పర్వత ప్రాంతాలతో సహా కఠిన ప్రాంతాల్లో, చిన్న రన్‌వేల నుంచి వీటిని నిర్వహించొచ్చు. అంతరిక్షం ద్వారా ఇంటెలిజెన్స్ కార్యకలాపాలు నిర్వహించేందుకు అనువైన చిన్న శాటిలైట్లను, రక్షణ రంగం కోసం మనదేశంలో తయారు చేయను న్నారు. ఇలాంటి శాటిలైట్ల తయారీలో అంతర్జాతీయంగా ప్రాచుర్యం కలిగిన ఈసీఈవైఈ సంస్థ సీఈఓ రఫాల్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతానికి అవసరమైన శాటిలైట్లను భారత్‌లో రూపొందిస్తామని పేర్కొన్నారు. ఈ తయారీ కార్యకలాపాలను ఏడాది వ్యవధిలోనే చేపడతామని పేర్కొన్నారు. శాటిలైట్లతో పాటు భూమిమీద ఏర్పాటు చేయాల్సిన వ్యవస్థలనూ అందిసామన్నారు. ఏడాదికి 10 శాటిలైట్లతో ప్రారంభించి, క్రమంగా 20-40కి చేర్చాలన్నది లక్ష్యంగా పేర్కొన్నారు. అంతర్జాతీయంగా తాము ఏడాదికి 50 శాటిలైట్లు తయారు చేస్తున్నట్లు తెలిపారు. పోలాండ్, స్పెయిన్, యూకే, ఆస్ట్రేలియా, జపాన్, యూఏఈ, గ్రీస్, అమెరికాల్లో కలిపి 1,000 మందికి పైగా నిపుణులున్నారని వివరించారు.

## నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో మరో అరెస్టు





కులకర్ణి సహా ఇతర నిందితులతో కలిసి మనీషా గురునాథ్ కుట్ర పన్నారని, పరీక్షలో వచ్చే ప్రశ్నలను భారీగా డబ్బు ఇవ్వగలిగే విద్యార్థులకు అందించినట్లు తెలుస్తోంది ఈ లీకేజీ కుట్రలో వాఘ్మారే పాత్ర కీలకమని దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ప్రశ్నపత్రం తయారీలో మనీషా గురునాథ్ ప్రమేయం ఉందని తెలుసుకొని, ఆమెతో కలిసి ఓ పథకం పన్నిందని పేర్కొన్నాయి. తమ ప్లాన్‌లోకి కులకర్ణిని చేర్చుకున్నారు. పేపర్ కొనేందుకు సరైన విద్యార్థుల కోసం బ్యూటీషియన్ వెతికింది. ఇందులోభాగంగా ఆమె కొందరు విద్యార్థులను గుర్తించి వారితో రూ.10 లక్షలకు డీల్ కుదుర్చుకున్నట్లు సమాచారం. అలాగే తన ప్లాన్‌ను స్నేహితుడు ధనంజయ్ లోఖండేతోనూ పంచుకుందని సీబీఐ వర్గాలు వెల్లడించాయి.ఈక్రమంలో ధనంజయ్ నాసిక్‌లో కౌన్సెలింగ్ బిజినెస్ నడుపుతోన్న శుభమ్ ఖైర్నార్‌ను సంప్రదించాడు. ఈ వ్యవహారంలో తొలుత శుభమ్ అరెస్టయ్యాడు. పరీక్ష రద్దయిన కొన్ని గంటల్లోనే అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. వాఘ్మారే నుంచి నీట్ పేపర్లు ధనంజయ్‌కు, అక్కడినుంచి శుభమ్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. గురుగ్రామ్, జైపుర్‌లోని ఏజెంట్లకు అతడు పీడీఎఫ్‌లు పంపాడని ప్రాథమికంగా వెలుగులోకి వచ్చింది.

**మరో అరెస్టు..**

నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో మరో అరెస్టు చోటుచేసుకుంది మహారాష్ట్రలోని లాతూర్‌లో రేణుకై కెమిస్ట్రీ క్లాసెస్ ఫౌండర్ శివరాజ్ రఘునాథ్‌ను సీబీఐ అధికారులు అరెస్టు చేశారు. ప్రశ్నపత్రం లీకేజీ, దానిని ఇతరులకు చేరవేసిన గ్యాంగ్‌లో శివరాజ్ సభ్యుడని దర్యాప్తులో భాగంగా గుర్తించారు. ఈ క్రమంలో జరిపిన సోదాల్లో భాగంగా అతడి ఫోన్‌లో లీక్ అయిన ప్రశ్నపత్రం కనిపించినట్లు తెలుస్తోంది. దాంతో అతడిని అరెస్టు చేశారు.

## పాక్ ప్రధానిగా ఇమ్రాన్ తొలగింపు వెనుక అమెరికా హస్తం

**ఇస్లామాబాద్:**పాక్ ప్రధాని పదవి నుంచి ఇమ్రాన్ ఖాన్‌ను తొలగించడం వెనుక అమెరికా హస్తం ఉందని వెల్లడించే రహస్య దౌత్య సమాచారం తాజాగా లీక్ అయ్యింది. దీనికి సంబంధించిన అసలు పత్రాన్ని ఇన్వెస్టిగేటివ్ పత్రిక డ్రాప్ సైట్ ప్రచురించింది. ఇందులో వెల్లడించిన వివరాల ప్రకారం.. 2022, ఏప్రిల్‌లో ఇమ్రాన్‌ఖాన్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. అంతకుముందు అమెరికాలోని పాకిస్థాన్ రాయబారి అసద్ మజీద్ ఖాన్‌తో అమెరికా హోంశాఖలోని దక్షిణ- మధ్య ఆసియా వ్యవహారాల సహాయ కార్యదర్శి డోనాల్డ్ లూ సమావేశమయ్యారు. అందులో వారు ఇమ్రాన్‌ను పదవి నుంచి తొలగించి జైల్లో పెట్టాలని.. అప్పుడే అమెరికా-పాక్ బంధం మరింత బలపడుతుందని చర్చించుకొన్నట్లు తెలుస్తోంది. అనంతరం ఇమ్రాన్ ఖాన్ ప్రధాని పదవి నుంచి వైదొలగడంతో షెహబాజ్ షరీఫ్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం విషయంలో ఇమ్రాన్‌ఖాన్ తటస్థ వైఖరి కారణంగానే ఆయన్ను ప్రధాని పదవి నుంచి తప్పించాలని అమెరికా నిర్ణయించినట్లు పాకిస్థాన్‌లో లీకైన దౌత్య సమాచారం వెల్లడించింది. పాక్ రాయబారి, అమెరికా ప్రభుత్వాధికారుల మధ్య భేటీకి ముందు.. ఇమ్రాన్ ఖాన్ పాకిస్థాన్‌లో భారీ ర్యాలీ చేపట్టారు. తనను పదవి నుంచి తొలగించడానికి స్థానిక పార్టీలు, అధికారులతో కలిసి అమెరికా కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కాగా ఆయన వ్యాఖ్యలను పాక్ ప్రభుత్వం, అమెరికా ఖండించాయి. అనంతరం తోషాఖానా కేసులో ఆయనకు జైలు శిక్ష పడింది. నాటినుంచి ఇమ్రాన్ జైల్లోనే ఉన్నారు.





# శ్రీనిధి రుణాల్లో రూ.34 లక్షల గోల్‌మాల్?

### శ్రీనిధి లోన్ స్కాంపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు

- 34 లక్షలు మింగేసిన ఆర్పీలు, సంఘ నాయకులు?
- మహిళా సంఘాల సభ్యుల డబ్బులు దుర్వినియోగమయ్యాయంటూ ప్రజావాణిలో ఫిర్యాదు
- నాలుగేళ్లుగా అధికారులకు వినతులిచ్చినా.. స్పందన కరువు
- సంఘ నేతల సంతకాలు ఫోర్జరీ చేసి ఖాతాల నుంచి నిధుల మళ్లింపు
- విజిలెన్స్ విచారణ చేపట్టి న్యాయం చేయాలంటూ బాధితుల డిమాండ్



**జగిత్యాల జిల్లా, మే 18 (జనంసాక్షి):** జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో రాయికల్ పట్టణానికి చెందిన మహిళా సంఘాల సభ్యులు తమకు జరిగిన అన్యాయంపై నేరుగా ఫిర్యాదు చేశారు. శ్రీనిధి రుణాల పేరుతో సుమారు రూ.34 లక్షలు తీసుకొని తిరిగి చెల్లించకుండా, సంఘ సభ్యులనే అప్పుల బారిన పడేసిన ఘటనపై గత నాలుగేళ్లుగా సంబంధిత అధికారులకు, పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మీడియా ముందుకు వచ్చిన బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయికల్ పట్టణంలోని వినాయక, స్వయంకృషి సమైక్య పరిధిలోని సుమారు 30 మహిళా సంఘాల్లో 27 సంఘాలకు శ్రీనిధి రుణాలు మంజూరయ్యాయి. వీటిలో 28 స్వయం సహాయక సంఘాల సభ్యులు చెల్లించిన రూ.14,81,990తో పాటు మరో 10 సంఘాల పేరుతో తీసుకున్న రూ.9,39,000 రుణాలను సంఘ నేతల సంతకాలను ఫోర్జరీ చేసి, సభ్యుల ఖాతాల నుంచి స్వయంకృషి సమైక్య ఖాతాకు బదిలీ చేసి, అక్కడి నుంచి వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించినట్లు ఆరోపించారు.

మాజీ ఆర్పీ మేకల మహేష్, ప్రస్తుత ఆర్పీలు చెంగలి లావణ్య, గుండేటి వరలక్ష్మి కలిసి ఈ అవకతవకలకు పాల్పడ్డారని బాధితులు పేర్కొన్నారు. సంఘ సభ్యులు క్రమం తప్పకుండా చెల్లించిన రుణాల మొత్తాన్ని శ్రీనిధికి జమ చేయకుండా, తమ స్వంత అవసరాలకు వినియోగించుకున్నారని తెలిపారు. ఈ విషయాన్ని టీఎంసీ శ్రీరామ్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా, 15 రోజుల్లో పూర్తి రికవరీ చేయిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని వాపోయారు.

ఇదిలా ఉండగా, రాయికల్ మున్సిపాలిటీలోని స్వయంకృషి సమైక్య శ్రీనిధి రికవరీపై జరిగిన అంతర్గత విచారణలో కూడా అవకతవకలు వెలుగు చూసినట్లు సమాచారం. 2022 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు సంఘ సభ్యుల నుంచి వసూలు చేసిన రూ.19.89 లక్షలను శ్రీనిధి ఖాతాకు బదిలీ చేయకుండా, సంబంధిత వ్యక్తులు తమ అవసరాలకు వినియోగించుకున్నట్లు విచారణలో అంగీకరించినట్లు తెలిసింది. దీనిపై శ్రీనిధి అసిస్టెంట్ మేనేజర్ ద్వారా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌కు నివేదిక అందించినట్లు బాధితులు తెలిపారు. ఇప్పటికే సంబంధిత రుణాలపై సభ్యులకు నోటీసులు రావడంతో వితంతు మహిళలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి. "మేము చేయని తప్పుకు శిక్ష అనుభవించాల్సి వస్తోంది. చిన్నపిల్లలతో జీవనం సాగిస్తున్నాం. మాకు న్యాయం చేయాలి" అంటూ మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం తక్షణమే స్పందించి, విజిలెన్స్ లేదా ఇంటెలిజెన్స్ ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత మహిళలు ప్రజావాణి వేదికగా విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఈ ఘటన రాయికల్ పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# మార్కెట్ యార్డు అభివృద్ధికి పూర్తి సహకారం

- ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేస్తాం
- గన్ని బ్యాగుల సమస్య పరిష్కరిస్తాం : మేయర్ శ్రీనివాస్
- రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చర్యలు : మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న



కరీంనగర్ బ్యూరో, మే 18 (జనంసాక్షి) :

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ మార్కెట్ యార్డులో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం భారీ స్థాయిలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొనగా, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. మార్కెట్ యార్డులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జెసిబిలు, పారిశుద్ధ్య సిబ్బంది సహాయంతో తొలగించే ప్రక్రియను ప్రారంభించారు. యార్డులో పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, లైటింగ్ సదుపాయాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... మార్కెట్ యార్డు అభివృద్ధికి నగరపాలక సంస్థ తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేస్తామని పేర్కొన్నారు. గన్ని బ్యాగుల సమస్యను మార్కెట్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రైతుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని, మార్కెట్ యార్డును శుభ్రంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. నగర పాలక సంస్థ తరపున మార్కెట్ కమిటీకి నిరంతరం ఉంటామన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న మాట్లాడుతూ... రైతుల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకంగా శానిటేషన్ డ్రైవ్ చేపట్టామని తెలిపారు. మేయర్ సహకారంతో యార్డులో లైటింగ్ సదుపాయం కల్పించడంతో పాటు పరిశుభ్రత కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.


# రైతులకు ఇబ్బంది కలిగించొద్దు.. ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

### వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివా

**బొంరాస్ పేట, మే 18 (జనం సాక్షి):** కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేయాలని అధికారులను వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు.సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, పలువురు అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.వడ్లు కొనుగోలు చేయడంలో రైతుల పడుతున్న ఇబ్బందులు తన దృష్టికి రావడం జరిగిందని, రైతులకు ఎలాంటి సమస్యలు రావద్దని ఆదేశించారు.కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి రైతుకు త్రాగునీరు,నీడ ఏర్పాటు చేయాలన్నారు.కొనుగోలు కేంద్రంలో ధాన్యం 42 కేజీలు తూకం వేస్తున్నారని కలెక్టర్ దృష్టికి రైతుల తీసుకెళ్లారు. హామలి ఇప్పటివరకు క్వింటాలుకు రూ.35 ఇచ్చేవారమని, హమాలీలు అదనంగా 40 వరకు డిమాండ్ చేస్తున్నారని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి హమాలీ రుసుములు అదనంగా తీసుకోవద్దని కలెక్టర్ హమాలీలకు సూచించారు. రైతులు వరి ధాన్యాన్ని ఆరబెట్టుకొని తేమ శాతం ఉండేలా చూసుకోవాలన్నారు.ఎప్పటికప్పుడు కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీలలో రైస్ మిల్లులకు తరలించాలని, కొనుగోలు కేంద్రంలో వర్షాలను దృష్టిలో ఉంచుకొని టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉన్నతాధికారులు కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి తగిన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

# చెరువును తోడేస్తున్నారు.. నల్లమట్టి మాఫియా దోపిడీ

- అనుమతులు లేకుండా టిప్పర్లతో అక్రమ తరలింపు
- ఇటుక బట్టీలకు లక్షల రూపాయల మట్టి దోపిడీ
- రైతులు, స్థానికులు ఆగ్రహం.. చర్యలు తీసుకోవాలని డిమాండ్
- తహసీల్దార్‌కు వివరణ.. చట్టపరమైన చర్యలు



**రుద్రంగి, మే 18 (జనంసాక్షి):** రుద్రంగి మండలం మానాల గ్రామంలోని కొత్త చెరువులో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా నల్లమట్టిని అక్రమంగా తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నారు. గత రెండు మూడు రోజులుగా సుమారు 30 టిప్పర్లు, 50 ట్రాక్టర్లతో మట్టి మాఫియా దోపిడీకి పాల్పడుతోందని స్థానికులు ఆరోపించారు. చెరువు నల్లమట్టిని జగిత్యాల జిల్లా కేంద్రం, కోరుట్ల పట్టణంలోని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. అధిక లోడుతో టిప్పర్లు అతి వేగంగా వెళ్తుండటంతో రహదారులపై మట్టి పడిపోయి వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువు మట్టిని గ్రామ శివారులో డంప్ చేసి, ఆ తర్వాత ఇటుక బట్టీలకు తరలిస్తున్నట్లు సమాచారం.

ప్రభుత్వ నిబంధనలు, అనుమతులు ఏమీ లేకుండా జరుగుతున్న ఈ అక్రమ రవాణాపై స్థానికులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. వ్యవసాయ భూముల సారవంతానికి ఉపయోగపడే నల్లమట్టిని ధనార్జన కోసం ఇటుక బట్టీలకు తరలించడం అన్యాయమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయల ప్రభుత్వ ఆదాయం కోల్పోతున్నట్లు వారు ఆరోపించారు.

ఈ విషయమై రెవెన్యూ తహసీల్దార్ పుష్పలతను వివరణ కోరగా, చెరువు నల్లమట్టి తరలింపుకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. సమాచారం తమ దృష్టికి వచ్చిందని, అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి మాఫియా ఆగడాలకు చెక్ పెట్టాలని, అక్రమంగా తరలించిన మట్టిని చేయాలని స్థానికులు, రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# తెలంగాణలోనూ ఐఐపీ పార్టీ ఆవిర్భావం

### జాతీయ అధ్యక్షులు ఐపీ గుప్తా, ముదిరాజ్, కోలి, తెనుగు కులాలను ఏకతాటిపైకి




**ముషీరాబాద్, మే 18 (జనంసాక్షి):** మొదటిసారిగా తెలంగాణ రాష్ట్రంలో ఇండియన్ ఇంక్లూజివ్ పార్టీ (ఐఐపీ) ఆవిర్భవించనుంది. ఐఐపీ జాతీయ అధ్యక్షులు ఐపీ గుప్తా సోమవారం హైదరాబాద్‌కు విచ్చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ డీకే మాహుర్ పాన్ కోలీ, ఐఐపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మర్రి ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ హనుమంతరావు, జనరల్ సెక్రటరీ రాఘవులు, ముదిరాజ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు చింతల నీలకంఠం ముదిరాజ్, బోయిని శ్రీనివాస్ ముదిరాజ్, మాడవేని శ్రీనివాస్ ముదిరాజ్, నరసింహారావు ముదిరాజ్ తదితరులు ఐపీ గుప్తాకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. ఐపీ గుప్తా మాట్లాడుతూ, తెలంగాణలో ఐఐపీ పార్టీని బలోపేతం చేసి ముదిరాజ్, కోలి, తెనుగు వంటి కులాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి 'వన్ నేషన్ వన్ రిజర్వేషన్' సాధించేందుకు పోరాటం చేస్తామన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఐఐపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మర్రి ప్రభాకర్‌తో కలిసి పార్టీని అధికారికంగా ప్రకటించనున్నట్లు ప్రకటించారు. ముదిరాజ్, కోలి, తెనుగు సమాజాల వారందరూ పార్టీలో చేరి బలపరచాలని ఐపీ గుప్తా పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ముదిరాజ్ సమాజ సమస్యలు, రిజర్వేషన్లు, సామాజిక అభివృద్ధి అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

# నడిగడ్డ ప్రజలకు కర్నూలులో వైద్య సేవలు కల్పించాలి

### ఎంపీ మల్లు రవికి ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ సేవలు కోరుతూ సీనియర్ సిటిజన్స్ ఫోరం వినతిపత్రం

### జోగులాంబ గద్వాల జిల్లా సమస్య పరిష్కారం కోసం డిమాండ్



**గద్వాల నడిగడ్డ, మే 18 (జనంసాక్షి):** నడిగడ్డ ప్రాంత వాసులకు ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు కార్పొరేట్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ సౌకర్యాలు కల్పించాలని జోగులాంబ గద్వాల జిల్లా సీనియర్ సిటిజన్ ఫోరం వెల్ఫేర్ అధ్యక్షుడు కరణం మోహన్ రావు ఎంపీ మల్లు రవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ రావు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా డిజిటల్ హెల్త్ కార్డులు ప్రారంభించినప్పటికీ, నడిగడ్డ ప్రాంత ప్రజలు ఆరోగ్య సేవల కోసం హైదరాబాద్‌కు 300 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలులోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, మెడికేర్, టీమ్స్, అపోలో వంటి సౌకర్యాలను నడిగడ్డ, కొల్లాపూర్ మండలాల ప్రజలు వినియోగించుకునేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

గతంలో కూడా ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ఆయన గుర్తు చేశారు. డాక్టర్ మల్లు రవి, వైస్ చైర్మన్ ప్లానింగ్ కమిషన్, రాష్ట్ర గొర్రెలు-మేకల అభివృద్ధి సహకార సమైఖ్య చైర్‌పర్సన్ సరిత, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి తదితరులకు కూడా వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. నడిగడ్డ ప్రజల చిరకాల వాంఛను పరిగణనలోకి తీసుకొని త్వరగా సానుకూల ఆదేశాలు ఇవ్వాలని మోహన్ రావు కోరారు.

# రైతులకు సరిపడ గన్ని బ్యాగులు అందించి వడ్లు కొనుగోలు చేయాలి

### తుంకిమెట్లలో వరి రైతుల సమస్యలు తెలుసుకున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**బొంరాస్ పేట, మే 18 (జనం సాక్షి):** మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డితో కలిసి మండల పరిధిలోని తుంకిమెట్ల గ్రామంలో వడ్ల కుప్పలును పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.గత కొన్ని రోజులుగా గన్ని బ్యాగుల కొరత లారీల కొరత కారణంగా ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సరైన సమయంలో వడ్లు కొనుగోలు చేయక సరిపడా గన్ని బ్యాగులు సరఫరా చేయక రైతులు ఇబ్బందులు పడుతున్నారని రైతుల బాధలు ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు.వెంటనే రైతులకు సరిపడా గన్ని బ్యాగులు అందించి వడ్లు కొనుగోలు చేయాలని రెండు రోజుల్లో రైతు అకౌంట్లో డబ్బులు జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరి దయనీయంగా మారిందన్నారు. ఆమె వెంట మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు యాదగిరి,మహేందర్ రెడ్డి, నారాయణరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి,మల్లేష్ గౌడ్, మహేందర్, సోమనాథ్, నెహ్రూ నాయక్ పాల్గొన్నారు.





# తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వినూత్న వేదికలు

### హైదరాబాద్‌లో మెట్రో ఎక్స్‌టీరియర్ ర్యాప్ క్యాంపెయిన్


**హైదరాబాద్, మే 18 (జనంసాక్షి):** తెలంగాణ గ్రామీణ బ్యాంక్ (టిజిబి) కస్టమర్ ఔట్రీచ్‌ను బలోపేతం చేయడానికి, బ్రాండ్ విజిబిలిటీని పెంచడానికి, పట్టణ కస్టమర్లలో బ్యాంక్ ఉత్పత్తులు, సేవల గురించి అవగాహన కల్పించడానికి హైదరాబాద్‌లోని ఎల్‌బి నగర్ మెట్రో స్టేషన్‌లో తన మెట్రో ఎక్స్‌టీరియర్ ర్యాప్ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ (ఆర్ఆర్‌బి) ప్రకాష్ చంద్ర బరోర్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ కె. ప్రతాప రెడ్డి, బ్యాంక్ సీనియర్ అధికారులు, మీడియా ప్రతినిధుల సమక్షంలో మెట్రో ర్యాప్ క్యాంపెయిన్‌ను లాంఛనంగా ప్రారంభించారు. హైదరాబాద్ మెట్రో అత్యంత రద్దీ మార్గాలలో ఒకటైన మియాపూర్ నుండి ఎల్.బి. నగర్ వరకు ఉన్న సి-1 రెడ్ లైన్ కారిడార్‌లో మెట్రో ఎక్స్‌టీరియర్ ర్యాప్ ప్రారంభించబడింది. ఈ కారిడార్ 25 రైళ్లు, 27 స్టేషన్లు, 29 కిలోమీటర్ల దూరం, సుమారు 50 నిమిషాల ప్రయాణ సమయం మరియు రోజుకు ఒక్కో రైలుకు 18 ట్రిప్పులను కలిగి ఉంది, ఇది నగరం అంతటా టీజీబీ ఉత్పత్తులు, సేవల విస్తృతమైన దృశ్యమానతను మరియు ప్రచారాన్ని సాధ్యం చేస్తుంది. ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ (ఆర్ఆర్బి) ప్రకాష్ చంద్ర బరోర్ మాట్లాడుతూ, వినూత్నమైన ప్రచార కార్యక్రమాలను అవలంబించడంలో, మెట్రో బ్రాండింగ్ ద్వారా కస్టమర్ కనెక్ట్‌ను బలోపేతం చేయడంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించారు. కె. ప్రతాప రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వినూత్న వేదికల ద్వారా తన కస్టమర్ ఔట్రీచ్‌ను విస్తరించడానికి, సమాజంలోని అన్ని వర్గాలకు బ్యాంకింగ్ సేవల అందుబాటును మెరుగుపరచడానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. 'ఒక రాష్ట్రం ఒక ఆర్ఆర్బి' చొరవ కింద, 01 జనవరి 2025 నుండి అమలులోకి వచ్చేలా ఏపీజీవీబీ, తెలంగాణ ప్రాంత శాఖలను తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం చేయడం జరిగిందని, దీనితో తెలంగాణ వ్యాప్తంగా వినియోగదారులకు సేవలు అందించడానికి టీజీబీ మరింత బలోపేతంగా మరియు మెరుగ్గా సన్నద్ధమైందని చైర్మన్ ఇంకా నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ జనరల్ మేనేజర్లు, సీనియర్ అధికారులు, బ్యాంక్ సిబ్బంది, భాగస్వాములు, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరయ్యారు. వినియోగదారుల సేవ, ఆర్థిక సమ్మిళితం, వినూత్న కార్యక్రమాల ద్వారా తమ పరిధిని విస్తరించడం పట్ల బ్యాంక్ నిబద్ధతను సీనియర్ అధికారులు ఈ సందర్భంగా నొక్కి చెప్పారు.

# మిస్టేక్ స్టేనో ఉద్యోగిది.. సీఈని బద్నామ్ చేస్తే ఎలా?

### ఆర్‌అండ్‌బీలో ఇంజినీర్లు, అధికారులు విస్మయం

### హైకోర్టు భవన నిర్మాణంలో సీనియర్ ఇంజినీర్‌ను తప్పుడు సమాచారంతో ఇరికించిన వైనం

### రివైజ్డ్ నోటు జారీ చేసిన శాఖ




**హైదరాబాద్, మే 18 (జనంసాక్షి):** తెలంగాణ ఆర్‌అండ్ బీ డిపార్ట్‌మెంటులో స్టేనో తప్పిదం ఒక సీనియర్ ఇంజినీర్‌ను బద్నామ్ చేసే స్థాయికి వెళ్లడం ఆ శాఖలో తీవ్ర విస్మయం సృష్టించింది. రాష్ట్ర హైకోర్టు భవన నిర్మాణం అంశంపై ఒక పత్రిక తప్పుడు సమాచారంతో కథనానికి స్పందనగా రిజాయిండర్ ఆఫీసు నుంచి వచ్చిన నోట్‌లో చిన్న తప్పు దొర్లడంతో సీఈ రాజేశ్వర్ రెడ్డిని తప్పుడుగా ఇరికించిన ఘటన వివాదాస్పదమైంది. ఈ నోట్ మీడియాకు చేరడంతో ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లు, అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు భవన నిర్మాణంలో తలమునకలై పని చేస్తున్న సీనియర్ ఇంజినీర్‌ను బద్నామ్ చేయడం ఏమాత్రం సరికాదని వారు అభిప్రాయపడుతున్నారు. సదరు అధికారులు తమ తప్పును గమనించి వెంటనే రివైజ్డ్ నోటు జారీ చేసినా, ఇప్పటికే జరిగిన దుష్ప్రచారం మాత్రం మిగిలిపోయింది.

ఆర్‌అండ్‌బీ శాఖలోని ఇంజినీర్లు, అధికారులు ఈ ఘటనపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. "ఒక స్టేనో తప్పిదానికి సీనియర్ ఇంజినీర్‌ను బద్నామ్ చేయడం సరికాదు. ప్రతిష్టాత్మక హైకోర్టు భవన నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న అధికారిని ఇలా అనవసరంగా ఇరికించడం బాధాకరం" అని వారు అంటున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించి, తప్పుడు సమాచారం ప్రచురించిన మీడియాకు కూడా సరైన స్పష్టీకరణ ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల్లో నిమగ్నమై ఉన్న సీనియర్ అధికారులను అనవసరంగా బద్నామ్ చేయడం సరికాదన్న అభిప్రాయం శాఖలో వ్యాప్తమవుతోంది.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలి

- అధికారులకు సీఎంసీ కమిషనర్ సృజన ఆదేశం
- పజావాణి కార్యక్రమాన్ని యజ్ఞంలా నిర్వహిస్తున్నామన్న కమిషనర్
- సోమవారం మొత్తం 63 వినతులు స్వీకరణ



**శేరిలింగంపల్లి, మే 18 (జనంసాక్షి):** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో అందుతున్న ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం లేకుండా, ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్, సీనియర్ ఐఏఎస్ అధికారిణి సృజన సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ విభాగాలకు వచ్చిన ఫిర్యాదులపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ప్రస్తుతం ఒక యజ్ఞంలా కొనసాగుతోందని, జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రతి సర్కిల్, జోనల్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

సీఎంసీ పరిధిలోని అన్ని సర్కిళ్లలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు కీలక అధికారులు ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తున్నారని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం 63 వినతులు అందాయని, ప్రతి అర్జీని స్వయంగా పరిశీలించి, ప్రాధాన్యత మేరకు తక్షణ చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు. అందిన ఫిర్యాదుల్లో పట్టణ ప్రణాళిక విభాగానికి చెందినవి అత్యధికంగా 42 ఉండగా, ఇంజనీరింగ్ విభాగానికి 10, పారిశుధ్య విభాగానికి 3, విద్యుత్ విభాగానికి 2, అర్బన్ బయోడైవర్సిటీ విభాగానికి 2, ఎంటమాలజీ విభాగానికి 1, ఎఫ్ అండ్ ఏ విభాగానికి 1, ప్రాజెక్ట్స్ విభాగానికి 1, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి 1 ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదులు స్వీకరించడం మాత్రమే అధికారుల బాధ్యత కాదని, క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన చేసి సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజావాణి లో ఫిర్యాదు చేసిన ప్రజలు తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా పారదర్శకమైన యంత్రాంగంతో సమస్యల పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉండగా, మియాపూర్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 6 ఫిర్యాదు లు అందాయి. ఇందులో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించినవి 2, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించినవి 4 ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

**IN THE COURT OF THE MACT CUM XIV ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD, TELANGANA**

**M.V.O.P.No :2403 OF 2025**

Between :
Kasani Sravanthi & Others …………Petitioners
AND
Nagaraju Battula & Others …. ……Respondents

To,
1. Nandyala Veera Reddy, S/o; Govinda Reddy Age; Major, Occ; Tipper Lorry Owner R/O; Madina padu, Dchepally, Palnadu,Guntur Dist - 522412 ……R1 Whereas the above named Petitioners have filed the above O.P against you and another for compensation under the M.V.Act. Please take notice that the above O.P. stands posted to 25 -05-2026 for your appearance, you are required to appear before Hon'ble Court at 10:30 am on the above date either in person or through an adocate, failing which the matter will be decided exparte.

**//BY ORDER OF THE COURT//**
C.SATISH KUMAR REDDY
ADVOCATE
H.No : 3-125/36/1, Shanthi Nagar Colony Uppal, Hyderabad - 39

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
19 మే 2026

# కరీంనగర్ జిల్లాలో 50% ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- రూ.237 కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- వారంలో రికార్డు స్థాయిలో 80 వేల టన్నుల సాధన
- వచ్చే వారం లక్ష టన్నుల లక్ష్యం : మంత్రి పొన్నం ప్రభాకర్
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వం




**కరీంనగర్ బ్యూరో, మే 18 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఇప్పటికే 50 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, రైతుల ఖాతాల్లో రూ.237 కోట్లు జమ చేశామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్‌తో కలిసి అధికారులు, రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, జిల్లాలో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతోందని తెలిపారు. ఈ సీజన్‌లో 3.61 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కేంద్రాలకు వచ్చినట్లు అంచనా వేశామని, ఇప్పటికే ఒక లక్ష 58 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి రైతులకు రూ.237 కోట్లు చెల్లించామని వివరించారు. గత వారంలోనే రికార్డు స్థాయిలో 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రానున్న వారంలో లక్ష మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని మంత్రి పేర్కొన్నారు. మొక్కజొన్న కొనుగోళ్లలోనూ అప్రమత్తంగా ఉంటూ సజావుగా సాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

హమాలీల సమస్యను పరిష్కరించడానికి లోకల్ హమాలీలను ప్రోత్సహించాలని, ధాన్యం రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియలు సజావుగా సాగేలా ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్‌లు సహకరించాలని మంత్రి సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానివ్వమని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 50 శాతం కొనుగోళ్ల లక్ష్యాన్ని సాధించి రాష్ట్ర స్థాయిలో ముందున్నామని, వారంలోనే 80 వేల టన్నులు కొనుగోలు చేసి మరో వారంలో లక్ష టన్నుల లక్ష్యం సాధించడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యంలో 78 శాతం ఆన్‌లైన్ నమోదు, 88 శాతం మిల్లర్లు స్వీకరించినట్లు వివరించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓలు, పౌరసరఫరాల సంస్థ డీఎం, రైస్ మిల్లర్లు, ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సన్నద్ధతను చాటిన మాక్ ఎక్సర్‌సైజ్

- వరదలు, విపత్తులకు సమాయత్తం జిల్లా యంత్రాంగం
- డ్రోన్లు, వాటర్ బోట్లు, అత్యాధునిక సాంకేతికత వినియోగం
- జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ అభినందన
- ప్రజా ప్రాణాలు కాపాడేలా సహాయక చర్యలు



**నిజామాబాద్ అర్బన్, మే 18 (జనంసాక్షి):** వరదలు, విపత్తులు సంభవించిన సమయాల్లో చేపట్టాల్సిన తక్షణ చర్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల విషయంలో సన్నద్ధతను తెలుసుకునేందుకు సోమవారం నిజామాబాద్ జిల్లాలో చేపట్టిన మాక్ ఎక్సర్‌సైజ్ విజయవంతంగా కొనసాగింది. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమాలు విపత్తుల నిర్వహణలో జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సమాయత్తంగా ఉందన్న విషయాన్ని ప్రయోగాత్మకంగా నిరూపించాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, రఘునాథ చెరువు ప్రాంతాల్లో ఏకకాలంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. రఘునాథ చెరువు వద్ద జరిగిన కార్యక్రమాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్వయంగా పర్యవేక్షించారు. భారీ వర్షాలు కురిసి వరద ప్రవాహం కారణంగా చెరువులో చిక్కుకున్న వారిని డ్రోన్ల సహాయంతో గుర్తించి, వాటర్ బోట్ల ద్వారా ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కాపాడి, ఒడ్డుకు చేర్చి వైద్య సహాయం అందించడం వంటి సహాయక చర్యలు వాస్తవికతను మరిపించేలా జరిగాయి. సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో రిలీఫ్ క్యాంపు ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని వరద జలాలు చుట్టుముట్టిన సమయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లోని రోగులను హుటాహుటిన పై అంతస్తులకు చేర్చి ప్రాణాలు కాపాడే విధానాన్ని కూడా మాక్ ఎక్సర్‌సైజ్ ద్వారా ప్రదర్శించారు. డ్రోన్లు, వాటర్ బోట్లు, అంబులెన్సులు, అగ్నిమాపక శకటాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి చేపట్టిన సహాయక చర్యలు విపత్తుల నిర్వహణపై జిల్లా యంత్రాంగం సన్నద్ధతను చాటిచెప్పాయి.

జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించి జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. పోలీస్, ఫైర్, రెవెన్యూ, ఫిషరీస్, హెల్త్, ట్రాన్స్‌పోర్ట్ తదితర శాఖలు చక్కటి సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడం విపత్తుల సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించడంలో ఉపయోగపడుతుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌సీసీ, ఆపదమిత్ర వాలంటీర్లు మాక్ డ్రిల్ విజయవంతానికి దోహదపడ్డారు. అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, అదనపు డీసీపీ శుభం నగ్రాలే, జిల్లా అగ్నిమాపక అధికారి పరమేశ్వర్, ఇతర అధికారులు సహాయక చర్యలను పర్యవేక్షించారు.

## దివ్యాంగుల ఇబ్బందులపై జిల్లా కలెక్టర్ సత్వర స్పందన

- ఇద్దరికి తక్షణమే బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు అందజేత
- కృతజ్ఞతలు తెలియజేసిన దివ్యాంగులు



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, మే 18 (జనం సాక్షి) :** ఇద్దరు దివ్యాంగుల ఇబ్బందులను చూసి చలించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సత్వరం స్పందించారు. వారి సమస్యకు పరిష్కారం చూపారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ఉప్పుల శ్రీనివాస్, ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన కొమిరే పరశురాములు అనే దివ్యాంగులు సోమవారం ఐడీఓసీకి పని నిమిత్తం వచ్చారు. వారిని చూసిన జిల్లా కలెక్టర్ ఎక్కడి నుంచి వచ్చారు, ఏ సమస్యపై వచ్చారో అడిగి తెలుసుకున్నారు. తాము పనులపై బయటికి వెళ్లేందుకు, పనులు చేసుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని గుర్తించి తక్షణమే స్పందించిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వారికి బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు అందజేయాలని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజంను ఆదేశించారు. వారి ఇద్దరికి వెంటనే బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు, హెల్మెట్ జిల్లా కలెక్టర్ అందజేశారు. తమ సమస్య, ఇబ్బందులను అర్థం చేసుకొని మానవతా దృక్పథంతో బ్యాటరీ ఆపరేటెడ్ ట్రై సైకిళ్లు అందజేసిన జిల్లా కలెక్టర్‌కు దివ్యాంగులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్య పెంచాలి

### రైస్ మిల్లులు, గోదాముల్లో అన్ లోడింగ్ వేగంగా చేయాలి : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్య పెంచాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం, వాహనాల ద్వారా ధాన్యం తరలింపు, హమాలీల సంఖ్య పెంపు, అన్ లోడింగ్ చేయడం, రైతులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై సోమవారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి పౌర సరఫరాల, సహకార శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా, మెప్మా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రతి రోజు ఉదయం 08.00 గంటలకు జిల్లా కలెక్టర్ అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహిస్తున్నారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుంచి తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో డిమాండ్ కు అనుగుణంగా వాహనాలు సమకూర్చాలని సూచించారు. రైస్ మిల్లులు, అపరల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల కొరత లేకుండా చూడాలని, డిమాండ్ కు అనుగుణంగా పెంచి, ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. హమాలీలకు భోజనం, వైద్య సేవలు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద కేటాయించిన రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని, క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

# నీట్ లీకేజీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి : ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర కమిటీ
- ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు




**ముషీరాబాద్, మే 18 (జనం సాక్షి):** దేశవ్యాప్తంగా 22లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న నీట్ పరీక్షా వ్యవస్థ పూర్తిగావిఫలమైందని, పేపర్ లీకేజీలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్, బాగ్లింగంపల్లి ఓంకార్ భవన్ లో అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున మాట్లాడుతూ దేశంలో విద్యా వ్యవస్థను పూర్తిగా ప్రైవేటీకరణ దిశగా నడిపిస్తూ, పేద, మధ్యతరగతి విద్యార్థుల ఆశయాలను కేంద్ర ప్రభుత్వం నాశనం చేస్తోందని మండిపడ్డారు. నీట్ పరీక్షలు ప్రతి సంవత్సరం అవినీతి, పేపర్ లీకేజీలు, అక్రమాలతో వార్తల్లో నిలుస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం ఎలాంటి సంస్కరణలు తీసుకురాకపోవడం దారుణమన్నారు.

విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమవుతుంటే, మరోవైపు పేపర్ లీకేజీ మాఫియా కోట్ల రూపాయల వ్యాపారం చేస్తూ విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ఉన్న పెద్దల్ని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అందుకే అసలు నిందితులు బయటకు రావడం లేదని విమర్శించారు. దేశ భవిష్యత్తు అయిన విద్యార్థుల జీవితాలతో ఆటలాడే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని, వెంటనే ఎన్‌టిఏను రద్దు చేసి పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా విద్యార్థి ఉద్యమాలు మరింత ఉధృతం అవుతాయని హెచ్చరించారు. అలాగే నీట్ పేపర్ లీకేజీ వెనుక ఉన్న మాఫియాను పూర్తిగా వెలికితీసి, వారికి కఠిన శిక్షలు విధించాలని, బాధిత విద్యార్థులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి , అరుణ్ తదితరులు పాల్గొన్నారు.


## కొనుగోలు కేంద్రాలను రైస్ మిల్లులను పరిశీలించిన ఆర్డీవో కుమారి

**బోయిన్ పల్లి మే 18 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంలో భాగంగా పలు కొనుగోలు కేంద్రాలు, మార్కెట్ యార్డు రైస్ మిల్లులను ఆర్డీవో కుమారి సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ తనిఖీల్లో తహసిల్దార్ శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, ఆర్ ఐ మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. రైస్ మిల్లుల్లో తాలు తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

# ప్రజాధనం గాయబ్?

**పెద్దమల్లారెడ్డి పంచాయతీలో 'తీర్మానాలు' లేని బిల్లుల జాతర**



- కలెక్టర్ మెట్లు ఎక్కిన వార్డు సభ్యులు.. సర్పంచ్, సెక్రెటరీల తీరుపై నిరసన
- సర్పంచ్ భార్య పేరిట చెక్కులు.. రికార్డుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపణ
- పంచాయతీ కార్యదర్శి అనుమతితో సర్పంచుల ఇష్టారాజ్యం

**భిక్కనూరు మే 18 (జనం సాక్షి) :** గ్రామ వికాసానికి మారుపేరుగా నిలవాల్సిన గ్రామపంచాయతీ.. ఇప్పుడు అక్రమాలకు, నిబంధనల ఉల్లంఘనకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందా? ప్రజాధనం వార్డు సభ్యుల కళ్ళు గప్పి కొందరి జేబుల్లోకి వెళ్ళిపోతోందా? అంటే అవుననే అంటున్నారు కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామపంచాయతీ వార్డు సభ్యులు. పంచాయతీలో జరుగుతున్న వరుస పరిణామాలపై విసిగిపోయిన వార్డు సభ్యులు చివరకు న్యాయం కోసం జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించడం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టిస్తోంది.

### తీర్మానం లేదు.. చర్చ అసలే లేదు!

ఎన్నికైన వార్డు సభ్యులకు తెలియకుండా గ్రామ పంచాయతీలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడానికి వీల్లేదన్నది పంచాయతీ రాజ్ చట్టం చెబుతున్న మాట. కానీ, పెద్దమల్లారెడ్డి పంచాయతీలో మాత్రం చట్టాలు చుట్టాలుగా మారినట్లు కనిపిస్తోంది. స్పెషల్ ఆఫీసర్స్ ఉన్నప్పటి నుండి సర్పంచ్ వ్యవస్థ వచ్చినప్పటి వరకు జరిగిన ఎం.బి (వీడీ) రికార్డు బిల్లులు, ఇతరత్రా చెల్లింపులపై వార్డు సభ్యులకు కనీస సమాచారం లేకపోవడం ఇక్కడి విచిత్ర పరిస్థితి. కనీసం 'మినిట్ బుక్' లో వార్డు సభ్యుల సంతకాలు, తీర్మానాలు లేకుండానే లక్షలాది రూపాయల బిల్లులు ఎలా డ్రా చేశారనేది ఇప్పుడు మిస్టరీగా మారింది.

### స్వంత మనుషులకే చెక్కులు?

వార్డు సభ్యులు లేవనెత్తుతున్న ప్రధాన ఆరోపణ ఏంటంటే.. గ్రామ పంచాయతీ నిధులను నిబంధనలకు విరుద్ధంగా సర్పంచ్ భార్య పేరు మీద, అలాగే వారికి అనుకూలమైన వ్యక్తుల పేరు మీద చెక్కుల రూపంలో విడుదల చేశారు. అసలు ఆ పనులు జరిగాయా? జరిగితే వాటి నాణ్యత ఏంటి? నిధుల కేటాయింపు ఎలా జరిగింది? అనే విషయాలపై వార్డు సభ్యులు నిలదీస్తున్నారు.

"మాకు పొంతన లేని సమాధానాలు చెప్తున్నారు!"

"బిల్లుల విషయమై మేము పెద్ద మల్లారెడ్డి సెక్రెటరీని, సర్పంచ్‌ను, ఉపసర్పంచ్‌ను వివరణ కోరగా.. వారి నుంచి ఎలాంటి స్పష్టమైన సమాధానం రావడం లేదు. అంతా దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నా రు. మాకు తెలియకుండానే మా పేరిట తీర్మానాలు జరిగినట్లు చూపిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు."

అని పెద్ద మల్లారెడ్డి గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పేర్కొన్నారు.



### కలెక్టర్ స్పందిస్తారా? విచారణ జరుగుతుందా?

తమ గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఈ అక్రమ దోపిడీని అరికట్టాలని, ప్రజాధనాన్ని కాపాడాలని కోరుతూ వార్డు సభ్యులంతా ఏకతాటిపైకి వచ్చి కామారెడ్డి జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించారు. ఉన్నతాధికారుల చేత తక్షణమే పూర్తిస్థాయి విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వార్డు సభ్యులకే పంచాయతీలో విలువ లేకపోతే.. ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏంటనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. మరి ఈ 'బిల్లుల భాగోతం' పై జిల్లా కలెక్టర్ గారు ఎలాంటి చర్యలు తీసుకుంటారో, పెద్దమల్లారెడ్డి పంచాయతీ అవినీతి నిజా నిజాలు ఎలా బయటపడతాయో వేచి చూడాలి.

### మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించి

# గర్భవతిని చేసిన బంధువు

**రేప్, పోక్సో కేసు నమోదు.. నిందితుడు రిమాండ్**




**తాండూరు మే 18(జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా బొమ్రాస్‌పేట్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి, పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి లొంగదీసుకుని గర్భవతిని చేశాడనే ఆరోపణలపై బాలిక బంధువైన శివ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం

తాండూరు మండలం గౌతపూర్ గ్రామానికి చెందిన నిందితుడు శివ కుమార్, బాలికకు దగ్గరి బంధువు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికతో శారీరక సంబంధం పెట్టుకున్నాడు. కొద్ది రోజుల తర్వాత బాలిక గర్భవతి అయిన విషయం బయట పడింది. దీంతో బాలిక తల్లి తాండూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేశారు. నిందితుడు శివ కుమార్‌ను అదుపులోకి తీసుకుని, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

# మొక్కజొన్న కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- గన్నీ సంచులు, లారీల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు
- మధ్య దళారుల దోపిడీ అరికట్టాలి : సీపీఐ(ఎం)
- సమస్యలు రెండు మూడు రోజుల్లో పరిష్కరించాలి



**కరీంనగర్ టౌన్, మే 18 (జనంసాక్షి):** కరీంనగర్ వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించి మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గన్నీ సంచులు, లారీల కొరత కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కొనుగోలు కేంద్రాన్ని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ నాయకులతో కలిసి సందర్శించిన వాసుదేవరెడ్డి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్ చైర్మన్ ఆకుల నర్సన్న, మార్కెట్ కార్యదర్శి హమీద్ పాషాలను కలిసి రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. మార్కెట్‌లో మధ్య దళారుల దోపిడిని అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను రెండు మూడు రోజుల్లో పరిష్కరించి కొనుగోళ్లు వేగవంతం చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ, రైతులు పండించిన మొక్కజొన్నను విక్రయించేందుకు 15 రోజులుగా మార్కెట్ యార్డులోనే పడిగాపులు కాస్తున్నారని అన్నారు. కాంటాలు పూర్తయిన మొక్కజొన్న బస్తాలను లోడింగ్ చేయకపోవడంతో రైతులు రాత్రింబవళ్లు బస్తాల వద్ద కాపలా కాస్తున్నారని తెలిపారు. తూకం వేసిన బస్తాలను అదే రోజు లిఫ్ట్ చేయాలని, కొనుగోళ్లు యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని డిమాండ్ చేశారు.

గన్నీ సంచుల కొరత తీవ్రంగా ఉండడంతో అధికారులు రైతులనే సంచులు తెచ్చుకోవాలని చెబుతున్నారని, దీంతో రైతులు అదనపు ఖర్చుతో గన్నీ సంచులు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ముందస్తు ప్రణాళికలు లేకపోవడం వల్లే రైతులు మద్దతు ధర కోసం ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. రవాణా కోసం లారీల కొరత కూడా తీవ్రంగా ఉందని, జిల్లా అధికారులు జోక్యం చేసుకుని వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు.

ప్రతి మండలానికి ఒక మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా ప్రాధాన్యత క్రమంలో కొనుగోళ్లు జరపాలని వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. ఎకరానికి 25 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పడం అన్యాయమని, రైతు పండించిన మొత్తం పంటను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గిట్ల ముకుంద రెడ్డి, గుడికందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులు ఉప్పునూటి శ్రీనివాస్, సుంకర సంపత్, డి. నరేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ కొట్టు.. కూరగాయలు పట్టు

- ఫోన్ చేస్తే చాలు కూరగాయలు అందించే బాధ్యత నాది
- మైలారం యువరైతు మందుల శ్రీనివాస్ వినూత్న సేవ



**ధారూర్ మే 18(జనంసాక్షి) :** గ్రామీణ ప్రాంత ప్రజలకు సులభంగా తాజా కూరగాయలు అందించాలనే ఉద్దేశంతో మైలారం గ్రామానికి చెందిన యువరైతు మందుల శ్రీనివాస్ వినూత్న వ్యాపారాన్ని ప్రారంభించి ప్రజల ప్రశంసలు పొందుతున్నారు. 'ఫోన్ కొట్టు. కూరగాయలు పట్టు"అనే నినాదంతో మైలారం, నాగారం,. తరిగోపుల, తదితర గ్రామాల్లో డోర్ టు డోర్ కూరగాయల సరఫరా చేస్తున్నారు. ఎప్పుడు ఫోన్ చేసినా కూరగాయలు అందించే బాధ్యత నాది అని శ్రీనివాస్ చెబుతున్నారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల తాజా కూరగాయలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుతూ ఒక్క ఫోన్ కాల్‌తోనే ఇంటి వద్దకు తీసుకెళ్లి అందిస్తున్నారు. ప్రత్యేకంగా వృద్ధులు, ఉద్యోగులు, మహిళలకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా మారింది. మార్కెట్‌కు వెళ్లే సమయం లేకపోయినా బయటకు వెళ్లలేని పరిస్థితి ఉన్నా ఫోన్ ద్వారా ఆర్డర్ ఇచ్చి ఇంటికే కూరగాయలు తెప్పించుకుంటున్నారు. రైతుల వద్ద నుంచి నేరుగా కూరగాయలను సేకరించి ప్రజలకు అందించడం వల్ల నాణ్యతతో పాటు సరసమైన ధరలు కూడా లభిస్తున్నాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మధ్యవర్తులు లేకుండా నేరుగా సరఫరా చేయడం ద్వారా రైతులకు కూడా మంచి లాభం చేకూరుతోంది. స్వగ్రామంలోనే స్వయం ఉపాధి సాధిస్తూ ఇతర యువతకు ఆదర్శంగా నిలుస్తున్నమందుల శ్రీనివాస్ సేవలను మరిన్ని గ్రామాలకు విస్తరించాలని భావిస్తున్నారు. కూరగాయల కోసం సంప్రదించండి మందుల శ్రీనివాస్ సెల్: 7995630036. మైలారం గ్రామం రైతుల వద్ద నుంచి నేరుగా కూరగాయలను సేకరించి ప్రజలకు అందించడం వల్ల నాణ్యతతో పాటు సరసమైన ధరలు కూడా లభిస్తున్నాయని మధ్యవర్తులు లేకుండా నేరుగా సరఫరా చేయడం ద్వారా రైతులకు కూడా మంచి లాభం చేకూరుతోంది. మందుల శ్రీనివాస్ రైతు తెలిపారు. మైలారం గ్రామ యువ నాయకులు మద్దులపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ...పట్టణ ప్రాంతాల్లో మాత్రమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇలాంటి సేవలు అందుబాటులోకి రావడం ఆనందకరం. గ్రామీణ యువత స్వయం కృషితో ఎదగడం చాలా ముఖ్యం. యువత తమ గ్రామాల్లోనే కొత్త ఆలోచనలతో స్వయం ఉపాధి అవకాశాలు సృష్టించుకోవాలి అని అన్నారు. యువతకు ఇలాంటి ఆలోచనలు రావడం మంచి నిర్ణయం అని అయన అబినందించారు.

# అంకితభావంతో ప్రజలకు సేవలు అందించాలి

### ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు గవర్నర్ దిశా నిర్దేశం



హైదరాబాద్, మే 8 (జనంసాక్షి) : అంకిత భావంతో ప్రజలకు సేవలు అందించాలని ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా దిశా నిర్దేశం చేశారు. సోమవారం ఎంసీఆర్ హెచ్‌సీఆర్ ఇన్స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న 44 మంది గ్రూప్-1 ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ లు సంస్థ వైస్ చైర్‌పర్సన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శాంతి కుమారి ఆధ్వర్యంలో గవర్నర్‌ను లోక్ భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ ల ను గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా గవర్నర్ ప్రొబేషనరీ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి నిర్ణయంలో ప్రజల సంక్షేమమే మీ ప్రధాన లక్ష్యం కావాలన్నారు. పరిపాలనలో నిజాయితీ మీ గొప్ప బలం. అది ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతుందన్నారు. ప్రతి పౌరుని సమస్యను సున్నితంగా అర్థం చేసుకుని పరిష్కారం చూపాలన్నారు. పదవి ఒక అధికారం మాత్రమే కాదు, అది ఒక బాధ్యత' అనే విషయాన్ని ఎల్లప్పుడూ గుర్తుంచుకుంటూ రాష్ట్రాభివృద్ధికి, సమాజ పురోగతికి కీలకంగా మారాలన్నారు. సమావేశంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి శశికిరణా చారి లు పాల్గొన్నారు.

**సరస్వతి అంత్య పుష్కరాలకు రావాలని ఆహ్వానం**

జయశంకర్ భూపాల పల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈనెల 21 నుంచి ప్రారంభం కానున్న సరస్వతీ నది అంత్య పుష్కరాలకు హాజరవ్వాలని రాష్ట్ర గవర్నర్ శ్రీ శివప్రతాప్ శుక్లాను దేవదాయ శాఖ ఆహ్వానించింది. మంత్రి శ్రీమతి కొండా సురేఖ, ఆలయ అర్చకులు గవర్నర్ ను లోక్ భవన్‌లో సోమవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, డైరెక్టర్ హనుమంతరావు తదితరులున్నారు.

**ఈఏపీసెట్ రాష్ట్ర ప్రథమ ర్యాంకర్‌కు గవర్నర్ అభినందన**

తెలంగాణ ఈఏపీసెట్ ఫలితాల్లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థిని మల్లాడి రుషిని గవర్నర్ సోమవారం లోక్ భవన్ లో అభినందించారు. ఈ సందర్భంగా రుషి సాధించిన విజయాన్ని ప్రశంసించిన గవర్నర్.. ఆమె కృషి, పట్టుదలతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారం కూడా అభినందనీయమన్నారు.

**గవర్నర్‌ను కలిసిన గిగ్ కార్మికుల సంఘం ప్రతినిధులు**

తెలంగాణ గిగ్ ,ప్లాట్ ఫామ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్, పలువురు యూనియన్ ప్రతినిధులు లోక్ భవన్ లో సోమవారం గవర్నర్ ను కలిశారు.

## కేబీఆర్ పార్క్ చుట్టూ చెట్ల నరికివేతపై స్టే

### సుప్రీం ఆదేశాలతో నిలిచిపోనున్న ఫ్లై ఓవర్ నిర్మాణాలు




న్యూఢిల్లీ, మే18 (జనంసాక్షి) : కేబీఆర్ పార్క్ పరిసరాల్లో చెట్ల నరికివేతపై సుప్రీం కోర్టు స్టే విధించింది. ఎకో సెన్సిటివ్ జోన్ లోపల చెట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ నరకరాదని ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టగా.. చెట్ల నరికివేతపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది. సోమవారం జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ముందు ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. పర్యావరణ ప్రేమికుల తరఫున సీనియర్ కౌన్సిల్ కె. వివేక్ రెడ్డి బలమైన వాదనలు వినిపించారు. చెట్ల నరికివేత వల్ల వస్తున్న పర్యావరణ నష్టాన్ని వివరించి, ప్రభుత్వ నిర్మాణ పనులపై స్టే విధించాలని కోర్టును కోరారు. దీంతో చెట్ల నరికివేతపై స్టే ఇచ్చిన సుప్రీంకోర్టు.. తదుపరి విచారణను జూలై 27కు వాయిదా వేసింది. సుప్రీంకోర్టు స్టే ఆదేశాలతో ఎస్ఆర్‌డీపీ పనులు తాత్కాలికంగా నిలిచిపోనున్నాయి. ప్రధానంగా కేబీఆర్ జంక్షన్ పరిసరాల్లో ఫ్లై ఓవర్ల నిర్మాణానికి భారీ ఆటంకం ఏర్పడింది.

## కన్యాశుల్కం తరహాలో వివాహం

- ఎదురు కట్నం ఇచ్చి యువతితో పెళ్లి
- ఒక్కరోజులోనే జంప్ అయి ఫిర్యాదు చేసిన యువతి

జనగామ, మే18 (జనంసాక్షి) : జనగామ జిల్లా బచ్చన్నపేటలో నాటి కన్యాశుల్కాన్ని తలపించే ఘటన చోటు చేసుకుంది. 18 ఏళ్ల యువతికి 45 ఏళ్ల వ్యక్తితో సవతి తల్లి-తండ్రి వివాహం జరిపించిన ఘటన గ్రామంలో సంచలనం సృష్టించింది. బచ్చన్నపేటకు చెందిన బీఆర్ఎస్ నేత ప్రశాంత్ రెడ్డి ఇటీవల వార్డు మెంబర్‌గా ఎన్నికయ్యాడు. అదే గ్రామానికి చెందిన దంపతులకు రూ.20 లక్షల అప్పు ఇచ్చాడు ప్రశాంత్ రెడ్డి. అప్పు తిరిగి ఇవ్వకపోవడంతో వారి కూతురినిచ్చి పెళ్లి చేయాలని ఒత్తిడి చేశాడు. అవసరమైతే ఎదురుకట్నం ఇస్తానని ఆశ చూపి కొంత డబ్బు ముట్టజెప్పాడు. దీంతో సవతి తల్లి- తండ్రి కలిసి తమ 18 ఏళ్ల కుమార్తెను బలవంతంగా ఒప్పించి ప్రశాంత్ రెడ్డితో వివాహం జరిపించారు. అప్పటికే యువతి మరో యువకుడిని ప్రేమించింది. దీంతో పెళ్ళైన మరుసటి రోజే ప్రియుడితో యువతి పరారైంది. స్నేహితుల సహాయంతో ప్రశాంత్ రెడ్డి నుంచి తప్పించు కున్న యువతి.. హైదరాబాద్‌లో మహిళా కమిషన్‌ను ఆశ్రయించింది. ఈ ఘటనపై విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీకి మహిళా కమిషన్ ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

## రోడ్లపై నమాజ్ చేస్తామంటే కుదరదు

### ముస్లింలకు సిఎం యోగీ ఆదిత్యానాథ్ హెచ్చరిక



లక్నో, మే18 (జనంసాక్షి) : ఇకపై రోడ్లపై నమాజ్ చేయడం ఉదరదని యూపి ప్రభుత్వం హెచ్చరించింది. రోడ్లపై నమాజ్ చేసే ముస్లింలకు ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక హెచ్చరికలు చేశారు. రోడ్లపై నమాజ్ చేయకుండా సంయమనం పాటించాలని, చట్టం అందరికీ సమానమేని అన్నారు. లఖ్‌నవూలో సోమవారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో పేర్కొన్నారు. 'రోడ్లున్నవి ప్రజల రాకపోకల కోసం. వారికి అసౌకర్యం కలిగిస్తే ఊరుకోం. ముస్లింలు జనాభాను నియంత్రించుకోవాలి' అని అన్నారు. 'ఉత్తర్‌ప్రదేశ్‌లోని రోడ్లపై నమాజ్‌లు చేయరా అని తరచూ కొందరు నన్ను అడుగుతుంటారు. అలాంటివి ఇక్కడుండవని చెబుతుంటాను. కావాలంటే వెళ్లి చూసుకోమంటాను. రోడ్లున్నవి ప్రజా రవాణా కోసం. ఎవరైనా రోడ్ల కూడళ్ల వద్దకు వచ్చి ట్రాఫిక్‌ను దిగ్బంధించవచ్చా? ప్రజారవాణాకు అంతరాయం కలిగించే హక్కు వారికి ఎవరిచ్చారు?. మరికొందరు అడుగుతుంటారు. తాము ఎక్కువ మంది ఉన్నప్పుడు ఇలా నమాజ్ చేయకుండా ఉండటం సాధ్యం కాదు కదా అంటారు. దానికి మా సమాధానం ఒక్కటే. మసీదుల్లో షిఫ్టుల ప్రకారం నమాజ్ చేసుకోండి. ఇంట్లో జాగా లేకుంటే దానికి తగ్గట్టుగా జనాభా ఉండేలా చూసుకోండి. జనాభాను పెంచుకోకండి. చట్టం అందరికీ సమానమే. ప్రభుత్వ నిబంధనలు కూడా చట్టంతో సమానం' అని యోగి వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. ఇటీవల పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కూడా యోగి ఆదిత్యనాథ్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. రోడ్లపై నమాజ్‌లను మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీ ప్రభుత్వం అనుమతించ డాన్ని తప్పుపట్టారు. ఆయన వ్యాఖ్యలను టీఎంసీ తోసిపుచ్చింది. మైనారిటీలను యోగి ఆదిత్యనాథ్ బెదిరిస్తున్నారంటూ వ్యాఖ్యానించింది. ఇకపోతే కోర్టు కూడా గతంలో ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. రోడ్లపై నమాజుతో ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దని హెచ్చరించింది.

## విమానాశ్రయంలో కార్గో టెర్మినల్ ప్రారంభం




శంషాబాద్,మే18(జనంసాక్షి) : రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యాధునిక కార్గో టెర్మినల్ 2ను జిఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ (జీహెచ్‌ఐఏఎల్) ప్రారంభించింది. ప్రపంచ స్థాయి ఎయిర్ కార్గో, లాజిస్టిక్స్ కేంద్రంగా విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసే దిశగా ఇది కీలక మైలురాయిగా నిలిచింది. సుమారు 16,864 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ టెర్మినల్ ప్రారంభ దశలో సంవత్సరానికి 50,000 మెట్రిక్ టన్నుల కార్గో నిర్వహణ సామర్థ్యంతో పనిచేయనుంది. భవిష్యత్తులో దీన్ని 1 లక్ష మెట్రిక్ టన్నుల వరకు విస్తరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఫార్మా సరుకుల కోసం ప్రత్యేక ఉష్ణోగ్రత నియంత్రిత జోన్, దిగుమతి-ఎగుమతి ప్రాసెసింగ్ ప్రాంతాలు, మల్టీ-లెవల్ నిల్వ సదుపాయాలు వంటి ఆధునిక సౌకర్యాలు ఈ టెర్మినల్‌లో ఏర్పాటు చేశారు. దేశీయ, అంతర్జాతీయ కార్గో రవాణా పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఎయిర్‌లైన్స్, ఫ్రైట్ ఫార్వార్డర్స్, లాజిస్టిక్స్ ఆపరేటర్లు, నియంత్రణ సంస్థలకు అత్యాధునిక మౌలిక సదుపాయాలను అందించేలా దీనిని రూపొందించారు. ఈ కార్గో టెర్మినల్2 ప్రారంభంతో హైదరాబాద్‌ను గ్లోబల్ లాజిస్టిక్స్ హబ్‌గా అభివృద్ధి చేయడం లక్ష్యమని జీహెచ్‌ఐఏఎల్ అధికారులు పేర్కొన్నారు.

## రాకెట్ ల్యాబ్ పేరుతో ప్రజలకు బురిడీ

పల్నాడు, మే18 (జనంసాక్షి) : పల్నాడు జిల్లాలో రాకెట్ ల్యాబ్ పేరుతో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. తక్కువ మొత్తంలో డబ్బులు పెట్టుబడి పెడితే భవిష్యత్తులో విడతల వారీగా రూ.25 కోట్ల వరకు వస్తాయని నమ్మబలికి వందలాది మంది నుంచి డబ్బులు వసూలు చేసిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల్లో ఈ మోసం పెద్ద ఎత్తున జరిగింది. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రూ.3వేల నుంచి రూ.11 వేలు కడితే విడతల వారీగా రూ.25 కోట్లు వస్తాయని కేటుగాళ్లు బురిడీ కొట్టించారు. అత్యాశకుపోయి డబ్బులు కట్టి పలువురు బాధితులు మోసపోయారు. నరసరావుపేటలో 263 మంది సహా చిలకలూరిపేట మరికొందరు.. ఇలా మొత్తం సుమారు 500 మంది నుంచి కేటుగాళ్లు డబ్బులు వసూలు చేశారు. ప్రధాన నిందితుడు చిలకలూరిపేట మండలం గొట్టిపాడుకి చెందిన వెంకట్రావుతో సహా ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసానుపల్లి వీఆర్వో ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో నిందితులపై కేసు నమోదైంది.

## శంషాబాద్‌లో తప్పిన విమాన ప్రమాదం

### 500 మీటర్ల ఎత్తులో విమానాన్ని ఢీకొన్న పక్షి




హైదరాబాద్, మే18 (జనంసాక్షి) : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎయిర్ ఇండియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. సోమవారం ఉదయం బెంగళూరు నుంచి శంషాబాద్‌కు ఎయిర్ ఇండియా విమానం బయలుదేరింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అవుతున్న సమయంలో విమానాన్ని పక్షి ఢీకొట్టింది. ఆ సమయంలో విమానంలో 76 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. దాదాపు 500 మీటర్ల ఎత్తులో విమానాన్ని పక్షి ఢీకొన్నట్లు పైలట్ గుర్తించారు. వెంటనే ఈ ఘటనపై అధికారులకు సమాచారం అందించారు. పైలట్ అప్రమత్తతతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం సురక్షితంగా ల్యాండింగ్ అయ్యింది. దీంతో విమానంలోని ప్రయాణికులతో పాటు ఎయిర్‌పోర్ట్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై ఎయిర్‌పోర్ట్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు విమానాలను పక్షులు ఢీకొన్న ఘటనలు మూడు నమోదు అయినట్లు తెలుస్తోంది. బర్డ్ స్ట్రైక్ ఘటనలు తరచుగా జరుగుతున్న నేపథ్యంలో ఎయిర్‌పోర్టు సమీప ప్రాంతాల్లో పక్షుల నియంత్రణ చర్యలను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఎయిర్‌పోర్ట్ అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

## నిజామాబాద్‌కు సీఎం పంగనామాలు

- ఇచ్చిన హామీలను పట్టించుకోని రేవంత్
- తలెత్తుకోలేక పోతున్న పీసీసీ చీఫ్
- మీడియా సమావేశంలో ఎంపీ అర్వింద్ విమర్శలు




నిజామాబాద్, మే18 (జనంసాక్షి) : నిజామాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంగనామాలు పెట్టారని స్థానిక ఎంపీ, బీజేపీ నేత ధర్మపురి అరవింద్ మండిపడ్డారు. ఔటర్ రింగ్ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ హామీలు ఏమయ్యాయని అన్నారు. ఈ హామీలు నెరవేర్చకపోవడంతో పిసిసి చీఫ్ తలెత్తుకోలేక పోతున్నారని అన్నారు. సోమవారం నిజామాబాద్‌లో ఎంపీ అరవింద్ విలేకర్లతో మాట్లాడుతూ.. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను రాజకీయంగా అణగదొక్కేందుకే జిల్లాకు మొండిచేయి చూపించారని విమర్శించారు. ఇంకా ఏ ముఖం పెట్టుకుని ఈ జిల్లాలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తిరుగుతున్నారని ప్రశ్నించారు. నిజామాబాద్‌కు అవుటర్ రింగ్ రోడ్ ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందూరు ప్రజలను మోసం చేస్తే వారే బుద్ధి చెబుతారన్నారు. దేవుళ్లను మోసం చేసిన వాడికి ప్రజలను మోసం చేయటం లెక్క కాదని నిజామాబాద్ బీజేపీ ఎంపీ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పూర్తి కావని కుండ బద్దలు కొట్టారు. ఇప్పటి వరకు నిజామాబాద్ నగరంలో 25 శాతం డ్రైనేజీ పనులు కూడా పూర్తి కాలేదన్నారు. రూ.162 కోట్లకు గాను కేవలం రూ. 10 కోట్ల నిధులు మాత్రమే యుడిసికి ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. 2039 వరకు రాహుల్ ప్రధాని కారని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. అంటే రాహుల్ ఇక ప్రధాని కాలేరని తెలంగాణ సీఎం చెప్పారు. తద్వారా ఇంకో పదేళ్లు దేశంలో బీజేపీ ఉంటుందని తెలంగాణ సీఎం ఒప్పుకున్నారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డికి బదులు కోమటిరెడ్డి లాంటి జెన్యూన్ పర్సన్‌ని తెలంగాణ ముఖ్యమంత్రిగా నియమించాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలకు ఈ సందర్భంగా ఎంపీ అరవింద్ స్పష్టం చేశారు. బుల్లెట్ రైల్ కారిడార్ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. పట్టణాన్ని అప్ గ్రేడ్ చేస్తానని ప్రకటించిన బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌నే ప్రజలు నమ్మలేదని.. ఇక లేని ఫ్యూచర్ సిటీ అంటే నమ్ముతారా? అంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఎంపీ అరవింద్ చురకలు అంటించారు.

## బండి సంజయ్ రాజీనామా కోరుతూ ఆందోళన

### సిరిసిల్లలో బీఆర్ఎస్, బీజేపీల ఘర్షణతో ఉద్రిక్తత



రాజన్న సిరిసిల్ల, మే18 (జనంసాక్షి) : సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉద్రిక్తత నెలకొంది. బండి భగీరథ్ పోక్సో కేసులో అరెస్టయిన నేపథ్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని పాత బస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలపై బీజేపీ శ్రేణులు దాడికి దిగాయి. ఈ ఘటనలో పలువురు బీఆర్ఎస్ నేతలు గాయపడ్డారు. బీజేపీ శ్రేణులు దాడికి పాల్పడినప్పటికీ బీఆర్ఎస్ నేతలు నిరసనలు ఆపలేదు. బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ క్రమంలో ఉద్రిక్తతలు తలెత్తడంతో జిల్లా ఎస్పీ మహేశ్ బి గితే, డీఎస్పీ నాగేంద్రచారి బీజేపీ నేతలను అడ్డుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇక బీఆర్ఎస్ నేతలను సముదాయించి పంపించారు.

## నటుడు దర్శన్ ఆత్మహత్య అంటూ వదంతులు

### అలాంటిదేమీ లేదని ఖండించిన జైలు అధికారులు

బెంగళూరు, మే18 (జనంసాక్షి) : కన్నడ చలనచిత్ర నటుడు, ఓ హత్యకేసులో నిందితుడైన దర్శన్ తూగుదీప బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు వదంతు లు రావడం సోమవారంనాడు తీవ్ర సంచలనమైంది. దీంతో జైలు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉద్రిక్తత తలెత్తింది. నిజానిజాలను నిర్ధారించేందుకు జైలు సీనియర్ తక్షణ చర్యలు చేపట్టారు. అనంతరం ఈ వదంతుల్లో ఎలాంటి నిజం లేదని ప్రకటించారు. ఆదివారం రాత్రి నుంచే ఈ వదంతులు వ్యాప్తి చెందాయని, దీంతో జైలు ల్యాండ్ లైన్‌కు వరుస ఫోన్లు వచ్చాయని జైలు సిబ్బంది తెలిపారు. అయితే అలాంటి ఘటనలేవీ చోటుచేసుకోలేదని సీనియర్ జైలు అధికారులు ధ్రువీకరించారు. దీనిపై జైళ్ల శాఖ డీజీపీ అలోక్ కుమార్ మాట్లాడుతూ, సినీ నటుడు దర్శన్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు వచ్చిన వదంతుల్లో ఎంతమాత్రం నిజం లేదని చెప్పారు. వదంతులు నమ్మి ఎవరూ పరప్పన అగ్రహార సెంట్రల్ జైలుకు రావద్దని, దర్శన్ క్షేమంగానే ఉన్నారని తెలిపారు. మరోవైపు, మంగళవారంనాడు తన పెళ్లిరోజు అయినందున కుటుంబ సభ్యులను కలుసుకునేందుకు అనుమతించాల్సిందిగా కోర్టును దర్శన్ కోరారు. దీనిపై కోర్టు ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలిసింది. నటి పవిత్రాగౌడ్‌కు అసభ్య సందేశాలు పంపినందుకు రేణుకాస్వామి అనే యువకుడిని హత్య చేశారనే ఆరోపణలను దర్శన్ ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో మొత్తం 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

## జడ్జి మాధవీదేవిపై తప్పుడు ప్రచారం

- వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్, మే18 (జనంసాక్షి) : బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్ విచారణ నేపథ్యంలో న్యాయమూర్తి జస్టిస్ టీ.మాధవీదేవిపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన దామోదర్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. బండి సంజయ్ కొడుకుకు బెయిల్ ఇస్తే తన భర్తకు చైర్మన్ పదవి ఇస్తారని తప్పుడు ప్రచారం చేశాడు. అసత్య ఆరోపణలు చేసిన వారిపై హైకోర్టు రిజిస్ట్రార్ బి.ఎస్. చిరంజీవి చార్మినార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు దామెదర్‌ను అరెస్ట్ చేశారు. ఈ దుష్ప్రచారంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

## విదేశాల్లో ఉద్యోగాల పేరుతో మోసం

- బోర్డు తిప్పేసిన సీడీ దశరథ్ కన్సల్టెన్సీ



హైదరాబాద్, మే18 (జనంసాక్షి) : మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. హఫీజ్‌పేట్‌లో సీడీ దశరథ్ కన్సల్టెన్సీ బోర్డు తిప్పేసింది. విదేశాల్లో ఉద్యోగాల పేరిట నిరుద్యోగులను ముగ్గురు నిందితులు మోసం చేశారు. ఒక్కొక్కరి నుంచి రూ.6లక్షలు చొప్పున వసూలు చేశారు. నిందితులు అర్చన, సోమశేఖర్, రాజేంద్రప్రసాద్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వారికోసం పోలీసులు గాలింపు చేపట్టారు. బాధితులు ఎంతమంది ఉన్నారనే అంశంపై విచారణ కొనసాగిస్తున్నారు.

## గద్వాలలో పట్టుచీరల దొంగల అరెస్ట్



జోగులాంబ గద్వాల, మే18 (జనంసాక్షి) : గద్వాల పట్టణం కిష్టారెడ్డి బంగ్లా వద్ద పట్టు చీరల దొంగల కలకలం రేపింది. ఎప్పుడూ ప్రజలతో రద్దీగా ఉండే కిష్టారెడ్డి బంగ్లా ప్రాంతంలోని ఓ పట్టు చీరల దుకాణంలోకి సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు వెళ్లి కస్టమర్ల మాదిరిగా నటించారు. సిబ్బంది కళ్లుగప్పి విలువైన పట్టు చీరలను అపహరించిన అనంతరం, వారు ముందుగానే సిద్ధం చేసుకున్న ఒక ఆటోలో అక్కడి నుంచి వేగంగా పరారయ్యారు. గమనించిన స్థానిక వ్యాపారులు, ప్రజలు వెంటనే అప్రమత్తమై సదరు ఆటోను వెంబడించారు. కొంతదూరం వెళ్లిన తర్వాత ఆటోను అడ్డగించిన స్థానికులు అందులో ఉన్న ఆటో డ్రైవర్‌తో పాటు ఇద్దరు మహిళలను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. ఆటో డ్రైవర్‌తో పాటు ఇద్దరు మహిళలను పట్టణ ఎస్సై-2 జహంగీర్ వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370